# ఆధ్యాత్మిక ప్రశ్నోత్తరి


1. సామాన్య ప్రశ్నలు - జవాబులు
2. భక్తి సంబంధమైన ప్రశ్నలు - జవాబులు
3. వేదాంత పరమైన ప్రశ్నలు - జవాబులు
4. కర్మ సంబంధమైన ప్రశ్నలు - జవాబులు
5. సాధనపరమైన ప్రశ్నలు - జవాబులు
6. యోగ సంబంధమైన ప్రశ్నలు - జవాబులు

# ఆధ్యాత్మిక ప్రశ్నోత్తరి

శ్రీ మేధానందపురి జీ

## 1. సామాన్య ప్రశ్నలు – జవాబులు

**1.** మీరు ఇటీవల వేదేశయాత్ర చేశారు కదా ! దాని వలన ఏమైన ఆధ్యాత్మిక ప్రయోజనమున్నదా ? ఓడలలో ప్రయాణించినచో సీ.సిక్నెస్ కలుగుతుంది అంటారు. మీకు అలాంటి అనుభవాలు ఏమైనా కలవా ?

జ॥ విదేశయాత్రవలన నాకు కొంచెం ప్రయోజనం కలిగింది. ఎందువలన ననగా నేను **9** రోజులు రాష్ట్రీయ సంత్ మహాపురుషులైన శ్రీమాన్ మురారి బాపుగారి రామాయణం వినుటకై వెళ్ళినాను. వారు ఉదయం **9** గంటల నుండి మధ్యాహ్నం **2** గం॥ వలరకు అవిరామముగ తులసీ రామాయణము పై ఉపన్యసించెడివారు. ఈ **5** గంటల కాలము క్షణములవలె గడిచి పోయెడిది. విదేశములలో నున్న మన భారతీయ భక్తులు **900** మంది ఈ **5** గంటల కాలములో నిశ్చలముగా ఉండెడివారు. కునార్డ్‌ప్రిన్స్ అను ఓడలో ఈ కార్యక్రమము జరిగెడిది. అది మమ్ములను వెన్నిసు నుండి బార్సిలోనా తీసుకొని వెళ్ళినది. ఓడ ప్రయాణించుచున్నప్పుడే కథ జరుగుచుండెడిది. ప్రవక్త చెప్పుచున్న పాటలు, భజనలు మఱియు రామాయణ దోహాలు ఒకేస్వరములో అందఱును చెప్పెడివారు, ఆ శబ్దములు సముద్ర తరంగములవలె వీనుల విందుగా ఉండెడివి. విదేశములలోనున్న మన భారతీయులు హిందూ దేశములో వలె వస్త్రధారణ. అలంకారములను ధరించెడివారు. కన్ను పండువుగా ఉండెడిది. ఇట్లు ప్రవచనము జరుగుచున్నంత కాలము స్వదేశమునందు ఉన్నట్లే అనిపించెడిది.

ఒకనాడు పూర్ణిమరోజు **(31-8-93)** న సముద్ర తుఫాను వచ్చినది. ఆ రోజున మాత్రము ఓడ ఊగిసలాడినది. ఆ సమయములో కడుపులో త్రిప్పినట్లై వాంతులగు సూచన పొడసూపెను. కాని వాంతులవలేదు. అందుకు ఇంజక్షనులు ఇచ్చినారు. ఒక ఇంజక్షను ఖరీదు **660/-** రూ.లు **(20** అమెరికన్ డాలర్లు**)** మాత్రమే. తుఫాను రమారమి **18** గంటల వరకుండెను. పగలు **12** గంటలకు ప్రారంభమై మరునాడు ఉదయం **6** గం॥ల వరకుండెను. తక్కిన సమయములలో సముద్రము ప్రశాంతముగా నుండుట వల్ల ఓడ కదలిక బొత్తిగా తెలిసెడిది కాదు.

**2.** మనదేశము పుణ్యభూమియని చెప్పుచుందురు. తక్కిన దేశాలు అన్నీ పాప భూయిష్టములా! విదేశీయుల గురించి వారి ఆధ్యాత్మిక వైఖరి గురించి మీ అభిప్రాయమేమి ? మీ యాత్రలోని గమనార్హ విషయములేవి ?

జ॥ రామాయణ ప్రవచనమునకు అతిరిక్తకాలంలో అధమపక్షం రోజు ఒక్కంటికి **5** గంటలు నేను జపము, ధ్యానము చేసెడివాడను. కాని నేను ప్రార్థన చేయుచున్నాను అనెడి భావము కలిగెడిదికాదు. ఇక్కడికి వచ్చిన తర్వాత **10** లేక **15** నిముషములలోనే మనస్సులో చాల శాంతిని అనుభవించితిని. దీనిని బట్టి ఏది


For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

పుణ్యభూమియో మీరు ఊహించుకొనవచ్చును. అక్కడ ఉన్న భక్తులు కూడా అంతటి సంపద, వైభవములున్నప్పటికీ వారికీ మనశ్శాంతి లేదని స్పష్టముగా మాకు తెలిపిరి. ఓడలో ఒక పూటకు **60** రకముల భోజన పదార్ధములిచ్చెడివారు. కాని నాకు రుచిగా లేకుండెను. ఇక్కడి సాధారణమైన భోజనమైనా ఎంతో రుచిగా ఉండెడిది. ముఖ్యంగా వారికి అంటు ఎంగిలి వంటి ఆచారములు బొత్తిగా తెలియవు. ఎవరూ పట్టించుకోరు కూడా. నా ఉద్దేశ్యంలో భారతదేశంలో జన్మించియు, ధన లోభముచే విదేశాలలో నివసించుట స్వదేశ భక్తి శూన్యతనే ప్రకటించుచున్నదిఅని అచ్చటి వారి ముఖ్యమైన ఆహారము చేపలు, మాంసము, సారాయి వంటి తామసికాహారమే ఇదియే వారిని ఆధ్యాత్మికత నుండి దూరము చేయుచున్నది. మైళ్ళ తరబడి వెళ్ళినా గుడి, గోపురములు కనిపించవు. శంఖారావములు, ఘంటానాదములు, భజనలు వినిపించవు. చర్చి గంటలు కూడా చాల అరుదుగా వినిపించును. మనదేశంలో ప్రతి ఫర్లాంగుకీ ఒక గుడి, లేక భజన మందిరాలు కనిపిస్తాయి. ఇంతకీ దేశ మంటే మట్టికాదు. ఆధ్యాత్మిక సంస్కృతిలో కూడిన ముముక్షు జన సంఘ సమూహమే భారతదేశమనబడును.

**3.** కలలు ఎందుకు వస్తాయి ఝ భవిష్యత్తులో జరుగుబోయే విషయాలను కలలు సూచించునా ?

జ॥ జాగ్రదవస్థలో కలిగిన సంస్కారములే స్వప్నావస్థలో కలలు రూపములో కానబడును. ~~ఈ~~ స్వప్నములు అనేక జన్మ సంస్కారములను గాని, అనేక సంస్కారములను ఒక చోట తెలియజేయును. సాధారణముగా తెల్లవారు జామున వచ్చు కలలు నిజమగునని మన పెద్దలయొక్క అభిప్రాయము.

**4.** ఆడవారు ఓంకారము చేయవచ్చునా !

జ॥ వేదశాస్త్రములలో అత్యాశ్రములు అనగా సన్న్యాసులు (యజ్ఞోపవీతము, శిఖలను వేద విహితరీతిగా పరిత్యజించినవారు) మాత్రమే ఓంకారమును జపించుటకు అర్హులని చెప్పబడినది. సాధారణ నియమము ప్రకారముగా అది ప్రణవములతో కూడిన మంత్రములు, అద్యంత ప్రణవములతో కూడిన స్తుతి స్తోత్రములు మాత్రమే ఫలించునని యుండుటచే ప్రతివారు ప్రణవమును చెప్పుచునే యున్నరు. కాని అధికారమునకు ప్రాకులాడుట పిలువని పేరంటమునకు పోవుట వంటిది.

**5.** ద్రౌపదికి ఐదుగురు భర్తలు కదా ! ఆమె ఎలా పతివ్రతయగును ?

జ॥ ద్రౌపది పూర్వజన్మలో ఒక అందమైన, గుణవంతురాలైన ఋషికన్య. ఆమెకు ఎంత ప్రయత్నించినను వివాహము కాలేదు. అప్పుడామె శివుని గూర్చి తపస్సు చేసెను. శివుడు ప్రత్యక్షమై నీవు ఐదుమార్లు పతిందేమి అని వరమడిగితివి. కావున నీకు రాబోవు జన్మలో ఐదుగురు భర్తలు లభించెదరు అనెను. అందులకే ఆమెకు **5** గురు భర్తలు లభించిరి.

వైవాహికో విధిః స్త్రీణాం సంస్కారోవైదికః స్మృతః ।
పతిసేవా గురౌవాసో గృహార్థీ అగ్ని పరిక్రియా ॥

స్త్రీలకు వివాహవిధి వైదిక సంస్కారము వంటిది. పతి సేవ గురు కులవాసము వంటిది. గృహకార్యములు అగ్ని దేవుని సేవవంటివి. పంచపాండవులు ద్రైపదిని అగ్నిసాక్షిగా వివాహమాడిరి. వారికి ఆమె సమాన దృష్టితో సేవ చేసెను. అందులకు ఆమె పతివ్రత  ఐనది. ఆమె వారిపై ఎప్పుడును నిందారోపణ చేయలేదు. వారున్నూ ఆమెపై ఏ విధమైన నిందారోపణ చేయలేదు.  పైగా పాతివ్రత్య జీవితము గూర్చి ద్రౌపది శ్రీ కృష్ణుని పట్టమహిషియగు సత్యభామకు ఉపదేశము చేసినది.

పతిసేవను నౌకరులచే చేయించి, గృహకార్యములను పతి చేత చేయించుచు, పతిదేవుడు తన కనుసైగలలో మెలగవలయు ననుకొనువారు ద్రౌపదివంటి పతివ్రతలయొక్క, దేవకన్యల యొక్క నామమును ఉచ్చరించుటు కూడా తగరు.

**6.** ముక్తి ఇంకొకరు ఇచ్చేదికాదు అని స్వామి చిదానందులు అనిరి. జ్ఞానం జ్ఞానవతామహామ్ అని గీతావాక్యం కృషీ విజ్ఞానం అన్నీ  నేను అనిరి, వీటి సమన్వయము ఏమిటి ?

జ॥ సర్వభూత హృదయస్థమగు ప్రత్యగాత్మ రూపమునను నిత్యము నన్ను ధ్యానింపవలయును. అసమర్థుడైనచో ముందు చెప్పబడు భావములను గ్రహింపవలయును. (గీత **10**వ అధ్యాయము, **20** వ శ్లోకము - శంకర భాష్యము - అహమాత్మాగుడాకేశ) విభూతుల ధ్యానము మాత్రమే చెప్పబడినది. కారణము ఆ పరమాత్మయే నేను ప్రాణుల ఉత్పత్తి, స్థితి, ప్రళయకారమణమును అనెను. తత్త్వజ్ఞానులయందునా విభూతిజ్ఞాన రూపమున వెలయుచున్నది. దానిని ధ్యానింపుడు జ్ఞానం జ్ఞానవతామహామ్ అనెను.

ఇంద్రియ ద్వార తశ్చిత్తే బహిర్ధావతి సత్యపి ।

ఈశదృష్టి విధా నాయ విభూతేర్దశమేఽబ్రవీత్ ॥

ఇంద్రియముల ద్వారా చిత్తము బయటకు పరుగెత్తినను, ఈశ్వర దృష్టిని అవలంబించుటకు దశమాధ్యాయమున విభూతులు చెప్పబడినవి. ముక్తికి మనమే పాటుపడవలయును.  కనుకనే పరమాత్మ గీతలో ఈ క్రింది ఉపదేశముల నిచ్చిరి.

1. క్లైబ్యం మాస్మగమః నపుంసకత్వమును పొందకుము Gird up your lions (గీత **2-3**)
2. జహిశత్రుంమహాబాహో! (గీత **3-43**)

   బుద్ధికంటె వేరైన ద్రష్టయగు ఆత్మను తెలిసికొని దుర్జయమగు కామమనెడి శత్రువును జయించుము.

3. ఉద్ధరేదాత్మ నాత్మానమ్ (గీత **6-5**)

   వివేకయుక్తమగు మనస్సు చేత జీవాత్మను ఉద్ధరించుకొనుము.

ఈవిధముగా అనేకములగు ఉపదేశములున్నవి.

**7.** పట్టు పురుగుల పెంపకము వాటిని చంపి దారము తీయుట దోషమా ? కాదా ?

జ॥ ఆవుపాలను దూడకోసం ఇస్తుంది. దూడకు కొంచెము ఇచ్చి, మిగిలినవి మనము త్రాగుదుము. దూడకోసం ఇచ్చిన పాలలో కొంచము మనము త్రాగడం దోషము కాదు. నీరు, వాయువు బ్యాక్టీరియా అనేక క్రిములతో పూరింపబడియుండును. వాటిని మనము ఉపయోగించుచున్నాము. కాని దోషములేదు. పెరుగు కూడా క్రిములతో నిండియుండును దానిని త్రాగినచో దోషము లేదు. బంగాళా దుంపలను కోసి నాటినచో మొలకలు వచ్చును. ఆ దుంపలను తిన్నచో దోషము లేదు. శ్రీకృష్ణునికి పీతాంబరుడని పేరు. భగవంతుడు పట్టుబట్టను ధరించును. కావున పట్టుబట్టను భగవంతునికి వాడినచో దోషము లేదు. అవశ్యకతను మించి జంతు హింస చేయుట గొప్పదోషము.

**8.** స్వప్నానుభూతి మెదడు మనకు కలుగుజేసే భ్రమా ? లేక మనకు తెలియనటువంటి ప్రాణశక్తియా ? దైవశక్తియా ? మూలకారణం ఏమిటి ?

జ॥ క్షేత్రజ్ఞ పురుషుడు మనస్సుతో (బుద్ధితో) తాదాత్మ్యమును పొంది స్వప్నమును చూచును. సహిస్వప్నో భూత్వా ధ్యాయతీవ లేలాయ అని బృహదారణ్యక శ్రుతి వాక్యము.

మనసి ప్రలీనేషు కరణేషు అప్రలీనేచ మనపి, మనోమయః స్వప్నాన్ పశ్యతి అని ప్రశ్నోపనిషద్ శంకర భాష్యవచనము, ఇంద్రియములు మనస్సులో లీనమైన తరువాత మనస్సు లీనముకాని దశలో (లీనమైన సుషుప్తి లోనికి పోవును) మనస్సుతో తాదాత్మ్యమును పొందిన మనోమయ ఆత్మ (క్షేత్రజ్ఞుడు) స్వప్నములను చూచును.

ప్రతీజీవి పూర్వజన్మ సంస్కారములతో పుట్టును. మరియు ఈ జన్మలోను అనేక సంస్కారములు పొందును. ఇంద్రియములు లీనమై ప్రాణ వాయువు చలించుచుండగా సుషుప్తికి ముందు వారి వారి సంస్కారముల కనుగుణముగా స్వప్నములు చూచును. చూసిన, వినిన, సంస్కారములు కలుగు స్వభావమే కాని పూర్వసంస్కారములు, మిశ్రిత సంస్కారములు వలన చూడనివి, విననివి అనుభవించనిని కూడా స్వప్న రూపములో వచ్చును మనోమయ ఉపాధి, అపంచీకృత పంచభూతము ద్వారా ఏర్పడినది. కనుకనే కర్మేంద్రియములు జ్ఞానేంద్రియములు స్థూలశరీరమునకు అతీతమైనవి స్వప్నానుభవము.

**9.** పార్థసారథి కృష్ణుడా ? లేక ఉత్తరకుమారుడా ?

జ॥ ఉత్తర గోగ్రహణంలో కొద్దికాలం అర్జునుడు ప్రోద్బలంచే ఉత్తర కుమారుడు సారథ్యం వహించెను. కాని మహాభారత యుద్ధంలో అగ్ని దేవుని ద్వారా ఇవ్వబడిన దివ్య రథమును దేవతల ద్వారా పొందిన దివ్య అశ్వముల ద్వారా పూంచి మహాబలి అయిన వాయుపుత్రుని రక్షణలో ధనుర్ధారి అయిన అర్జునునిచే అధిరోహించబడినది. సారథులలో అత్యంత శ్రేష్ఠుడైన కృష్ణపరమాత్మచే సారథ్యం వహించబడినది. చాల కాలము నుండి అర్జునునకు సారథ్యం చేయించవలెనని కూడా కోరిక ఉండెను. అందులకే కృష్ణుని పార్థసారథి అందురు. కారుడ్రైవరు సెలవులో వెళ్ళిన కార్య పూర్తి కొరకు ఎరువు తెచ్చిన డ్రైవరు వంటివాడు ఉత్తరకుమారుడు.

**10.** అవసరాల కంటె ఎక్కువ ఆస్తిపాస్తులను సంపాదనను కలిగియుండుట పాపహేతువా ?

జ॥ వైరాగ్యము అనగా : 1) పుత్రైషణ, లోకైషణ , విత్తేషణ మనకు నూరిపోయుచున్నవి. కావున సన్న్యసించలేనిచో, మనకు ఎంత అవసరమో అంత ఉంచుకొనుట మంచిది ఆస్తిని. సంపాదనను వదలలేక పోయినచో దానము అధికముగా చేయుట వైరాగ్యమునకు లక్షణము. వైరాగ్యము అధికమగుట సన్న్యాసమునకు లక్షణము. ఉన్న డబ్బును సద్వినియోగము చేయుచున్నచో, అది పాపహేతువు కాజాలదు.

**11.** అగస్త్య మహర్షి కాలమేది ? ఏ కారణము వలన వారు సప్త ఋషులలో లేరు ?

జ॥ సప్త ఋషులలో గల వసిష్ఠమహర్షుల సోదరుడు అగస్త్యమహర్షి ఋగ్వేదమునను సరించి వీరిద్దరు మిత్ర-వరుణుల పుత్రులు. యజ్ఞ సమయములో మిత్రావరుణులు ఊర్వశిని చూచి మోహవశులైన కారణముచే వీర్యపాతము జరిగెను. ఆ వీర్యము కొంత కుండలోను, కొంత నీటిలోను పడినది. ఘటము నుండి అగస్త్యుడు, నీటి నుండి వసిష్ఠుల వారు పుట్టిరి. వింధ్యాఖ్యం అగం అన్యతి ఇతి అగస్త్యః వింధ్య పర్వతమును అణచినవాడు అగస్త్యుడు. లేక అగఃకుంభఃతత్రస్త్యానః కుండ నుండి పుట్టినవాడు అగస్త్యుడు. రామావతార సమయముననే వీరుండిరి. ఏలననగా : విష్ణువు యొక్క ధనుస్సును రామునికి ఇచ్చ వారితో అయోధ్యకు తిరిగి వచ్చిరి. రావణుని చంపుటకు పూర్వము సూర్యస్తోత్రమగు ఆదిత్య హృదయము ను అగస్త్యుడు శ్రీరామునికి ఉపదేశించెను. కుంభయోని, కుంభజ కుంభసంభవ, ఘటో (కలశో) ద్భవ, కలశయోని, మైత్రావరుణి, ఔర్వశేయ అని అగస్త్యుని నామధేయములు, సప్తచతే ఋషయః సప్త ఋషయః చిత్రః శిఖండః చూడావిశేషః అస్తియేషామ్ చిత్ర శిఖండినః విచిత్రమైన జుట్టు (పిలక) విశేషము నడతలపై కలవారు సప్త ఋషులు, చూడాకరణ సంస్కార సమయమున (బిడ్డకు మొదటిసారి తల వెంట్రుకలు తీయు సంస్కారము) వదిలిన పిలక విశేషము. ఇది కలవారే సప్త ఋషులు, మరీచి, అంగిరస్సు, అత్రి, పులస్త్య, పులహ, క్రతువసిష్ఠులు.

**12.** ఆస్తిక, నైతిక సూత్రములకు ఆధారమేమి ? దైవమునకు, మానవునికి గల సంబంధమేమి ?

జ॥ వేదములే ఆస్తిక సూత్రములకు ఆధారము, మనుస్మృతి నైతిక మూడు రకముల అస్తిత్వములు (సత్తా) కలవు. పారమార్థికముగా చూచినచో మనిషికి, పరమాత్మకు భేదము లేదు. వ్యావహారిక స్థితిలో జీవుడు వేరు, పరమాత్మవేరు. ప్రాతిభాసికమనగా – భ్రమ, ఆధారమైయున్న బ్రహ్మమునందు జీవజగత్తులు కనిపించుచున్నవి. జీవ జగత్తులు అనిత్యములు, బ్రహ్మము నిత్యము. మీరు ఆంజనేయులవారి శ్లోకార్థమును గమనించుడు. దేహబుద్ధిచే నేను నీదాసుడను. జీవబుద్ధి ఉన్న సమయములో నేను నీ అంశమును ఆత్మబుద్ధి ఉన్నప్పుడు నీవే నేను – నేనే నీవు అని నా నిశ్చయము.

మీరు వ్యవహారదశలో ప్రశ్న వేసితిరి. దైవమనగా దేవతా విశేషమైన బ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినోఽర్జున కీటపతంగము నుండి చతుర్ముఖ బ్రహ్మ వరకు మరల మరల జన్మించెదరు. కనుక దేవతా విశేషములు అనిత్యములు. ఇక దైవమనగా నిరాకార, నిర్గుణ బ్రహ్మమనె భావన యున్నప్పుడు

వ్యవహార దశలో అజ్ఞానము వలన వేరుగా కనిపించుచున్నాడు. సాధన చతుష్టయ సంపన్నులు తీవ్రమైన సాధన చేసి, జ్ఞానమును పొంది. బ్రహ్మవేత్తలై ఆ పరబ్రహ్మముతో ఏకీభవింతురు. అనిత్యమైన స్థూల, సూక్ష్మ, కారణ శరీరములతో పరమాత్మకు ఏ విధమైన సంబంధము లేదు. ఇక నిరుపాధిక ఆత్మను భావించినచో అది ఆ పరమాత్మ స్వరూపమే యగును. కావున జడ శరీరమునందు చైతన్యము అధ్యాసమొనర్చి చైతన్యాత్మనందు జడమును అధ్యాసమొనర్చి, వ్యవహారము జరుగుచున్నది. విశిష్టాద్వైత, ద్వైత, అద్వైతములు పరమావధికి సోపానములు, భక్తి మార్గములో సఖ్య – దాస్యములకు సంబంధము కలదు. అని ద్వైతపరములు. ఆ సంబంధముల వలన మోక్షము లేదు. నామ దేవుని కథ దీనికి ఉదాహరణము.

నామ దేవుడు భక్తితో శ్రీ కృష్ణుని పూజించి, నిత్యము వారి దర్శనమును పొందుచుండెను. ఒకసారి భక్తుల సభ యందు ఘోరాకుంభారు నెత్తిపై కొట్టగా (నామదేవుని) కోపించుట వలన అపక్వ భక్తుడుగా ఉద్ఘోషింపబడెను. అప్పుడు నామదేవుడు ఏమి నేను భక్తుడను కానా ! యని శ్రీ కృష్ణుని ప్రశ్నించెను. దానికి శ్రీ కృష్ణ పరమాత్మ నీకు అద్వైతోపదేశము కానందు వల్ల అపరిపక్వుడవు. వారణాసి యందలి విఠోభా బేచర్ నుండి దీక్ష తీసుకొని రమ్మ ని చెప్పెను, నామదేవుడచ్చటికి వెళ్ళగా వృద్దుడైన విఠోభా ఖేచర్ శివలింగము పై కాళ్ళు చాపి నిద్రించుచుండుటను చూచి, మరలివచ్చుటకు సన్నద్ధుడయ్యెను. అప్పుడా గురువు తన శిష్యుని నామధేయముతో పిలిచి, అతడు వచ్చిన ఉద్దేశ్యము నడిగెను. విషయము తెలిసికొని గురువుగారు నేను ముసలివానిని, కదలలేను. కనుక నీవు నా కాళ్ళను శివలింగము లేని చోట ఉంచు మనెను. అప్పుడు నామధేవుడు వారి కాళ్ళను అని వైపుల ఉంచి చూచెను. కాని కాళ్ళు ఎక్కడ ఉంచినను అక్కడికా శివలింగము కదలివచ్చెను. ఇది అద్వైతస్థితి. దుర్లభమైనను అసాధ్యము కాదు. వాసు దేవ స్సర్వమితి స మహాత్మా సుదుర్లభః అని గీతోక్తి.

**13.** స్వామీజీ! అవధూత దత్తాత్రేయులనగా ఎవరు ? వారికి ఏ సందర్భములో **24** గురువు లున్నారని చెప్పబడింది ?

జ॥ అక్షరుడు, శ్రేష్ఠుడు, సంసారబంధనము లేని వాడు తత్త్వమస్యాది వాక్యములకు లక్ష్యమైనప్పుడు అతడు అవధూతయని చెప్పబడును. ఎవడు ఆశ్రమములను, వర్ణములను (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యాదివర్ణములను) అతిక్రమించి, ఆత్మయందే ఉండునో (ఆత్మచే ఆత్మయందే రమించునో) అట్టి యోగి అవధూత యనబడును.

నారాయణాకారం దత్తాత్రేయ ముపాస్మహే నారాయణాకారుడైన దత్తాత్రేయుని ఉపాసించుచున్నాము బ్రహ్మదేవుడు నారాయణుని తారకమేదో చెప్పమని అడిగెను. దానికి నారాయణుడు సత్యానందచిదాత్మకమైన, సాత్త్వికమైన నా పరమపద స్థానమే తారకము. దాని నుపాసించమనెను. నేను దత్తుడనని ప్రీతితో పలుకువారు సంసార బంధనము నందు చిక్కుకొనరు. ఇట్లు వివరింపబడినవాడై, బ్రహ్మదేవుడు, విశ్వరూపధరుడు, విష్ణువును నారాయణునే దత్తాత్రేయునిగా ధ్యానించెను. దం అనుదానికి

దాం అనునది దీర్ఘము. ఇది బీజము. దీనికి దత్తాత్రేయుడు దేవతా గాయత్రిఛందస్సు, సదాశివుడు ఋషి, ద్రం అనిగాని ద్రాం అని గాని ఉచ్చరించి దత్తాత్రేయాయనమః అన్నచో అష్టాక్షరియగును. ఇది సర్వోపకారి మంత్రము, కావున సంసార బంధనములేని నారాయణుడే అవధూతయగు శ్రీ దత్తాత్రేయుడు.

వాసుదేవ భగవానుడు అవతారము చాలించిన పిమ్మట కలియుగము ప్రారంభమయ్యెను. కలియుగములో ప్రాణులు అధర్మ పరులైయుందురు. ఈ జగత్తులో మనస్సు ద్వారా చింతింపబడునని, వాక్కు ద్వారా చెప్పబడునది, కండ్లతో చూడబడునవి మఱియు చెవులతో వినబడునవి మున్నగు ఇంద్రియముల ద్వారా అనుభవింప బడునవన్నియును నశించునవే. ఇవి యన్నియు స్వప్నతుల్యములు. కావున మాయామాత్రములు, మిథ్యయని గ్రహింపవలయును, గుణ, దోషబుద్ధి కలవారికై విహితకర్మ, నిషిద్ధకర్మ, అకర్మ (విహిత కర్మలోపము) వేదములలో చెప్పబడినవి. గుణ,దోష ములకతీతుడైనవాడు బాలకుని వలె నిషిద్ధ కర్మల నుండి విడివడును. కాని విహితకర్మల నాచరించును. వృత్తిరహితుడై బ్రహ్మాత్మైక్యము (బ్రహ్మ + ఆత్మ + ఐక్యము) నొందినవాడు సమస్త ప్రపంచమును తన ఆత్మస్వరూపముగా చూచును. పై విధముగా అవతారము చాలించుటకు పూర్వము కృష్ణ పరమాత్ముడు ఉద్ధవునికి ఉపదేశించెను, అప్పుడు ఉద్ధవుడు శ్రీకృష్ణునితో మీరు నాశ్రేయస్సునుకోరి సన్న్యాసరూపమైన త్యాగమును ఉపదేశించిరి. కాని విషయలంపటులకు త్యాగము కఠినము. కావున త్యాగ తత్త్వమును దాసుడనైననాకు సులభముగా సాధన చేయురీతిని ఉపదేశించుడ ని పలికెను.

అప్పడు శ్రీ కృష్ణుడిట్లు నుడివెను. ప్రపంచము ఏమిటి ? దీని యందేమి జరుగుచున్నది ? అను ప్రశ్నలకు వివేకవంతులు స్వయముగా విచారించి, ప్రాపంచిక వాసనల నుండి తప్పుకొందురు. మనుష్యులకు హితాహితముల నుపదేశించువాడు గురువు. నేను ఒక్క పాదముగల ప్రాణి నుండి అనేక పాదములుగల ప్రాణులను సృష్టించితిని. కాని రెండు పాదములు గల మనుష్యుడే నాకు ప్రియుడు. ఈ మనుష్యుడే అహంకారాతీతమైన విషయాతీతమైన నన్ను ఈశ్వరునిగా సాక్షాత్కరించుకొనగలుగును. ఈ విషయమునకు సంబంధించిన ఇతిహాస మొకటికలదు. అది పరమతేజస్వంతుడైన అవధూత శ్రీ దత్తాత్రేయులు మఱియు యదురాజుకు జరిగిన సంవాదము.

ఒకసారి ధర్మమర్మములు తెలిసిన యదురాజు త్రికాలదర్శియు, తరుణుడును, నిర్భయుడునగు ఒక్క పరివ్రాజకుని చూచెను. మీరు కర్మలను ఆచరించుట లేదు. మీకు బ్రహ్మజ్ఞానమెట్లు కలిగెను ? దేనినాశ్రయించి, బాలకునివలె విహరించుచున్నారు ? మనుజులు ఆయుష్యము, కీర్తిసౌందర్యము, సంపదలను కోరి ధర్మార్థ కామములను అనుష్ఠింతురు. కారణము లేక ప్రవృత్తి యుండదు. మీరు సమర్థులు, సౌందర్యవంతులయ్యు జడ, ఉన్మత్త, పిశాచునివలెనున్నారు. కర్మనాచరించుట (ప్రవృత్తి) లేదు మీకు ఆశలు లేవు, సంసారులను దహించు కామములోభములు మిమ్ము అంటుట లేదు. మీరు ముక్త స్వరూపులు, మీరు స్త్రీ పుత్ర, ధనాది సంసార రహితులు. మీకు మీ ఆత్మయందే అనిర్వచనీయమగు

ఆనందం ఎట్లు కలుగుచున్నది దయతో వివరించుము ని యదురాజు అవధూత శ్రీ దత్తాత్రేయులవారి నడిగెను. దానికి శ్రీ దత్తాత్రేయులు నేను నా బుద్ధి పూర్వకముగా **24** గురువులను ఆశ్రయించితిని. నీవు వారి పేర్లను, వారి నుండి నేను గ్రహించిన పాఠములను వినుము నిరి.

**14.** సన్న్యాస మననేమి ? దేనిని సన్న్యాసమందురు ?

జ॥ సంకల్ప త్యాగమే సన్న్యాము, ఇచ్ఛ, కామనలను పూర్తిగా త్యజింపవలయును. ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ గృహస్థాశ్రమములో ఉండియు, సంకల్పములను త్యజించిన వారు సన్న్యాసులే యగుదురు. కాషాయవస్త్రములు ధరించి, సంకల్పములను త్యజించనిచో వారు సాధకులు మాత్రమే! సంకల్ప త్యాగులే మోక్షార్హులు. శ్రవణ మననాదుల నొనర్చి జ్ఞానమును సంపాదించినచో మోక్షము కలుగును. లేక వేద విహిత కర్మలను నిష్కామ బుద్ధితో చేసి, చిత్తశుద్ధిని సంపాదించిన వారు కూడా క్రమ ముక్తిని పొందుదురు. బాహ్య వస్తువుల చింతనను వదలి (పుత్ర – విత్త – లోకైషణముల త్యాగము) సర్వత్ర బ్రహ్మ దృష్టిని కలిగినవారే యతు (సంన్యాసులు) లగుదురు. ఇట్లు ముఖ్యముగా సన్న్యాసులే చేయగలుగుదురు. ఇక నిష్కామ కర్మయోగము ననుసరించు గృహస్థులు కర్మ ఫలమే నాశింపక సంకల్ప త్యాగము నొనర్పగలుగుదురు. కనుక ముఖ దృష్టితో సన్న్యాసులను, గౌణదృష్టితో గృహస్థులను ఏకీభవించి సన్న్యాస – కర్మ యోగములు ఒకటిగా చెప్పబడినవి. శ్రీ మద్భగవద్గీతలోని **6**వ అధ్యాయములోని **2** వ శ్లోకమునందిట్లు కలదు. యం సంన్యాస మితి ప్రాహుః యోగంతం విద్ధి పాండవ.

**15.** రామాయణ కాలం నాటి సత్యకామ బాబాలి నాస్తికుడా ?

జ॥ వేదముల అంతిమ భాగమైన ఉపనిషత్తులలో పేర్కొనబడిన సత్యకామ వచ్చిన జాబాలినైయాయికుడు, శుద్ధ నాస్తికుడు అనగా : తర్కశాస్త్ర ప్రవీణుడు. అతడు రాములవారితో తర్కించెను. వనము అనగా ప్రపంచములోని అన్ని వనములనియు, లేక ఏదియో ఒక వనము అనియు అర్థము. ఓ రామా! నీవు అన్ని వనములలో తిరుగాడలేవు ఏదో ఒక వనమునకు వచ్చినచో వనవాసము పూర్తియైనట్లే. కనుక **14** సంవత్సరముల వనవాసమును వదలి భరతుడు ఇచ్చిన రాజ్యమును పరిపాలించుము అనెను. ~~ఈ~~ జాబాలి దశరథుని పురోహితులయందొకడు (Priest of King Dasharatha and an infidel Brahmin) ఇతని మాటలు రాములవారికి బోధపడలేదు. కనుక కేవలము తర్కశాస్త్రముతోపాటు వేదాంతము చదివినచో శాపవిముక్తులగుదురు అనిరి. కనుకనే ఆద్య శంకరాచార్యులవారు శ్రుతి మతః తర్కోఽను సంధీయతామ్ అనిరి. శ్రుతి ప్రతిపాదించినట్టి విషయములను తోడ్పడు తర్కములను మాత్రమే అనుసంధానము చేయవలయును.

ఉదాహరణ : జాగ్రదవస్థా మిథ్యా దృశ్యత్వాత్ స్వప్నవత్ అని తర్కము.

**16.** శంకరుని భార్యగా పరిగణింపబడే గంగాదేవి శంకరుని భార్యగా ఉండెనా ?

జ॥ నాయనా ! శంకరుని భార్య పార్వతి గంగాదేవికాదు. గంగాదేవి మీద అపార స్నేహం ఉండడం వలన ఆమెను శంకరుడు జటా జూటములలో ధరించినాడు. శివుని జీవితము ఎల్లప్పుడు లోకోపకారానికే. గంగాదేవి అవతరణ కాలంలో భూదేవి ఆమె వేగమును భరించలేదు కనుక శివుడు ఆమెను తలపై ధరించి భూదేవిని కాపాడుతూ, లోకానికి మేలు చేసినాడు, అష్టవసువుల ప్రార్థన కారణంగా గంగాదేవి శంతనుని భార్య అయినది.

**17.** రావణుడు ప్రతిరోజు అనేక శివ పూజలు చేశాడు. సీతమ్మను మాత్రము చెరపట్టి తెచ్చినాడు. కాని ముట్టుకోలేదు. వానిని రావణాసురుడుగా ప్రకటించారు. ఇంద్రుడు ఋషిపత్ని అయిన అహల్యను చెరిచాడు కాని అతణ్ణి దేవేంద్రుడు అన్నారు కారణమేమి ?

జ॥ కలియుగానికి **4,32,000** సంవత్సరములు, దీనికి రెండు రెట్లు ద్వాపరం. దీనికి మూడు రెట్లు త్రేతాయుగము దీనికి **4** రెట్లు సత్యయుగము ఈ నాలుగు యుగములను కలిపి ఒక మహాయుగము అని అందురు. అటువంటి వెయ్యియుగములు బ్రహ్మకు ఒక పగలు, బ్రహ్మయొక్క ఒక పగలుతో పద్నాలుగు మంది ఇంద్రులు మారుదురు. కనుక అది ఒక పదవే కాని, వ్యక్తి పేరు కాదు. ఈ కాలములో చూచినట్లుగా పెద్ద పదవిలో ఉన్న వారు అప్పుడప్పుడు తప్పులు చేస్తూ ఉంటారు. అదేవిధముగా ఒక ఇంద్రుడు చేసిన తప్పుకు గౌతముని మూలాన శాపగ్రస్తుడయ్యెను, కాని వైకుంఠ ప్రాప్తి కలుగలేదు. ద్వారపాలకులైన జయ విజయులు సనకాది పురుషుల వలన శాపగ్రస్తులై రాక్షసులుగా జన్మించిరి. వారితో విష్ణువు మిత్రులుగా ఆరుజన్మలలో వైకుంఠము చేరెదరా ? లేక శత్రువులై మూడు జన్మలలో వైకుంఠము చేరుదురా ? అని అడుగగా స్వామి భక్తులైన జయవిజయులు శత్రువులై త్వరగా వైకుంఠము చేరుటకై అంగీకరించిరి. రాములవారు తన లీలలను విస్తరింపజేయుచు అసలు సీతను అగ్నిలో ప్రవేశింపజేసి, మారురూపమైన సీతను రావణుడికి వదలెను. రావణుడు సీతను అపహరించనిచో త్వరగా మృత్యువును చవి చూడలేడు. అందులకే రామ ప్రేరితుడైన రావణుడు సీతను అపహరించి లంకను కోల్పోయి భగవంతుడైన శ్రీరాముని చేత చంపబడి వైకుంఠప్రాప్తిని పొందెను. పెద్దవారు తప్పుచేసినచో శిక్ష అధికము, చిన్న వారు తప్పుచేసినచో కొద్దిగా శిక్షింపబడి ఆ తరువాత అనుగ్రహమునకు పాత్రులగుదురు, అదే విధముగా రావణునికి జరిగింది. బ్రహ్మగారి ఒక పగలులో పద్నాలుగురు ఇంద్రులు, ఈ విధముగా ఒక సంవత్సరమునకు **365 x 14** ఇంద్రులు, ఈ విధముగా బ్రహ్మగారి వయస్సు **100** సంవత్సరములు కనుక బ్రహ్మగారి ముందు ఇంద్రుడు ఒక దోమతో సమానము. కనుకనే శాపగ్రస్తుడయ్యెను.

**18.** భీష్ముడు పాండవులకు న్యాయం ఎందుకు చేయలేదు ? అన్ని ధర్మ సూత్రములు తెలిసినవాడై ఉండి కౌరవులకు చెప్పి రాజ్యం ఎందుకు పాండవులకు ఇప్పించలేదు ?

జ॥ భీష్ముడు అష్టవసువులలో ఒక్కడు, పూర్ణ పరమాత్మ అవతారము కృష్ణుడు, కృష్ణ పరమాత్మ ఉపదేశించినను, దుష్టుడగు దుర్యోధనుడు వినలేదు. ఇకవానికి భీష్ముడు ఒక లెక్కా ? అదీగాక

దుష్టుడయిన దుర్యోధనుని ఉప్పుతిని భీష్మునకు బుద్ధి పని చేయలేదు. అందులకే ద్రౌపది వస్త్రాపహరణ సమయములో కూడా భీష్ముడు ఏమియు చేయలేక పోయెను.

## 2. భక్తి సంబంధమైన ప్రశ్నలు – జవాబులు

శ్రీ మేధానందపురి జీ

**1.** గృహస్థుని నివాసములలో, పూజా మందిరముల యందు శివలింగములు ఉండవచ్చునా.

జ॥ శివలింగములు తప్పక గృహస్తుల నివాసములలో ఉండవచ్చును. నర్మదా పూజ, ధూప, దీప, నైవేద్యములను చేయవలయును. వీలైనచో పూజా సమయమునందు గంగా జలముతో అభిషేకము చేయవలయును. శం కల్యాణము కరోతి చేయువాడు. శంకరోతి ఇతి శంకరః అతి త్వరగా, అతి తేలికగా ప్రసన్నుడై కోరికలు తీర్చువాడు శంకరుడు.

**2.** శ్రీ గణపతి సచ్చిదానందస్వామి వారిని ఆరాధించే భక్తులు శ్రీ స్వామి శివానందుల వారిని ఆరాధింపవచ్చునా ? లేక ఏ ఒక్కరినైనా ఆరాధించుట మంచిదా ?

జ॥ ఏకం సత్ విప్రా బహుధావదంతి యని శ్రుతి. ఆ పరమాత్మ ఒక్కడే. కాని విప్రులు బహుప్రకారములుగా (బహురూపములుగా) చెప్పుదురు. పై ఇద్దరు స్వాములలోను ఒకే పరమాత్మనుచూచి ఆరాధించుటలో తప్పులేదు. పూజలు చెయ్యవచ్చును. మీకు అనన్యభక్తి కావలసియున్నచో ఎల్లప్పుడు ఒకే మూర్తిని ధ్యానించుట మంచిది. ఈ రోజు ఒక చోట, రేపు మరొకచోట, మర్నాడు వేరొక చోట కొంచెము – కొంచెముగా త్రవ్వినచో నీరు దొరకదు. ఒకే చోట లోతుగా త్రవ్వినచో అది బావి రూపముదాల్చి, ఎల్లప్పుడు నీటిని సరఫరా చేయును సాధకుడు అందటిలోను తన ఇష్టదేవతను చూచుటకు అభ్యసించుట మంచిది.

**3.** గృహస్థులు, శూద్రులు గాయత్రీ జపమును చేయవచ్చునా ?

జ॥ సుప్రసిద్ధులగు మహాత్ముల నుండి మంత్రదీక్ష తీసికొని, ధారాళముగా గాయత్రీ మంత్రమును జపము చేయవచ్చునని శ్రీ స్వామి వివేకానందుల వాణి.

**4.** పంచామృత ప్రాముఖ్యతను వ్రాయగలరు ?

ఓం సర్వ కల్మషనాశాయ పరిపూర్ణ సుధాత్మకమ్ ।

మధుపర్కమిమందేవ కల్పయామి ప్రసీదయే.

అన్ని దోషముల నాశనమునకు, పరిపూర్ణ దేవతాపేయము (త్రాగుటకు యోగ్యమైనది) అగు మధుపర్కమును కల్పించుచున్నాము. దీని ద్వారా నాపై ప్రసన్నముగుమని అర్థము.

**1)** పాలు – పుష్టి నిచ్చును. ఆరోగ్య అనారోగ్య, సర్వావస్థల యందు (బాల – యౌవన – వార్ధక్యావస్థలు) సేవించినవారు బలవంతులగుదురు.

**2)** పెరుగు – దధ్నాజహాతి ఇంద్రియకామః అని పూర్వ మీమాంసనుడివెను. ఇది ఇంద్రియముల సౌష్ఠవమునకు దోహదకారి.

3) నెయ్యి – ఆయుర్వైఘృతమ్ ఆయుష్యమును పెంపొందించును, కావున నెయ్యి ఆయుష్యముతో పోల్చబడినది.

4) పంచదార – ఇది పండ్లరసములకు ప్రతీకము. దీనిచే ఆరోగ్యము అభివృద్ధి నొందును.

5) తేనె – ఇది పుష్పముల రసమునకు ప్రతీకము, ఆనందము నిచ్చును. మన పెద్దలు తేనె పలుకులు పలుకుదురు. అంటే ఆనందదాయకములని అర్థము.

తెల్లని పదార్థములు సత్త్వమునకు ప్రతీకములు. సత్త్వాత్సంజాయతే జ్ఞానమ్ అని గీతాచార్యులు నుడివిరి. ఈ పదార్థములను సేవించుటచే సత్వాంశము పెరిగి జ్ఞానము అభివృద్ధి నొందును. దేవోభూత్వా దేవాన్ యజేత్ నీవు దేవతవై దేవతను పూజింపుమని అర్థము. పూజలో మొదట దేవతను ధ్యానించి, హృదయములోనికి వచ్చినట్లు భావించి, ఆ తర్వాత హృదయమునుండి బయటకు లోనికి వచ్చినట్లు భావించి, ఆ తర్వాత హృదయము నుండి బయటకు వచ్చినట్లు భావించి పూజింతురు. కావున తెల్లని పదార్థములను సేవించుట మంచిది, కాని తెల్లగానున్నదని కల్లు – సారాయీలను పుచ్చుకొన్నచో ఉన్న బుద్ధికూడా మటుమాయమగును. సురాం నపిబేత్ అని సురాపానమును శాస్త్రము నిషేధించుచున్నది.

5. భగవంతుడు రాక్షసులకు దర్శనం ఇచ్చి, ముక్తినిచ్చి నట్లు భాగవతంలో కథల ద్వారా తెలియచున్నది. కాని మా యింట్లో రోజు భజనలు, పూజలు మొదలైనవి చేస్తున్నా, మాకు భగవంతుడు ఎందుకు కనిపించడు ?

జ॥ కంసుడు వైకుంఠములో భగవంతుని ద్వార పాలకులిగా వుంటూ సనకాదుల శాపమునకు గురియై రాక్షస జన్మమెత్తి భగవచ్చింతన చేసి మోక్షము పొందెను. అదే విధముగా ఇతర రాక్షసులు క్రింద జన్మలో భగవచ్చింతన చేసిన వారే. అట్టి వారికే ఆయన దర్శనమగును పాండవులలో నరుడుగా అర్జునుడు నారాయణునితో బదరికాశ్రమములో తపస్సు చేసినందున అర్జునునికి మాత్రము విశ్వరూపదర్శనమైనది. కనుక అతి తీవ్ర చింతన (తపస్సు) ఆవశ్యకము.

నీకు తెలియని వస్తువులను మీ తల్లి గారిని లేక మీ టీచరుని అడిగి తెలుసుకుంటావు. అనగా మొదట ఆ వస్తువుయొక్క సంస్కారము లేదు తరువాత వచ్చినది. చిన్న పిల్లలు తల్లినడిగి కుక్క, పిల్లి మొదలైనవాటిని గుర్తించెదరు. ఆ తరువాత అడుగకుండగనే చెప్పగలరు. ఎందువలనంటే జన్మల నుండి వచ్చుటవలన అనేక సంస్కారములు గలది. వానిని తొలగించి ఒక్క భగవత్ స్వరూపమునే ఎల్లప్పుడు తలంచిన ఆయన దర్శనమగును. నీవు ఎండిపోయిన ఇంకు సీసాను చూసియేయుందువు. దానిని కుళాయి క్రింద వుంచిన ఆ ఇంకు నెమ్మదిగా కరిగి దానంతటదే పైకి వచ్చును. అనంతరము నీటిధారవలన ఇంకు పూర్తిగా కడిగివేయబడి కేవలము స్వచ్ఛమైన నీరే పోసినది పోసినట్లు వచ్చును అదే రీతిగా నిరంతరం భగవంతుని స్వరూపమును ధ్యానించుటవలన మిగిలిన సంస్కారములు తొలగి, ఆయన దర్శన భాగ్యము తప్పక, కల్గును. దేవకీ

వసుదేవులు భగవంతుని స్మరించి వరదానమడుగగా వారికి కృష్ణ పరమాత్మ కుమారుడుగా జన్మించెను. వారడిగినది నీలాంటి కుమారుడు కావలెనని మాత్రమే!

**6.** జపము చేయుచున్న సమయమున మనస్సు వేరే విషయములలో సంచరించును, అట్లు సంచరించుచున్న సమయములో చేసిన జపము ఫలవంతమగునా ?

జ॥ సముద్రములో అలలు వచ్చునప్పుడు స్నానము చేయనిచో మరి స్నానము చేయలేము. అలల మధ్యలో స్నానము చేసినపుడు పూర్తి ఫలము గలదు అట్లే మనసు వేరే విషయములతోనే సదా ఉండును. దానిని బుజ్జగించి భగవంతునిపై మరల్చవలెను. స్వల్ప మప్యస్య ధర్మస్యత్రాయతే మహతో భయాత్ భగవంతుని చింతన కొద్ది మనస్సు తో చేసినను అధిక ఫలము నిచ్చును. ఒకసారి కృష్ణపరమాత్మ నారదునికి నూనె గిన్నెతో నింపి, నూనె ఒలకకుండా కొండ చుట్టూ తిరిగిరమ్మనెను. తిరిగి వచ్చిన నారదుని పరమాత్మ కొండ తిరిగే సమయములో ఎన్నిసార్లు నన్ను స్మరించితివని యడిగెను. దానికి నూనె ఒలకకుండా ఉండుటకు నూనె గిన్నె ధ్యానముతోనే సరిపోయినది. ఇంక నీ స్మరణమెక్కడ అనెను. ఇంత చిన్న పనిలోనే నీవు నన్ను మరచితివి నా గృహస్థ భక్తులను చూడుము. వారిపై ఎంతభాధ్యతయున్నది. కాని వారు నా స్మరణను వీడరు అనెను. కనుక మనము ఆ పరమాత్మ ఇచ్చిన మనసుతోనే స్మరణ చేస్తాము. కాని లేని స్వచ్ఛమైన మనస్సు ఎక్కడ నుండి తీసుకొనిరాగలము. గంగ గోవుపాలు గరిటెలైన చాలు. కడివడైననేమి ఖరము పాలు అన్నట్లు మనసావాచా భగవంతుని కొన్ని సెకండ్లు స్మరించిన చాలును. పూర్తి మనసుతో స్మరణము చాల తపస్సు చేసిన లభించగలదు.

**7.** ఒక గురువు వద్ద మంత్రోపదేశము తీసికొని జపించుచు వేరొక భగవంతుని జపించుట సరియైనదా కాదా ?

జ॥ ఒక దేవుని మంత్ర జపము చేయుచు మరల వేరొక దేవుని మంత్రమును జపించుట అనావశ్యకము, ఒకే చోట త్రవ్వుచూ పోయినచో నీటి ఊట లభించును. కొది కొద్దిగా అనేక చోట్ల త్రవ్వినచో బావి నీరు లభింపదు. భగవంతునినామములు, స్వరూపములు వేరైనను ఆయన యొక్క నిజతత్త్వము ఒక్కటే. కనుక ఏ పేరుతో పిలచినా, ఏ రూపమునందు స్మరించినా ఆయన తప్పక లభించును. భావాద్వైతం సదాకుర్యాత్, క్రియా ద్వైతంన కర్హిచిత్ కావున ఏ స్వరూపమైనను, ఏ నామమునైనను నిందించుట మంచిది కాదు. ఒక మనస్సుతో ఒకే చోట నిలుకడచెందుట మంచిది. కోతిలాగ ఒక కొమ్మనుండి వేరొక కొమ్మకు ఎగురుట మంచిది కాదు. అందరినీ గౌరవించి, ఆదరబుద్ధితో చూసినటువంటి ఆంజనేయస్వామి వారు కూడ తన యొక్క ఇష్టదైవమగు శ్రీ రామునియందు నిష్ఠను వదల లేదు. ద్వాపరములో ద్వారకకు పోయి కూడ హనుమంతుడు శ్రీరామునే దర్శించెను అచ్చటనున్న రుక్మిణి, శ్రీకృష్ణులు హనుమంతునికై సీతారాములుగా మారిరి.

**8.** శ్రీ వేంకటేశ్వర స్వామియే కలియుగ దైవమని చెప్పుటలో గల విశేషమేమి ?

జ॥ ఉపనిషత్తులలో, వేదములలో చెప్పబడిన నిరాకార, నిర్గుణ పరబ్రహ్మతత్త్వము ఒక్కటే. ఆ పరమాత్మ సంభవామి యుగే యుగే అన్నట్లు ఆయా యుగములలో ఆయా రూపములను ధరించి దుష్టులను శిక్షించి శిష్టులను రక్షించుచుండును.

గీతలో దదామి బుద్ధియోగంతం యేనమాముపయాంతితే అని చెప్పబడినది. అనగా సాకార – సగుణములతో పూజించి, నన్ను పొందిన వారికి నిరాకార నిర్గుణ తత్త్వమును అనగా జ్ఞానమును పొందుటకు సమర్థవంతమైన బుద్ధిని నేను ఇచ్చెదనని శ్రీకృష్ణుడు పలికెను. ఏ రూపముతోకొలిచినా ఆ రూపమునందే నిష్ఠ ఉండవలయును. కాని మిగిలిన రూపాలను అనాదరణ హేళన చెయ్యరాదు. పాతిక చోట్లలో గోతులు తీసినచో నీరురాదు. ఒకే చోట 25 అడుగులు త్రవ్వినచో నీరు దొరుకును. ఇదియే నిష్ఠ అనబడును. క్రొత్తసీసాలో పాత సారాయి అను సామెత కలదు. మనకు కావలసినది సారాయి, కాని సీసా కాదు. అట్లే ఆ అనాదియైన పరబ్రహ్మము త్రేత – ద్వాపర యుగములలో రాముడు, కృష్ణుడుగా వచ్చి ఇప్పుడు కలియుగములో శ్రీనివాసుడై వెలసెను. ఉదాహరణకు మీకు శ్రీ రాముడు ఇష్టదైవమైనచో ఆ ఏడుకొండల వానిలో కూడా రామునే చూడుడు. ఆంజనేయులు ద్వారకకు వచ్చి రాముని చూచెనుకదా ! గాయత్రి ఉపాసకులకు సూర్యుడు, కృష్ణోపాసకులకు కృష్ణుడు, ఆంజనేయోపాసకులకు ఆంజనేయుడు తోడ్పడునట్లు, ఈ కలియుగములో ఆ వేంకటేశ్వర స్వామిని కొలిచే వారిని ఆయన కాపాడుచుండును. కావలసినది ఆ పరమాత్ముని శక్తియందు శ్రద్ధాభక్తులు, కాని నామ రూపాలయందు మమత కాదు. ఆ పరతత్త్వము నామరూపాల కతీతమై యున్నది ఎప్పుడూ కొలిచే కాళీమాతను జ్ఞానఖడ్గముచే రెండుగా ఖండించిన తరువాతనే శ్రీ రామకృష్ణ పరమహంసగారు 3 రోజులు నిర్వికల్ప సమాధిని పొందిరి.

**9.** కృష్ణుడు పాండవ పక్షపాతియైనచో అభిమన్యుని ఎందుకు రక్షించలేదు ?

జ॥ క్రిందటి జన్మలో అభిమన్యుడు రాక్షసుడు. శ్రీకృష్ణ పరమాత్మ అతని సూక్ష్మ శరీరమును కుంకుమభరణిలో బంధించెను. సుభద్రకు ఈ విషయము తెలియదు. కనుక ఆమెభరణి తీసిన వెంటనే ఆరాక్షసుడు ఆమెలో ప్రవేశించెను. ఆ విషయము శ్రీకృష్ణునికి తెలియును. సుభద్రకు వివాహమైన తర్వాత ఆమె గర్భవతిగా ఉన్నప్పుడు ఒకసారి అర్జునుడు చక్రవ్యూహమును ఆమెకు వినిపించుచుండెను. అలసిపోయిన సుభద్ర నిద్రించుచుండగా లోనున్న శిశువు వినుచు ఊకొట్టుచుండెను. దానిని గ్రహించిన కృష్ణుడు మధ్యలోనే అర్జునుని ఆపి, సుభద్ర నిద్రించినదని చెప్పెను. అట్లు కాకున్నచో ఆ రాక్షసుని చంపుట ఎవరితరము ఇది ఒక కట్టు కథ. దేశములో ఒకడైన బుధుని పుత్రుడు అభిమన్యుడుగా అవతరించెను. బుధుని ఆజ్ఞమేరకు కేవలము 16 సం॥ మాత్రమే పృధివిలో నుండెను ఇది వాస్తవము. చక్రవ్యూహము గురించి సగమువిన్న అభిమన్యుని చంపుటకు కౌరవ వీరులందరును ఏకమైరి. కావుననే ఆ పరమాత్ముడు గీతలో నాదత్తేకస్యచిత్పాపం నచైవ సుకృతం విభుః అని చెప్పెను. అనగా నేను ఎవరి పాపమును గాని,

పుణ్యమునుగాని గ్రహింపను. కావున పరమాత్మ సత్య – ధర్మాలకు ఆశ్రయం ఇస్తాడేకాని, అధర్మానికి కాదు. సత్యము – ధర్మము పాండవులలో ఉన్నవి. ఈ కారణముచే పరమాత్ముని పక్షపాతి అనరాదు.

**10.** మనము పూజ చేయుటకు ముందు ఆచమనము నేల చేయవలయును ?

జ॥ పూజయన్నది సాకార సగుణోపాసన. ముందు మనము శుద్ధి పొందితిమని తలంచి, ఆ భగవంతుని మనలోనికి ఆహ్వానించి తర్వాత అతనిని పుష్పముల ద్వారా మనముందున్న పూజపాత్ర యందుంచి పూజ చేయుదుము. ఈ శరీరము ఒక మలభాండము వంటిది. కనుక దీనిని శుద్ధిచేయుచున్నామను భావనతో ఆచమనము, ఆసనశుద్ధి, పుష్పశుద్ధి మొదలగు వాటిని చేయుదుము. అప్పుడు శుద్ధనిరంజనుడైన పరమాత్మను ఆహ్వానించుటకు మనము అర్హులమగుదుము, ఈ శుద్ధమైన విచారమును పెంపొందించు కొనుటకే మన పూర్వులు మడిబట్ట, అంటు – శొంతు, ఎంగిలి మొదలైన వాటిని ఆచరించెడివారు.

**11.** కర్పూరహారతి, నైవేద్యము, తాంబూలము యొక్క ప్రాముఖ్యత ఏమి ?

జ॥ కర్పూరము, లేక నేతివత్తితోనైనా హారతి ఇవ్వవచ్చును. ఈ హారతి అగ్ని మఱియు ప్రకాశ స్వరూపము. అగ్ని పంచభూతముల యందొకటి. ఇది తాపము, ప్రకాశము ఈ హారతి ప్రతీకము, అన్ని రకములగు అంధకారమును తొలగించుమని ప్రార్థన చేయుటయే ఈ హారతి యొక్క ప్రత్యేకత.

నైవేద్యము చేయునప్పుడు దేవతా విగ్రహము నుండి ఒక ప్రకాశకిరణమువచ్చి, నైవేద్యమును పవిత్రము చేసి, దాని యందలి దోష గుణమును హరించును కావున భగవద్గీతలో యజ్ఞ శిష్టామృ తభుజోయాంతి బ్రహ్మ సనాతనమ్ (గీత **4-31**) అని చెప్పబడినది.

షోడశోపచారపూజలో (భగవంతుని **16** వస్తువులలో) తాంబూలము కూడా ఒకటి. దేవతను సాక్షాత్కరించని రూపముగా భావించి పూజ చేయుదుము. కావుననే మన తల్లిదండ్రులను. అత్యంత ప్రియమిత్రుని సత్కరించినట్లు ఆ దేవదేవుని ముఖశుద్ధికై తాంబూలమును ఇచ్చెదము. భగవంతునికి **16** కళలుండును. ఈ కారణము చేతనే అతనిని **16** వస్తువులతో పూజ చేయుదుము. **16** వస్తువులలో తాంబూలము ఒకటి, గంగ నీళ్ళతో గంగ పూజ అంటారు. అలాగే ఆ పరమాత్ముడు ఇచ్చిన వస్తువులతోనే ఆయనను తృప్తి పరచడము మన కర్తవ్యము. కర్తవ్యము శాస్త్రానుసారముగా ఉండవలయును కాని మన ఇష్టము వచ్చినట్లు కాదు. పరమాత్ముడిచ్చినవే యని సారాయిని మద్యమాంసములను నైవేద్యము చేయరాదు. అవి తామసిక పదార్థములు అట్టి తామసిక పదార్థములను భూత ప్రేతములకు ఇవ్వవచ్చును. కాని మనుష్యుడు భూత ప్రేతములను పూజించి తాను కూడా భూతము, ప్రేతము కావాలని కోరడుకదా !

**12.** శుచి శుభ్రతను పాటించక భగవంతుని స్మరించుట దోషమా ? కాదా ?

జ॥ ప్రతిరోజు నియమంగా ఒకటి, రెండు గంటలు మాత్రము నామస్మరణ – జపము చేయునప్పుడు శుచిగా మడిబట్టలు కట్టుకొనుట, స్నానము చేయుట మొదలగు వాటిని తప్పక ఆచరింపవలయును. ప్రతిరోజు పగలు రాత్రి ఒక్కటిగా చేసి నామస్మరణ చేయదలంచినచో శుచి – శుభ్రత యొక్క ఆవశ్యకత లేదు.

**13.** ద్వాదశ నామములలోను పూజలలోను కేశవ నామాన్ని మొదట్లో ఎందుకు ఉచ్చరిస్తారు ?

జు॥ క + అ + ఈశ + వ అన్న నాలుగు పదాలు చేర్చిన కేశవ పదము ఉత్పత్తి అగును. క = బ్రహ్మ, ఈశ = ఈశ్వరుడు, అ = విష్ణువు అని అర్థము (అక్షరాణాం అకారోఽస్మి) వ = వశ అని అర్థము బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు వశమందు గలవాడు కేశవుడు, ఈ నామము యొక్క అర్థము అత్యంత విపులము వ్యాపకము అగుట మూలాన ప్రప్రథమముగా ఉపయోగిస్తున్నారేమో ?

కశ్చ అశ్చ ఈశశ్చ త్రిమూర్తయః కేశాస్తే యద్వశేన వర్తన్తే స కేశవః

**14.** హారతి ఎందుకు ఇస్తాము ? ఎందుకు కళ్ళకద్దుకొనవలయును ?

జు॥ హారతి జ్యోతి స్వరూపము. ఆ పరమాత్మస్వయం ప్రకాశ స్వరూపుడు, జ్యోతి స్వరూపుడు, ప్రకాశము అంధకారమును తొలగించి వస్తువులను దృష్టి గోచరముగునట్లు చేయును. చీకటిలో మనము వస్తువులను చూడలేము. అట్లే అజ్ఞానమున్నప్పుడు ఆ పరమాత్మ స్వరూపము కానరాదు. కావున కళ్ళకు హారతిని అద్దుకొనుచు అజ్ఞానాంధకారమును తొలగించి, జ్ఞాన ప్రకాశమును కలిగించుమని దేవుని ప్రార్థించవలెను. సూర్యుని యందు గల జ్యోతి, ఆ పరమాత్మ యొక్క జ్యోతి, మన కండ్లలోగల జ్యోతి ఒక్కటే. జాగ్రదవస్థలో కుడికంటిలో ఆ పరమాత్మ స్థానముండున ని శ్రుతి పలుకుచున్నది.

**15.** దీపం పరబ్రహ్మ అంటారు దాని విశిష్టత ఏమి ? దీపమునకు – ధూపమునకు గల సంబంధమేమి ?

జు॥ దీపము పరబ్రహ్మమునకు ప్రతీకము, పరబ్రహ్మ స్వయం ప్రకాశస్వరూపము. అట్లే దీపమును వెలిగించుటకు నూనె, వత్తి మొదలైనవి అవసరమైనను వెలిగిన దీపమునకు వేరే ప్రకాశము అవసరము లేదు. ఆ దీపము అంధకారమును తొలగించును. కనుకనే జ్ఞానము కలగినప్పుడు అజ్ఞానాంధకారము నిలువజాలదు. దీపము సూర్యునివలె బయటను, లోపలను ప్రకాశ స్వరూపమే. అట్లే జ్ఞానియగువాడు శరీరమునకు లోపలి, బయట ఆ యాత్మ చైతన్యమునే చూచును. ఇక ధూపము వనస్పతి – ఓషధు ల రస స్వరూపము. (వనస్పతి :- మామిడి, పనస మొదలగు పండ్లు ఓషధి :- గోధుమ, వరి మున్నగు ధాన్యములు) పండ్లు ధాన్యములు భూమి నుండి పుట్టినవి, గంధము భూమి యొక్క గుణము, ఆ పరమాత్ముని స్థూల విరాట్స్వరూపమే భూమి, ఆత్మ నుండి ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి ఉత్పన్నమైనవి. భూమి యొక్క సార స్వరూపమే ధూపము ఎంత మంచివాసన (సువాసన) గల ధూపమును వెలిగించినచో పరమాత్మ – దేవత అంత తృప్తి నొందును. దూపము స్థూలము దీపము (అగ్ని) సూక్ష్మము. కనుక ఆ పరమాత్మను తెలిసికొనుటకు స్థూలాతి స్థూలలము నుండి సూక్ష్మాతి సూక్ష్మమునకు పోవలెను. దృశ్య తేత్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః అని శ్రుతి హారతితో దీపమును శంఖములో జలమును, పుష్పము, బట్ట, చామరములను దేవునికి చూపించెదరు. దీపము = అగ్ని, శంఖము = జలము, పుష్పము = భూమి, బట్ట = ఆకాశము, చామరము = వాయువు ఈ విధముగా ఐదు తత్త్వములు గల ప్రపంచమును సూచించుట ద్వారా సృష్టికి కారకుడైన పరమాత్ముని కూడా సూచింతురు.

**16.** పంచాక్షరీ మంత్రమేది ? దాని పురశ్చరణకై ఎన్ని సార్లు జపించవలయును ?

జ॥ ఓం నమః శివాయ అనునది శివ పంచాక్షరీ మంత్రము. ఓం రామాయ నమః అనునది రామ పంచాక్షరీ మంత్రము . ఈ విధముగా తారకము (ప్రణవము) చతుర్థి అంతముగల దేవతా శబ్దము. అంతమున నతి వాచకము నమః గల మంత్రము సామాన్యముగా పంచాక్షరీ మంత్రమై యుండును. అనగా :- మంత్రమునందు ఐదు అక్షరములుండునని అర్థము. ప్రణవము అన్ని మంత్రములకు, స్తోత్రములకు ముందు తప్పక ఉచ్చరింపబడును. లేనిచో మంత్రస్తుతులు ఫల శూన్యములగును. ఒక్కొక్క అక్షరమునకు ఒక్కొక్క లక్షసార్లు జపించుట పురశ్చరణ యనబడును. పంచాక్షరీ మంత్రమునకు **5** లక్షల జపము చేయవలయును. గాయత్రీ మంత్రమును **24** లక్షలు జపించినచో పురశ్చరణ యగును.

**17.** శివుడికి – శివలింగానికి గల సంబంధమేమి ? శివలింగము ప్రాణ పట్టముల ఆధ్యాత్మిక విశేషము లేవి ?

జ॥ శివుని బాణలింగమునే శివుడని భావించి భక్తులు పూజలు చేయుచున్నారు ఈ రెండున్నూ అభేదములు. ఏ విధముగా నామము నామి (పేరు కలవాడు) అభేదములో, అట్లే శివలింగము – శివుడున్నూ ! దీనిని శాస్త్రములో ప్రతీ కోపాసన అందురు. అనగా నికృష్టమునందు ఉత్కృష్ట దృష్టి, బ్యాంకులో పని చేయు గుమస్తాను నీవే యజమానివి. నీవే చంద్రుడివి, నీవే ఇంద్రుడివి అని పొగడినచో మన పనిని ఆ గుమాస్తా త్వరగా చేసి పెట్టును. అదే గుమాస్తాను నీవు నౌకరువు, దుర్వాసుడు అన్నచో మన పని చేయడు సరికదా ! కోపముతో మనలను తిట్టి తరిమివేయునంత పని చేయును.

మరొక ఉదాహరణ – వసిష్ఠునిచే సన్మానింపబడి విశ్వామిత్రుడు కామధేనువును కోరెను. కాని వసిష్ఠుడు నిరాకరింపగా తన క్షాత్రశక్తిని ప్రయోగించి విఫలుడయ్యెను. వసిష్ఠుని దండము ముందు విశ్వామిత్రుని సమస్త సైన్యము గడ్డిపోచవలె భస్మమయ్యెను. అప్పుడు విశ్వామిత్రుడు తపమాచరించి, వసిష్ఠునిచే రాజఋషి యని పిలువబడెను, బ్రహ్మ ఋషియని పిలువలేదని కోపముచే విశ్వామిత్రుడు వసిష్ఠుని నూర్గురు పుత్రులను చంపెను. అప్పుడున్నూ రాజ ఋషి అనియే పిలువబడెను. విశ్వామిత్రుని మనస్సులో శత్రుభావమున్నను, వసిష్ఠుని మనస్సులో మిత్రభావమే ఉండెను. శత్రుత్వముచే పౌర్ణమి వెన్నెలలో వసిష్ఠుని చంపుటకు ఉద్యుక్తుడై, పరోక్షములో తన ప్రశంసను వసిష్ఠుని ద్వారా విని అతని విశాల హృదయమును అవలోకించి, అతని పాదములపై బడి, శత్రుత్వమును వదలి, క్షమాశీలుడయ్యెను. అప్పుడు వసిష్ఠులవారు విశ్వామిత్రుని బ్రహ్మ ఋషి యని సంబోధించి కౌగిలించుకొనిరి. విశ్వామిత్రుడు బ్రహ్మ ఋషి యగుటకు ముఖ్యమైన ఆటంకము శత్రుత్వభావము మరియు అక్షమాశీలత. ఉత్కృష్టమునందు నికృష్టదృష్టిని చూసిన వసిష్ఠులకు లోకదృష్టిలో శిక్ష కలిగెను. ఏలననగా వారు బ్రహ్మజ్ఞులు, పుత్రులు ఉన్నను లేకున్నను వారికి ఒక్కటే.

కావున తక్కువ శక్తి గల దానియందు ఎక్కువ శక్తిని ఆరోపించి అబేదదృష్టితో పూజించుటయే ఉపాసన, సాలగ్రామ శిలాఖండము (గండకీ నదిలోని శిల) నందు విష్ణుదృష్టిని నర్మదా శిలాఖండమునందు శివదృష్టిని ఉంచి పూజించుట శాస్త్రసమ్మతము. వీటికి ప్రాణ ప్రతిష్ఠ అవసరము లేదు, ప్రాణపట్టము కేవలము శివలింగము నుంచుటకు ఆధారము. స్వయంభూ శివలింగముకల స్థలములో ప్రాణపట్టములు లేవు. ఉదాహరణకు కేదార్‌నాథ్ త్ర్యంబకేశ్వర్ నీలకంఠ మహాదేవులు. ఈ స్థానములలో తర్వాత భక్తులు ప్రాణపట్టములను, లేక పరిధిని నిర్మించిరి, ప్రాణపట్టము (జలేరి) ను గూర్చి వేర్వేఱు మతస్థులు సనాతనాలంబులను చలింపజేయుటకు విభిన్న రీతులలో వర్ణించుచున్నారు. అదికేవలము నిరాధారము, శాస్త్ర విరుద్ధము మఱియు మూర్ఖ ప్రలాపము మాత్రమే !

**18.** గృహములలోని పూజామందిరములలో తైలవర్ణ చిత్రపటములను, లేదా విగ్రహములను పెట్టినప్పుడు గృహస్థుడు ప్రాణ ప్రతిష్ఠ చేయవలయునా ? అసలు ప్రానప్రతిష్ఠ అనగా నేమి ?

జ॥ గృహస్థుడు గాని ఏ ఆశ్రమస్థుడు గాని పటమును, లేక విగ్రహమును పూజింపదలచినచో ప్రాణ ప్రతిష్ఠ అత్యావశ్యకము, దేవోభూత్వాదేవాన్ యజేత (నర్మదేశ్వరుని, సాలగ్రామమును పూజించుటకు ప్రాణ ప్రతిష్ఠ అవసరము లేదు) అనగా నీవు దేవతవై దేవుని పూజింపుము. పూజా సమయములో దేవత ప్రత్యక్షముగా ఉన్నట్లుభావించవలయును. శాస్త్రోక్త మంత్రోచ్చారణములతో విగ్రహమునందు ప్రాణ ప్రతిష్ఠ చేయుదురు, అనగా – వేద మంత్రోచ్చారణముచే దేవత ఆ విగ్రహమునందు ప్రవేశించును. మంత్రముల శక్తి సర్వజన విదితమే. సాధారణ వ్యక్తిని (త్రోవలోపోవు వానిని తిట్టినచో, వాడు తిరుగబడి లెంపలు వాయించును. లేక మరి నాలుగు తిట్లు అధికముగా తిట్టును, సాధారణ పదములలో ఇంత శక్తియున్నచో, వేద మంత్రముల శక్తిని వర్ణింప ఎవరి తరము ? జీవించియున్న తల్లిదండ్రుల సేవ చేసి వారి ఆశీస్సులను పొందుట ఎట్లో, అట్లే ప్రాణ ప్రతిష్ఠ చేసి విగ్రహారాధన కేవలము చిత్రపటములను, ప్రాణ ప్రతిష్ఠకాని విగ్రహములను పూజించుట స్వర్గస్థులైన తల్లిదండ్రుల నిమిత్తమై చేయు సేవ వంటిది.

**19.** మంత్రానికి గల శక్తి, బీజము, కీలకము, ముద్ర, అనువాటిని విశదీకరింప ప్రార్థన.

జ॥ శక్తి :– ప్రతి భాషయందు పదములకు, వాక్యములకు నాచ్యర్థము ఉండును. దీనిని శక్తి అందురు, కుండ అ పదమునకు శక్తి. కుండాకారము గల వస్తువును సూచించుటయందు కలదు. అట్లే ఆవు అనుపదము యొక్క శక్తి ఆవు ఆకారముతోన్న జంతువును సూచించును. తల్లి దండ్రులు పెట్టిన నామధేయము ద్వారా పిల్లలను పిలిచెదరు. పిల్లలు దూరముగా నుండిన వారి నామస్మరణము మాత్రమునే వారి ఆకారము మనస్సులో మెదలును. అట్లే మంత్రముల స్తుతిపాఠముల యొక్క శక్తి ఆయా దేవతా స్వరూపములను సూచించును.

బీజము : మఱ్ఱి వృక్షము యొక్క శక్తి అంతయు మఱ్ఱి బీజము లోనే ఇమిడియున్నది అట్లే మంత్రముల యొక్క, స్తుతి పాఠముల యొక్క వ్యాపకరూపమైన శక్తి బీజాక్షరముయందు ఇమిడియున్నది.

అనుకూల వాతావరణముచే విత్తనము మహావృక్షమయినట్లు మంత్రములను బీజాక్షరములచే జపించుట వలన జపించు వారికి అధిక ఫలము లభించును. అందులకే కృష్ణ భగవానుడు గీతలో యజ్ఞానాం జప యజ్ఞోస్మి అనిరి. మరికొందరు మహా పురుషులు జపాత్ సిద్ధిః అని నుడివిరి.

కీలకము :- కీలు అనగా మేకు. యంత్రములయందు కీలకస్థాన మందు ఉన్న మేకుకాని, బోల్ట్‌గాని పడిపోయినచో యంత్రము పని చేయదు. అట్లే మంత్ర, స్తుతి పాఠములందు పాఠకులకు కలుగు ప్రతిబంధకములను ఈ కీలకములు తొలగించును. పాఠకులకు ప్రతిబంధకములు అనగా మంత్ర స్తుతి పఠన ద్వారా కలుగు ఫలితము లభించకుండుట, అప్పుడు కీలకము సహితము మంత్ర జపముద్వారా, లేక కీలక స్తుతి ద్వారా ముల్లుతో ముల్లు తొలగించినట్లు ప్రతిబంధకములు తొలగును.

ముద్ర :- యోజనాత్ సర్వదేవానాం ద్రాణాత్ పాప సంహతేః

తస్మాత్ ముద్రేతి సా ఖ్యాతా సర్వ కామార్ధ సాధనీ.

అనగా వ్రేళ్ళు కలిపి ముద్రలు చూపించుటవలన దేవతలందరు పరిగెత్తుకొని ముద్రలు చూపించు వారి వద్దకు వచ్చెదరు. మరియు వారి పాపమును నశింపజేసెదరు. వారి కోరికలన్నింటిని సిద్ధింపజేసెదరు, కనుకనే ముద్ర అందురు.

**20.** దేవతామూర్తులలో అమ్మవార్ల చిత్రపటాలు దేవుళ్ళకి ఎడమ ప్రక్కగా ఉంటే ఒక్క తిరుపతి వేంకటేశ్వరునికి మాత్రం అమ్మవారు కుడి ప్రక్క ఉండుటకు కారణమేమి ?

జ॥ రామావతారములో శ్రీరాముడు మారీచుని (బంగారు జింక) చంపుటకు పోవుటకు ముందు సీతదేవిని అగ్నిప్రవేశము చేయించి వేదవతిని సీతాస్థానములో ఉంచెను. లంకా విజయానంతరము సీతాదేవిని అగ్ని ప్రవేశము చేయించి అసలు సీతను తెచ్చుకొనెను. అపుడు వేదవతి రాముని పత్నిగా స్వీకరించమని ప్రార్థించగా రాములవారు ఇప్పుడు నేను ఏకపత్నీ వ్రతుడను. కలియుగములో నీవు ఆకాశరాజు కూతురుగా పద్మావతి పేరుతో పుట్టెదవు. అప్పుడు నిన్ను భార్యగా స్వీకరించెదననెను.

ఒక సారి భృగుమహర్షి వైకుంఠమునకు వెళ్ళి విష్ణువుచే అతిథి సత్కారము పొందలేదని ఆగ్రహించి శ్రీ మహావిష్ణువు యొక్క వక్షః స్థలము పై కాలుతో తన్నెను. అప్పుడు లక్ష్మీదేవి ఆగ్రహించి భూమి పై కొల్హాపూరు అను స్థలములో తపస్సు చేయనారంభించెను. వైకుంఠములో లక్ష్మీదేవి వియోగము కలుగగా అశాంతిని పొంది విష్ణువు శేషాద్రి (తిరుమల) పై మనుష్య రూపము దాల్చి అవతరించెను. ఆకాశరాజుకు వేదవతి పద్మావతి రూపములో కుమార్తెగా లభించెను. బ్రహ్మ, ఈశ్వర, కుబేరుల సహాయముతో పద్మావతి శ్రీనివాసుల కల్యాణము వైభవముగా జరిగెను. దేవతల సమక్షములో శ్రీనివాసులు వేంకటేశ్వరుని నామముతో భక్తులను కలియుగాంతము వరకు అనుగ్రహించుటకు సంకల్పించెను. మందిరము తయారైనది. ఆ సమయమున నారదులు లక్ష్మీదేవితో సమాచారమును అంతయు వివరించి చెప్పగా లక్ష్మీదేవి పద్మావతీ శ్రీనివాసుల ఏకాంత స్థలమునకు వచ్చి పద్మావతితో తగవులాడ నారంభించెను.

సర్వభూతముల భర్తయైన శ్రీనివాసులు వారిని అనుగ్రహించి వారి పుట్టు పూర్వోత్తరములు వివరించి పద్మావతీ దేవిని కుడి వక్షస్థలముపై మొదటి భార్యయైన లక్ష్మీదేవిని ఎడమ వక్షః స్థలముపై ఉండుమని చెప్పిరి. అందువలననేమో వేంకటేశ్వరస్వామి కుడి ప్రక్కన అమ్మవారి విగ్రహమును చూచి యుందురు.

## 2. భక్తి సంబంధమైన ప్రశ్నలు – జవాబులు

శ్రీ మేధానందపురి జీ

**1.** గృహస్థుని నివాసములలో, పూజా మందిరముల యందు శివలింగములు ఉండవచ్చునా.

జ॥ శివలింగములు తప్పక గృహస్తుల నివాసములలో ఉండవచ్చును. నర్మదా పూజ, ధూప, దీప, నైవేద్యములను చేయవలయును. వీలైనచో పూజా సమయమునందు గంగా జలముతో అభిషేకము చేయవలయును. శం కల్యాణము కరోతి చేయువాడు. శంకరోతి ఇతి శంకరః అతి త్వరగా, అతి తేలికగా ప్రసన్నుడై కోరికలు తీర్చువాడు శంకరుడు.

**2.** శ్రీ గణపతి సచ్చిదానందస్వామి వారిని ఆరాధించే భక్తులు శ్రీ స్వామి శివానందుల వారిని ఆరాధింపవచ్చునా ? లేక ఏ ఒక్కరినైనా ఆరాధించుట మంచిదా ?

జ॥ ఏకం సత్ విప్రా బహుధావదంతి యని శ్రుతి. ఆ పరమాత్మ ఒక్కడే. కాని విప్రులు బహుప్రకారములుగా (బహురూపములుగా) చెప్పుదురు. పై ఇద్దరు స్వాములలోను ఒకే పరమాత్మనుచూచి ఆరాధించుటలో తప్పులేదు. పూజలు చెయ్యవచ్చును. మీకు అనన్యభక్తి కావలసియున్నచో ఎల్లప్పుడు ఒకే మూర్తిని ధ్యానించుట మంచిది. ఈ రోజు ఒక చోట, రేపు మరొకచోట, మర్నాడు వేరొక చోట కొంచెము – కొంచెముగా త్రవ్వినచో నీరు దొరకదు. ఒకే చోట లోతుగా త్రవ్వినచో అది బావి రూపముదాల్చి, ఎల్లప్పుడు నీటిని సరఫరా చేయును సాధకుడు అందటిలోను తన ఇష్టదేవతను చూచుటకు అభ్యసించుట మంచిది.

**3.** గృహస్థులు, శూద్రులు గాయత్రీ జపమును చేయవచ్చునా ?

జ॥ సుప్రసిద్ధులగు మహాత్ముల నుండి మంత్రదీక్ష తీసికొని, ధారాళముగా గాయత్రీ మంత్రమును జపము చేయవచ్చునని శ్రీ స్వామి వివేకానందుల వాణి.

**4.** పంచామృత ప్రాముఖ్యతను వ్రాయగలరు ?

ఓం సర్వ కల్మషనాశాయ పరిపూర్ణ సుధాత్మకమ్ ।

మధుపర్కమిమందేవ కల్పయామి ప్రసీదయే.

అన్ని దోషముల నాశనమునకు, పరిపూర్ణ దేవతాపేయము (త్రాగుటకు యోగ్యమైనది) అగు మధుపర్కమును కల్పించుచున్నాము. దీని ద్వారా నాపై ప్రసన్నముగుమని అర్థము.

**1)** పాలు – పుష్టి నిచ్చును. ఆరోగ్య అనారోగ్య, సర్వావస్థల యందు (బాల – యౌవన – వార్థక్యావస్థలు) సేవించినవారు బలవంతులగుదురు.

**2)** పెరుగు – దధ్నాజహాతి ఇంద్రియకామః అని పూర్వ మీమాంసనుడివెను. ఇది ఇంద్రియముల సౌష్ఠవమునకు దోహదకారి.

3) నెయ్యి – ఆయుర్వైఘృతమ్ ఆయుష్యమును పెంపొందించును, కావున నెయ్యి ఆయుష్యముతో పోల్చబడినది.

4) పంచదార – ఇది పండ్లరసములకు ప్రతీకము. దీనిచే ఆరోగ్యము అభివృద్ధి నొందును.

5) తేనె – ఇది పుష్పముల రసమునకు ప్రతీకము, ఆనందము నిచ్చును. మన పెద్దలు తేనె పలుకులు పలుకుదురు. అంటే ఆనందదాయకములని అర్థము.

తెల్లని పదార్థములు సత్త్వమునకు ప్రతీకములు. సత్త్వాత్సంజాయతే జ్ఞానమ్ అని గీతాచార్యులు నుడివిరి. ఈ పదార్థములను సేవించుటచే సత్వాంశము పెరిగి జ్ఞానము అభివృద్ధి నొందును. దేవోభూత్వా దేవాన్ యజేత్ నీవు దేవతవై దేవతను పూజింపుమని అర్థము. పూజలో మొదట దేవతను ధ్యానించి, హృదయములోనికి వచ్చినట్లు భావించి, ఆ తర్వాత హృదయమునుండి బయటకు లోనికి వచ్చినట్లు భావించి, ఆ తర్వాత హృదయము నుండి బయటకు వచ్చినట్లు భావించి పూజింతురు. కావున తెల్లని పదార్థములను సేవించుట మంచిది, కాని తెల్లగానున్నదని కల్లు – సారాయిలను పుచ్చుకొన్నచో ఉన్న బుద్ధికూడా మటుమాయమగును. సురాం నపిబేత్ అని సురాపానమును శాస్త్రము నిషేధించుచున్నది.

5. భగవంతుడు రాక్షసులకు దర్శనం ఇచ్చి, ముక్తినిచ్చి నట్లు భాగవతంలో కథల ద్వారా తెలియచున్నది. కాని మా యింట్లో రోజు భజనలు, పూజలు మొదలైనవి చేస్తున్నా, మాకు భగవంతుడు ఎందుకు కనిపించడు ?

జ॥ కంసుడు వైకుంఠములో భగవంతుని ద్వార పాలకులిగా వుంటూ సనకాదుల శాపమునకు గురియై రాక్షస జన్మమెత్తి భగవచ్చింతన చేసి మోక్షము పొందెను. అదే విధముగా ఇతర రాక్షసులు క్రింద జన్మలో భగవచ్చింతన చేసిన వారే. అట్టి వారికే ఆయన దర్శనమగును పాండవులలో నరుడుగా అర్జునుడు నారాయణునితో బదరికాశ్రమములో తపస్సు చేసినందున అర్జునునికి మాత్రము విశ్వరూపదర్శనమైనది. కనుక అతి తీవ్ర చింతన (తపస్సు) ఆవశ్యకము.

నీకు తెలియని వస్తువులను మీ తల్లి గారిని లేక మీ టీచరుని అడిగి తెలుసుకుంటావు. అనగా మొదట ఆ వస్తువుయొక్క సంస్కారము లేదు తరువాత వచ్చినది. చిన్న పిల్లలు తల్లినడిగి కుక్క, పిల్లి మొదలైనవాటిని గుర్తించెదరు. ఆ తరువాత అడుగకుండగనే చెప్పగలరు. ఎందువలనంటే జన్మల నుండి వచ్చుటవలన అనేక సంస్కారములు గలది. వానిని తొలగించి ఒక్క భగవత్ స్వరూపమునే ఎల్లప్పుడు తలంచిన ఆయన దర్శనమగును. నీవు ఎండిపోయిన ఇంకు సీసాను చూసియేయుందువు. దానిని కుళాయి క్రింద వుంచిన ఆ ఇంకు నెమ్మదిగా కరిగి దానంతటదే పైకి వచ్చును. అనంతరము నీటిధారవలన ఇంకు పూర్తిగా కడిగివేయబడి కేవలము స్వచ్ఛమైన నీరే పోసినది పోసినట్లు వచ్చును అదే రీతిగా నిరంతరం భగవంతుని స్వరూపమును ధ్యానించుటవలన మిగిలిన సంస్కారములు తొలగి, ఆయన దర్శన భాగ్యము తప్పక, కల్గును. దేవకీ వసుదేవులు భగవంతుని స్మరించి వరదానమడుగగా వారికి కృష్ణ పరమాత్మ కుమారుడుగా జన్మించెను. వారడిగినది నీలాంటి కుమారుడు కావలెనని మాత్రమే!

**6.** జపము చేయుచున్న సమయమున మనస్సు వేరే విషయములలో సంచరించును, అట్లు సంచరించుచున్న సమయములో చేసిన జపము ఫలవంతమగునా ?

జ॥ సముద్రములో అలలు వచ్చునప్పుడు స్నానము చేయనిచో మరి స్నానము చేయలేము. అలల మధ్యలో స్నానము చేసినపుడు పూర్తి ఫలము గలదు అట్లే మనసు వేరే విషయములతోనే సదా ఉండును. దానిని బుజ్జగించి భగవంతునిపై మరల్చవలెను. స్వల్ప మప్యస్య ధర్మస్యత్రాయతే మహతో భయాత్ భగవంతుని చింతన కొద్ది మనస్సు తో చేసినను అధిక ఫలము నిచ్చును. ఒకసారి కృష్ణపరమాత్మ నారదునికి నూనె గిన్నెతో నింపి, నూనె ఒలకకుండా కొండ చుట్టూ తిరిగిరమ్మనెను. తిరిగి వచ్చిన నారదుని పరమాత్మ కొండ తిరిగే సమయములో ఎన్నిసార్లు నన్ను స్మరించితివని యడిగెను. దానికి నూనె ఒలకకుండా ఉండుటకు నూనె గిన్నె ధ్యానముతోనే సరిపోయినది. ఇంక నీ స్మరణమెక్కడ అనెను. ఇంత చిన్న పనిలోనే నీవు నన్ను మరచితివి నా గృహస్థ భక్తులను చూడుము. వారిపై ఎంతభాద్యతయున్నది. కాని వారు నా స్మరణను వీడరు అనెను. కనుక మనము ఆ పరమాత్మ ఇచ్చిన మనసుతోనే స్మరణ చేస్తాము. కాని లేని స్వచ్ఛమైన మనస్సు ఎక్కడ నుండి తీసుకొనిరాగలము. గంగ గోవుపాలు గరిటెలైన చాలు. కడివడైననేమి ఖరము పాలు అన్నట్లు మనసావాచా భగవంతుని కొన్ని సెకండ్లు స్మరించిన చాలును. పూర్తి మనసుతో స్మరణము చాల తపస్సు చేసిన లభించగలదు.

**7.** ఒక గురువు వద్ద మంత్రోపదేశము తీసికొని జపించుచు వేరొక భగవంతుని జపించుట సరియైనదా కాదా ?

జ॥ ఒక దేవుని మంత్ర జపము చేయుచు మరల వేరొక దేవుని మంత్రమును జపించుట అనావశ్యకము, ఒకే చోట త్రవ్వుచూ పోయినచో నీటి ఊట లభించును. కొది కొద్దిగా అనేక చోట్ల త్రవ్వినచో బావి నీరు లభింపదు. భగవంతునినామములు, స్వరూపములు వేరైనను ఆయన యొక్క నిజతత్త్వము ఒక్కటే. కనుక ఏ పేరుతో పిలచినా, ఏ రూపమునందు స్మరించినా ఆయన తప్పక లభించును. భావాద్వైతం సదాకుర్యాత్, క్రియా ద్వైతంన కర్హిచిత్ కావున ఏ స్వరూపమైనను, ఏ నామమునైనను నిందించుట మంచిది కాదు. ఒక మనస్సుతో ఒకే చోట నిలుకడచెందుట మంచిది. కోతిలాగ ఒక కొమ్మనుండి వేరొక కొమ్మకు ఎగురుట మంచిది కాదు. అందరినీ గౌరవించి, ఆదరబుద్ధితో చూసినటువంటి ఆంజనేయస్వామి వారు కూడ తన యొక్క ఇష్టదైవమగు శ్రీ రామునియందు నిష్ఠను వదల లేదు. ద్వాపరములో ద్వారకకు పోయి కూడ హనుమంతుడు శ్రీరామునే దర్శించెను అచ్చటనున్న రుక్మిణి, శ్రీకృష్ణులు హనుమంతునికై సీతారాములుగా మారిరి.

**8.** శ్రీ వేంకటేశ్వర స్వామియే కలియుగ దైవమని చెప్పుటలో గల విశేషమేమి ?

జ॥ ఉపనిషత్తులలో, వేదములలో చెప్పబడిన నిరాకార, నిర్గుణ పరబ్రహ్మతత్త్వము ఒక్కటే. ఆ పరమాత్మ సంభవామి యుగే యుగే అన్నట్లు ఆయా యుగములలో ఆయా రూపములను ధరించి దుష్టులను శిక్షించి శిష్టులను రక్షించుచుండును.

గీతలో దదామి బుద్ధియోగంతం యేనమాముపయాంతితే అని చెప్పబడినది. అనగా సాకార – సగుణములతో పూజించి, నన్ను పొందిన వారికి నిరాకార నిర్గుణ తత్త్వమును అనగా జ్ఞానమును పొందుటకు సమర్థవంతమైన బుద్ధిని నేను ఇచ్చెదనని శ్రీకృష్ణుడు పలికెను. ఏ రూపముతోకొలిచినా ఆ రూపమునందే నిష్ఠ ఉండవలయును. కాని మిగిలిన రూపాలను అనాదరణ హేళన చెయ్యరాదు. పాతిక చోట్లలో గోతులు తీసినచో నీరురాదు. ఒకే చోట **25** అడుగులు త్రవ్వినచో నీరు దొరుకును. ఇదియే నిష్ఠ అనబడును. క్రొత్తసీసాలో పాత సారాయి అను సామెత కలదు. మనకు కావలసినది సారాయి, కాని సీసా కాదు. అట్లే ఆ అనాదియైన పరబ్రహ్మము త్రేత – ద్వాపర యుగములలో రాముడు, కృష్ణుడుగా వచ్చి ఇప్పుడు కలియుగములో శ్రీనివాసుడై వెలసెను. ఉదాహరణకు మీకు శ్రీ రాముడు ఇష్టదైవమైనచో ఆ ఏడుకొండల వానిలో కూడా రామునే చూడుడు. ఆంజనేయులు ద్వారకకు వచ్చి రాముని చూచెనుకదా ! గాయత్రి ఉపాసకులకు సూర్యుడు, కృష్ణోపాసకులకు కృష్ణుడు, ఆంజనేయోపాసకులకు ఆంజనేయుడు తోడ్పడునట్లు, ఈ కలియుగములో ఆ వేంకటేశ్వర స్వామిని కొలిచే వారిని ఆయన కాపాడుచుండును. కావలసినది ఆ పరమాత్ముని శక్తియందు శ్రద్ధాభక్తులు, కాని నామ రూపాలయందు మమత కాదు. ఆ పరతత్త్వము నామరూపాల కతీతమై యున్నది ఎప్పుడూ కొలిచే కాళీమాతను జ్ఞానఖడ్గముచే రెండుగా ఖండించిన తరువాతనే శ్రీ రామకృష్ణ పరమహంసగారు **3** రోజులు నిర్వికల్ప సమాధిని పొందిరి.

**9.** కృష్ణుడు పాండవ పక్షపాతియైనచో అభిమన్యుని ఎందుకు రక్షించలేదు ?

జ॥ క్రిందటి జన్మలో అభిమన్యుడు రాక్షసుడు. శ్రీకృష్ణ పరమాత్మ అతని సూక్ష్మ శరీరమును కుంకుమభరణిలో బంధించెను. సుభద్రకు ఈ విషయము తెలియదు. కనుక ఆమెభరణి తీసిన వెంటనే ఆరాక్షసుడు ఆమెలో ప్రవేశించెను. ఆ విషయము శ్రీకృష్ణునికి తెలియును. సుభద్రకు వివాహమైన తర్వాత ఆమె గర్భవతిగా ఉన్నప్పుడు ఒకసారి అర్జునుడు చక్రవ్యూహమును ఆమెకు వినిపించుచుండెను. అలసిపోయిన సుభద్ర నిద్రించుచుండగా లోనున్న శిశువు వినుచు ఊకొట్టుచుండెను. దానిని గ్రహించిన కృ ష్ణుడు మధ్యలోనే అర్జునుని ఆపి, సుభద్ర నిద్రించినదని చెప్పెను. అట్లు కాకున్నచో ఆ రాక్షసుని చంపుట ఎవరితరము ఇది ఒక కట్టు కథ. దేశములో ఒకడైన బుధుని పుత్రుడు అభిమన్యుడుగా అవతరించెను. బుధుని ఆజ్ఞమేరకు కేవలము **16** సం॥ మాత్రమే పృథివిలో నుండెను ఇది వాస్తవము. చక్రవ్యూహము గురించి సగమువిన్న అభిమన్యుని చంపుటకు కౌరవ వీరులందరును ఏకమైరి. కావుననే ఆ పరమాత్ముడు గీతలో నాదత్తేకస్యచిత్పాపం నచైవ సుకృతం విభుః అని చెప్పెను. అనగా నేను ఎవరి పాపమును గాని, పుణ్యమునుగాని గ్రహింపను. కావున పరమాత్మ సత్య – ధర్మాలకు ఆశ్రయం ఇస్తాడేకాని, అధర్మానికి కాదు. సత్యము – ధర్మము పాండవులలో ఉన్నవి. ఈ కారణముచే పరమాత్ముని పక్షపాతి అనరాదు.

**10.** మనము పూజ చేయుటకు ముందు ఆచమనము నేల చేయవలయును ?

జ॥ పూజయన్నది సాకార సగుణోపాసన. ముందు మనము శుద్ధి పొందితిమని తలంచి, ఆ భగవంతుని మనలోనికి ఆహ్వానించి తర్వాత అతనిని పుష్పముల ద్వారా మనముందున్న పూజపాత్ర యందుంచి పూజ చేయుదుము. ఈ శరీరము ఒక మలభాండము వంటిది. కనుక దీనిని శుద్ధిచేయుచున్నామను భావనతో ఆచమనము, ఆసనశుద్ధి, పుష్పశుద్ధి మొదలగు వాటిని చేయుదుము. అప్పుడు శుద్ధనిరంజనుడైన పరమాత్మను ఆహ్వానించుటకు మనము అర్హులమగుదుము, ఈ శుద్ధమైన విచారమును పెంపొందించు కొనుటకే మన పూర్వులు మడిబట్ట, అంటు – శొంతు, ఎంగిలి మొదలైన వాటిని ఆచరించెడివారు.

**11.** కర్పూరహారతి, నైవేద్యము, తాంబూలము యొక్క ప్రాముఖ్యత ఏమి ?

జ॥ కర్పూరము, లేక నేతిపత్తితోనైనా హారతి ఇవ్వవచ్చును. ఈ హారతి అగ్ని మఱియు ప్రకాశ స్వరూపము. అగ్ని పంచభూతముల యందొకటి. ఇది తాపము, ప్రకాశము ఈ హారతి ప్రతీకము, అన్ని రకములగు అంధకారమును తొలగించుమని ప్రార్థన చేయుటయే ఈ హారతి యొక్క ప్రత్యేకత.

నైవేద్యము చేయునప్పుడు దేవతా విగ్రహము నుండి ఒక ప్రకాశకిరణమువచ్చి, నైవేద్యమును పవిత్రము చేసి, దాని యందలి దోష గుణమును హరించును కావున భగవద్గీతలో యజ్ఞ శిష్టామృతభుజోయాంతి బ్రహ్మ సనాతనమ్ (గీత **4-31**) అని చెప్పబడినది.

షోడశోపచారపూజలో (భగవంతుని **16** వస్తువులలో) తాంబూలము కూడా ఒకటి. దేవతను సాక్షాత్కరించని రూపముగా భావించి పూజ చేయుదుము. కావుననే మన తల్లిదండ్రులను. అత్యంత ప్రియమిత్రుని సత్కరించినట్లు ఆ దేవదేవుని ముఖశుద్ధికై తాంబూలమును ఇచ్చెదము. భగవంతునికి **16** కళలుండును. ఈ కారణము చేతనే అతనిని **16** వస్తువులతో పూజ చేయుదుము. **16** వస్తువులలో తాంబూలము ఒకటి, గంగ నీళ్ళతో గంగ పూజ అంటారు. అలాగే ఆ పరమాత్ముడు ఇచ్చిన వస్తువులతోనే ఆయనను తృప్తి పరచడము మన కర్తవ్యము. కర్తవ్యము శాస్త్రానుసారముగా ఉండవలయును కాని మన ఇష్టము వచ్చినట్లు కాదు. పరమాత్ముడిచ్చినవే యని సారాయిని మద్యమాంసములను నైవేద్యము చేయరాదు. అవి తామసిక పదార్థములు అట్టి తామసిక పదార్థములను భూత ప్రేతములకు ఇవ్వవచ్చును. కాని మనుష్యుడు భూత ప్రేతములను పూజించి తాను కూడా భూతము, ప్రేతము కావాలని కోరడుకదా **!**

**12.** శుచి శుభ్రతను పాటించక భగవంతుని స్మరించుట దోషమా ? కాదా ?

జ॥ ప్రతిరోజు నియమంగా ఒకటి, రెండు గంటలు మాత్రము నామస్మరణ – జపము చేయునప్పుడు శుచిగా మడిబట్టలు కట్టుకొనుట, స్నానము చేయుట మొదలగు వాటిని తప్పక ఆచరింపవలయును. ప్రతిరోజు పగలు రాత్రి ఒక్కటిగా చేసి నామస్మరణ చేయదలంచినచో శుచి – శుభ్రత యొక్క ఆవశ్యకత లేదు.

**13.** ద్వాదశ నామములలోను పూజలలోను కేశవ నామాన్ని మొదట్లో ఎందుకు ఉచ్చరిస్తారు ?

జ॥ క + అ + ఈశ + వ అన్న నాలుగు పదాలు చేర్చిన కేశవ పదము ఉత్పత్తి అగును. క = బ్రహ్మ, ఈశ = ఈశ్వరుడు, అ = విష్ణువు అని అర్థము (అక్షరాణాం అకారోఽస్మి) వ = వశ అని అర్థము బ్రహ్మ, విష్ణు,

మహేశ్వరులు వశమందు గలవాడు కేశవుడు, ఈ నామము యొక్క అర్థము అత్యంత విపులము వ్యాపకము అగుట మూలాన ప్రప్రథమముగా ఉపయోగిస్తున్నారేమో ?

కశ్చ అశ్చ ఈశశ్చ త్రిమూర్తయః కేశాస్తే యద్వశేన వర్తన్తే స కేశవః

**14.** హారతి ఎందుకు ఇస్తాము ? ఎందుకు కళ్ళకద్దుకొనవలయును ?

జ॥ హారతి జ్యోతి స్వరూపము. ఆ పరమాత్మస్వయం ప్రకాశ స్వరూపుడు, జ్యోతి స్వరూపుడు, ప్రకాశము అంధకారమును తొలగించి వస్తువులను దృష్టి గోచరమగునట్లు చేయును. చీకటిలో మనము వస్తువులను చూడలేము. అట్లే అజ్ఞానమున్నప్పుడు ఆ పరమాత్మ స్వరూపము కానరాదు. కావున కళ్ళకు హారతిని అద్దుకొనుచు అజ్ఞానాంధకారమును తొలగించి, జ్ఞాన ప్రకాశమును కలిగించుమని దేవుని ప్రార్థించవలెను. సూర్యుని యందు గల జ్యోతి, ఆ పరమాత్మ యొక్క జ్యోతి, మన కండ్లలోగల జ్యోతి ఒక్కటే. జాగ్రదవస్థలో కుడికంటిలో ఆ పరమాత్మ స్థానముండున ని శ్రుతి పలుకుచున్నది.

**15.** దీపం పరబ్రహ్మ అంటారు దాని విశిష్టత ఏమి ? దీపమునకు – ధూపమునకు గల సంబంధమేమి ?

జ॥ దీపము పరబ్రహ్మమునకు ప్రతీకము, పరబ్రహ్మ స్వయం ప్రకాశస్వరూపము. అట్లే దీపమును వెలిగించుటకు నూనె, వత్తి మొదలైనవి అవసరమైనను వెలిగిన దీపమునకు వేరే ప్రకాశము అవసరము లేదు. ఆ దీపము అంధకారమును తొలగించును. కనుకనే జ్ఞానము కలగినప్పుడు అజ్ఞానాంధకారము నిలువజాలదు. దీపము సూర్యునివలె బయటను, లోపలను ప్రకాశ స్వరూపమే. అట్లే జ్ఞానియగువాడు శరీరమునకు లోపలి, బయట ఆ యాత్మ చైతన్యమునే చూచును. ఇక ధూపము వనస్పతి – ఓషధు ల రస స్వరూపము. (వనస్పతి :– మామిడి, పనస మొదలగు పండ్లు ఓషధి :– గోధుమ, వరి మున్నగు ధాన్యములు) పండ్లు ధాన్యములు భూమి నుండి పుట్టినవి, గంధము భూమి యొక్క గుణము, ఆ పరమాత్ముని స్థూల విరాట్స్వరూపమే భూమి, ఆత్మ నుండి ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృధ్వి ఉత్పన్నమైనవి. భూమి యొక్క సార స్వరూపమే ధూపము ఎంత మంచివాసన (సువాసన) గల ధూపమును వెలిగించినచో పరమాత్మ – దేవత అంత తృప్తి నొందును. దూపము స్థూలము దీపము (అగ్ని) సూక్ష్మము. కనుక ఆ పరమాత్మను తెలిసికొనుటకు స్థూలాతి స్థూలలము నుండి సూక్ష్మాతి సూక్ష్మమునకు పోవలెను. దృశ్య తేత్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః అని శ్రుతి హారతితో దీపమును శంఖములో జలమును, పుష్పము, బట్ట, చామరములను దేవునికి చూపించెదరు. దీపము = అగ్ని, శంఖము = జలము, పుష్పము = భూమి, బట్ట = ఆకాశము, చామరము = వాయువు ఈ విధముగా ఐదు తత్త్వములు గల ప్రపంచమును సూచించుట ద్వారా సృష్టికి కారకుడైన పరమాత్ముని కూడా సూచింతురు.

**16.** పంచాక్షరీ మంత్రమేది ? దాని పురశ్చరణకై ఎన్ని సార్లు జపించవలయును ?

జ॥ ఓం నమః శివాయ అనునది శివ పంచాక్షరీ మంత్రము. ఓం రామాయ నమః అనునది రామ పంచాక్షరీ మంత్రము . ఈ విధముగా తారకము (ప్రణవము) చతుర్థి అంతముగల దేవతా శబ్దము. అంతమున నతి

వాచకము నమః గల మంత్రము సామాన్యముగా పంచాక్షరీ మంత్రమై యుండును. అనగా :- మంత్రమునందు ఐదు అక్షరములుండునని అర్థము. ప్రణవము అన్ని మంత్రములకు, స్తోత్రములకు ముందు తప్పక ఉచ్చరింపబడును. లేనిచో మంత్రస్తుతులు ఫల శూన్యములగును. ఒక్కొక్క అక్షరమునకు ఒక్కొక్క లక్షసార్లు జపించుట పురశ్చరణ యనబడును. పంచాక్షరీ మంత్రమునకు 5 లక్షల జపము చేయవలయును. గాయత్రీ మంత్రమును 24 లక్షలు జపించినచో పురశ్చరణ యగును.

**17.** శివుడికి – శివలింగానికి గల సంబంధమేమి ? శివలింగము ప్రాణ పట్టముల ఆధ్యాత్మిక విశేషము లేవి ?

జ॥ శివుని బాణలింగమునే శివుడని భావించి భక్తులు పూజలు చేయుచున్నారు ఈ రెండున్నూ అభేదములు. ఏ విధముగా నామము నామి (పేరు కలవాడు) అభేదములో, అట్లే శివలింగము – శివుడున్నూ ! దీనిని శాస్త్రములో ప్రతీ కోపాసన అందురు. అనగా నికృష్టమునందు ఉత్కృష్ట దృష్టి, బ్యాంకులో పని చేయు గుమస్తాను నీవే యజమానివి. నీవే చంద్రుడివి, నీవే ఇంద్రుడివి అని పొగడినచో మన పనిని ఆ గుమాస్తా త్వరగా చేసి పెట్టును. అదే గుమాస్తాను నీవు నౌకరువు, దుర్వాసుడు అన్నచో మన పని చేయడు సరికదా ! కోపముతో మనలను తిట్టి తరిమివేయునంత పని చేయును.

మరొక ఉదాహరణ – వసిష్టునిచే సన్మానింపబడి విశ్వామిత్రుడు కామధేనువును కోరెను. కాని వసిష్టుడు నిరాకరింపగా తన క్షాత్రశక్తిని ప్రయోగించి విఫలుడయ్యెను. వసిష్టుని దండము ముందు విశ్వామిత్రుని సమస్త సైన్యము గడ్డిపోచవలె భస్మమయ్యెను. అప్పుడు విశ్వామిత్రుడు తపమాచరించి, వసిష్టునిచే రాజఋషి యని పిలువబడెను, బ్రహ్మ ఋషియని పిలువలేదని కోపముచే విశ్వామిత్రుడు వసిష్టుని నూర్గురు పుత్రులను చంపెను. అప్పుడున్నూ రాజ ఋషి అనియే పిలువబడెను. విశ్వామిత్రుని మనస్సులో శత్రుభావమున్నను, వసిష్టుని మనస్సులో మిత్రభావమే ఉండెను. శత్రుత్వముచే పౌర్ణమి వెన్నెలలో వసిష్టుని చంపుటకు ఉద్యుక్తుడై, పరోక్షములో తన ప్రశంసను వసిష్టుని ద్వారా విని అతని విశాల హృదయమును అవలోకించి, అతని పాదములపై బడి, శత్రుత్వమును వదలి, క్షమాశీలుడయ్యెను. అప్పుడు వసిష్టులవారు విశ్వామిత్రుని బ్రహ్మ ఋషి యని సంబోధించి కౌగిలించుకొనిరి. విశ్వామిత్రుడు బ్రహ్మ ఋషి యగుటకు ముఖ్యమైన ఆటంకము శత్రుత్వభావము మరియు అక్షమాశీలత. ఉత్కృష్టమునందు నికృష్టదృష్టిని చూసిన వసిష్టులకు లోకదృష్టిలో శిక్ష కలిగెను. ఏలననగా వారు బ్రహ్మజ్ఞులు, పుత్రులు ఉన్నను లేకున్నను వారికి ఒక్కటే.

కావున తక్కువ శక్తి గల దానియందు ఎక్కువ శక్తిని ఆరోపించి అబేదదృష్టితో పూజించుటయే ఉపాసన, సాలగ్రామ శిలాఖండము (గండకీ నదిలోని శిల) నందు విష్ణుదృష్టిని నర్మదా శిలాఖండమునందు శివదృష్టిని ఉంచి పూజించుట శాస్త్రసమ్మతము. వీటికి ప్రాణ ప్రతిష్ఠ అవసరము లేదు, ప్రాణపట్టము కేవలము శివలింగము నుంచుటకు ఆధారము. స్వయంభూ శివలింగముకల స్థలములో ప్రాణపట్టములు లేవు. ఉదాహరణకు కేదార్‌నాథ్ త్ర్యంబకేశ్వర్ నీలకంఠ మహాదేవులు. ఈ స్థానములలో తర్వాత భక్తులు ప్రాణపట్టములను, లేక పరిధిని నిర్మించిరి, ప్రాణపట్టము (జులేరి) ను గూర్చి వేర్వేఱు మతస్థులు

సనాతనాలంబులను చలింపజేయుటకు విభిన్న రీతులలో వర్ణించుచున్నారు. అదికేవలము నిరాధారము, శాస్త్ర విరుద్ధము మఱియు మూర్ఖ ప్రలాపము మాత్రమే !

**18.** గృహములలోని పూజామందిరములలో తైలవర్ణ చిత్రపటములను, లేదా విగ్రహములను పెట్టినప్పుడు గృహస్థుడు ప్రాణ ప్రతిష్ట చేయవలయునా ? అసలు ప్రానప్రతిష్ఠ అనగా నేమి ?

జు॥ గృహస్థుడు గాని ఏ ఆశ్రమస్థుడు గాని పటమును, లేక విగ్రహమును పూజింపదలచినచో ప్రాణ ప్రతిష్ఠ అత్యావశ్యకము, దేవోభూత్వాదేవాన్ యజేత (నర్మదేశ్వరుని, సాలగ్రామమును పూజించుటకు ప్రాణ ప్రతిష్ఠ అవసరము లేదు) అనగా నీవు దేవతవై దేవుని పూజింపుము. పూజా సమయములో దేవత ప్రత్యక్షముగా ఉన్నట్లుభావించవలయును. శాస్త్రోక్త మంత్రోచ్చారణములతో విగ్రహమునందు ప్రాణ ప్రతిష్ఠ చేయుదురు, అనగా – వేద మంత్రోచ్చారణముచే దేవత ఆ విగ్రహమునందు ప్రవేశించును. మంత్రముల శక్తి సర్వజన విదితమే. సాధారణ వ్యక్తిని (త్రోవలోపోవు వానిని తిట్టినచో, వాడు తిరుగబడి లెంపలు వాయించును. లేక మరి నాలుగు తిట్లు అధికముగా తిట్టును, సాధారణ పదములలో ఇంత శక్తియున్నచో, వేద మంత్రముల శక్తిని వర్ణింప ఎవరి తరము ? జీవించియున్న తల్లిదండ్రుల సేవ చేసి వారి ఆశీస్సులను పొందుట ఎట్లో, అట్లే ప్రాణ ప్రతిష్ఠ చేసి విగ్రహారాధన కేవలము చిత్రపటములను, ప్రాణ ప్రతిష్ఠకాని విగ్రహములను పూజించుట స్వర్గస్థులైన తల్లిదండ్రుల నిమిత్తమై చేయు సేవ వంటిది.

**19.** మంత్రానికి గల శక్తి, బీజము, కీలకము, ముద్ర, అనువాటిని విశదీకరింప ప్రార్థన.

జు॥ శక్తి :- ప్రతి భాషయందు పదములకు, వాక్యములకు నాచ్యర్థము ఉండును. దీనిని శక్తి అందురు, కుండ అ పదమునకు శక్తి. కుండాకారము గల వస్తువును సూచించుటయందు కలదు. అట్లే ఆవు అనుపదము యొక్క శక్తి ఆవు ఆకారముతోన్న జంతువును సూచించును. తల్లి దండ్రులు పెట్టిన నామధేయము ద్వారా పిల్లలను పిలిచెదరు. పిల్లలు దూరముగా నుండిన వారి నామస్మరణము మాత్రమునే వారి ఆకారము మనస్సులో మెదలును. అట్లే మంత్రముల స్తుతిపాఠముల యొక్క శక్తి ఆయా దేవతా స్వరూపములను సూచించును.

బీజము : మఱ్ఱి వృక్షము యొక్క శక్తి అంతయు మఱ్ఱి బీజము లోనే ఇమిడియున్నది అట్లే మంత్రముల యొక్క, స్తుతి పాఠముల యొక్క వ్యాపకరూపమైన శక్తి బీజాక్షరముయందు ఇమిడియున్నది. అనుకూల వాతావరణముచే విత్తనము మహావృక్షమయినట్లు మంత్రములను బీజాక్షరములచే జపించుట వలన జపించు వారికి అధిక ఫలము లభించును. అందులకే కృష్ణ భగవానుడు గీతలో యజ్ఞానాం జప యజ్ఞోస్మి అనిరి. మరికొందరు మహా పురుషులు జపాత్ సిద్ధిః అని నుడివిరి.

కీలకము :- కీలు అనగా మేకు. యంత్రములయందు కీలకస్థాన మందు ఉన్న మేకుకాని, బోల్ట్‌గాని పడిపోయినచో యంత్రము పని చేయదు. అట్లే మంత్ర, స్తుతి పాఠములందు పాఠకులకు కలుగు ప్రతిబంధకములను ఈ కీలకములు తొలగించును. పాఠకులకు ప్రతిబంధకములు అనగా మంత్ర స్తుతి పఠన

ద్వారా కలుగు ఫలితము లభించకుండుట, అప్పుడు కీలకము సహితము మంత్ర జపముద్వారా, లేక కీలక స్తుతి ద్వారా ముల్లుతో ముల్లు తొలగించినట్లు ప్రతిబంధకములు తొలగును.

ముద్ర :- యోజనాత్ సర్వదేవానాం ద్రాణాత్ పాప సంహతేః

తస్మాత్ ముద్రేతి సా ఖ్యాతా సర్వ కామార్ధ సాధనీ.

అనగా వ్రేళ్ళు కలిపి ముద్రలు చూపించుటవలన దేవతలందరు పరిగెత్తుకొని ముద్రలు చూపించు వారి వద్దకు వచ్చెదరు. మరియు వారి పాపమును నశింపజేసెదరు. వారి కోరికలన్నింటిని సిద్ధింపజేసెదరు, కనుకనే ముద్ర అందురు.

**20.** దేవతామూర్తులలో అమ్మవార్ల చిత్రపటాలు దేవుళ్ళకి ఎడమ ప్రక్కగా ఉంటే ఒక్క తిరుపతి వేంకటేశ్వరునికి మాత్రం అమ్మవారు కుడి ప్రక్క ఉండుటకు కారణమేమి ?

జ॥ రామావతారములో శ్రీరాముడు మారీచుని (బంగారు జింక) చంపుటకు పోవుటకు ముందు సీతదేవిని అగ్నిప్రవేశము చేయించి వేదవతిని సీతాస్థానములో ఉంచెను. లంకా విజయానంతరము సీతాదేవిని అగ్ని ప్రవేశము చేయించి అసలు సీతను తెచ్చుకొనెను. అపుడు వేదవతి రాముని పత్నిగా స్వీకరించమని ప్రార్థించగా రాములవారు ఇప్పుడు నేను ఏకపత్నీ వ్రతుడను. కలియుగములో నీవు ఆకాశరాజు కూతురుగా పద్మావతి పేరుతో పుట్టెదవు. అప్పుడు నిన్ను భార్యగా స్వీకరించెదననెను.

ఒక సారి భృగుమహర్షి వైకుంఠమునకు వెళ్ళి విష్ణువుచే అతిథి సత్కారము పొందలేదని ఆగ్రహించి శ్రీ మహావిష్ణువు యొక్క వక్షః స్థలము పై కాలుతో తన్నెను. అప్పుడు లక్ష్మీదేవి ఆగ్రహించి భూమి పై కొల్హాపూరు అను స్థలములో తపస్సు చేయనారంభించెను. వైకుంఠములో లక్ష్మీదేవి వియోగము కలుగగా అశాంతిని పొంది విష్ణువు శేషాద్రి (తిరుమల) పై మనుష్య రూపము దాల్చి అవతరించెను. ఆకాశరాజుకు వేదవతి పద్మావతి రూపములో కుమార్తెగా లభించెను. బ్రహ్మ, ఈశ్వర, కుబేరుల సహాయముతో పద్మావతి శ్రీనివాసుల కల్యాణము వైభవముగా జరిగెను. దేవతల సమక్షములో శ్రీనివాసులు వేంకటేశ్వరుని నామముతో భక్తులను కలియుగాంతము వరకు అనుగ్రహించుటకు సంకల్పించెను. మందిరము తయారైనది. ఆ సమయమున నారదులు లక్ష్మీదేవితో సమాచారమును అంతయు వివరించి చెప్పగా లక్ష్మీదేవి పద్మావతీ శ్రీనివాసుల ఏకాంత స్థలమునకు వచ్చి పద్మావతితో తగవులాడ నారంభించెను.

సర్వభూతముల భర్తయైన శ్రీనివాసులు వారిని అనుగ్రహించి వారి పుట్టు పూర్వోత్తరములు వివరించి పద్మావతీ దేవిని కుడి వక్షస్థలముపై మొదటి భార్యయైన లక్ష్మీదేవిని ఎడమ వక్షః స్థలముపై ఉండుమని చెప్పిరి. అందువలననేమో వేంకటేశ్వరస్వామి కుడి ప్రక్కన అమ్మవారి విగ్రహమును చూచి యుందురు.

## 3. వేదాంత పరమైన ప్రశ్నలు – జవాబులు

**1.** సాక్షి చైతన్యానుభవము అంటే ఏమిటి ?

జ॥ పంచజ్ఞానేంద్రియములు పంచ కర్మేంద్రియములు, మనో బుద్ధి చిత్తాహంకారములతో కూడిన అంతఃకరణము కలిపి సూక్ష్మశరీరమనబడును. అనగా దీనిలో **19** తత్త్వములున్నవి. ఇవన్నియును అపంచీకృత పంచ మహాభూతముల చేత సృష్టింపబడినవి కావున అతి సూక్ష్మములై యుండును. స్థూలదృష్టికి కానబడవు. పంచభూతములచే నిర్మింపబడుటచే సూక్ష్మశరీరము జడపదార్థమైయున్నది. ఈ యంతఃకరణోపాధి కలవాడు జీవుడనబడును. పరమాత్మ చైతన్యము సర్వత్రా వ్యాపించియున్నది అంతఃకరణమునందు ప్రతి బింబించిన చైతన్యము జీవ చైతన్యమనబడును. అచ్చటనున్న బింబరూప చైతన్యము సాక్షి చైతన్యమనబడును. అప్పుడు ప్రతిబింబించిన జీవ చైతన్యమునందు చేష్టలు ఎట్లు కలుగునని శంకరావచ్చును. మరిగిన నీరు కాలిమీద పడిచనో, కాఫీతో మూతి కాలినచో, సాధారణంగా జనులు నీళ్లతో కాలినదని చెప్పుదురు. నీటి స్వభావము శీతలము, కాని అందు ప్రవేశించిన అగ్నికణములతో తాదాత్మ్యమునొందుటచే అది కాల్చును. అటులనే అజ్ఞానము ద్వారా అధ్యపితులైన జీవులందు చేష్టలు కానబడుచున్నవి. అట్టి అధ్యాసము తొలగించి కారణ సూక్ష్మ – స్థూల శరీరములు నేనుకాను. కాని నిస్సంగ – నిర్లేపచైతన్యమునే నేను అనెడి అనుభవమే సాక్షి చైతన్యానుభవ మనబడును.

**2.** పరమాత్మ అనుభవము పొందుటకు ఏమి చేయాలి ?

జ॥ పైన చెప్పిన రీతిగా సాక్షి చైతన్యమును అనుభవించిన ఎడల దేశ – కాల, వస్తు పరిచ్ఛేద శూన్యమైన పరమాత్మానుభవము కలుగదు. సర్వ వ్యాపకమై చైతన్యము – ప్రత్యక్ష చైతన్యము ఒకటిగా అనుభవించుటయే పరమాత్మానుభవమనుబడును. దీనినే మన వేదములు మహా వాక్యములచే ప్రతిపాదించినవి. ఐక్యానుభూతికి లం విక్షేపం, ఆవరణములనెడి మూడు ప్రతిబంధములు కలవు. మలమహాపాపము నిష్కామ సేవ లేక కర్మ ద్వారా నశించును, ఉపాసన ద్వారా విక్షేపము మటుమాయమగును. శ్రవణ మనన – నిధి ధ్యాసనల ద్వారా ఆవరణము నశించును. ఇది జ్ఞాన మార్గము. ముక్తి యొక్క స్వరూపము. ఇది లభ్యము కానివారు నిష్కామ సేవ, వేద విహితములగు నిష్కామ కర్మలను చేయుచు, స్వధర్మాచరణ ద్వారా ఉపాసన మొనర్చుచు ఆధ్యాత్మిక మార్గమునధిగమింపగలుగుదురు. అట్టివారికి శ్రీ కృష్ణ పరమాత్మ దదామి బుద్ధియోగం తం యేన మాముప యాంతితే స్వే స్వేకర్మణ్యాభిరతః సంసిద్ధింలభతేనరః అని పలికెను. అనగా సగుణోపాసకులకు జ్ఞాన మార్గావలంబన బుద్ధిని పరమాత్మయే ఇచ్చును, జాతి, ఆశ్రమ విహితకర్మలననుసరించినచో సిద్ధినిబడయవచ్చును.

**3.** దైవీ అనుభూతి ఎప్పుడు లభించును ?

జ॥ నాయనా ! దైవ సాక్షాత్కారము కూరగాయల బేరము కాదు. వివేక వంతులకు దృఢ విశ్వాసమున్నచో అనుభూతి త్వరగా లభించును. త్రాటి యందు పామును చూచి భ్రమించువారు అధిష్ఠానమై రజ్జ జ్ఞానముచే

భ్రమ నివృత్తులగుదురు, అట్లే అజ్ఞానము ద్వారా కలిగిన దేహాధ్యాసను తొలగించినచో, జ్ఞానము కలుగును, అట్లు కాదేని గీతలో చెప్పబడిన ప్రకారముగా స్థిత, ప్రజ్ఞలక్షణములను, పదునాఱవ అధ్యాయములో చెప్పబడిన దై వీసంపద్విభాగ లక్షణములను, పంద్రెండవ అధ్యాయములో చెప్పబడిన భక్తుని లక్షణములను ఎన్నింటిని అవలంబించినచో, ఆధ్యాత్మికోన్నతి కలుగును. అన్నింటిని అవలంబించినచో దైవానుభూతి కలుగుననుట తథ్యము.

**4.** ప్రాతిభాసికము – అభినివేశము అంటే ఏమిటి ?

జ॥ అధ్యాస కాలే భాస మానత్వేసతి అధ్యాస భిన్నకాలే అభాసమానః ప్రాతిభాసికము.

భ్రమ కాలమందు కనిపించి, తద్ భిన్నకాలమందు కనిపించకుండా ఉండుట. త్రాటియందు సర్పము భ్రమ కాలములో కన్పించును. తద్భిన్న కాలములో త్రాడుగనే కానబడును.

ఆగంతుక దోష వశీకృత అ విద్యాకార్యం ప్రాతిభాసికమ్

మనయందును, మనకంటే బయటనున్న దోషములు సహాయముతో కలిగెడి అవిద్యాకార్యమే ప్రాతిభాసికము. యథాశుక్తౌరూప్యమ్ శుక్తియనగా ముత్యపుచిప్ప. రూప్యమనగా వెండి, ముత్యపుచిప్పయందు వెండిని చూచుట ప్రాతిభాసికము. ముత్తెపుచిప్పయొక్క నల్లని వెనుక భాగముగు త్రికోణరూపము కనిపించపోవుట మన కంటి దోషము. అతి తీవ్రములైన సూర్యకిరణములు ప్రతిఫలించుట బయటి దోషము. ఈ రెండింటి వల్ల ముత్తెపు చిప్ప వెండి ముక్కవలె కానబడును. అధిష్ఠానము ముత్తెపుచిప్ప. అధ్యస్తము వెండి. అట్లే మనయందున్న అజ్ఞానదోషము వల్ల అధిష్ఠానమై యున్న ఆత్మను పరిభ్రమింపజేసి, నేను శరీరమనెడి భ్రమచే మనము అజ్ఞానమునందు మునిగియున్నము.

అభినివేశము :– స్వీకృతస్య పునః త్యాగ అసహిష్ణుత్వం అభినివేశః

శరీరమును స్వీకరించి మరల దానిని వదులుటయందుగల భయము, ఆయుస్సు నశించినను, శరీరము, ఇంద్రియములు అనిత్యములైనను నా శరీరము నశింపకుండునుగాక ! యనెడి సర్వప్రాణుల స్వాభావిక మరణ భయము.

**5.** బ్రహ్మ సూత్రములు అంటే ఏమిటి ?

జ॥ ఒక దృష్టిని సారించినచో ఉపనిషత్తులలో అనేకములైన పరస్పర విరుద్ధములైన చింతనలు కనిపించును 1) సంహిత 2) బ్రాహ్మణము 3) అరణ్యకము 4) ఉపనిషత్తులని శ్రీ వేదవ్యాసులవారు వేదము లను నాలుగు భాగములగా విభజించిరి, అంతిమ భాగమే వేదాంతము, వేదానాం అంతః వేదాంతః అని చెప్పబడినది. ఈ వేదాంతములోని విరుద్ధాభాసమును తొలగించుటకై వేదవ్యాసులవారు 555 సూత్రములను గూర్చి నాలుగు అధ్యాయములలో వ్రాసిరి. ఒక్కొక్క అధ్యాయములో నాలుగు పాదములు కలవు. వీటినే బ్రహ్మసూత్రములందురు.

**6.** అధ్యాస అంటే ఏమిటి ?

జ॥ బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః అనునది శ్రీ ఆది శంకరాచార్యులవారి వేదాంతసారము.

ఉపనిషత్తులలో చెప్పబడిన బ్రహ్మమే నిత్యము. తదితరమంతయు అనగా ఈ కనిపించుచున్న జగత్తు అనిత్యము అతస్మింస్తద్బుద్ధి :- అధ్యాసము, ఒకదానియందు మఱొకటి తోచుట, ఒకటి మఱొకటిగా కనబడుట అవిద్య, భ్రమ. ఈ జీవుడు కూడా బ్రహ్మమే ! ఈ బ్రహ్మము సచ్చిదానంద స్వరూపము. అహంబ్రహ్మాస్మి (బృ. ఉ. 1-4-10) తత్త్వమసి (ఛాం. ఉ. 6-8-7) అను మహా వాక్యములుకూడా జీవ బ్రహ్మైక్యమునే చాటుచున్నవి. మనము ఈ ఇంద్రియముల ద్వారా అనుభవించుచున్న నానాత్వము ఎక్కడి నుండి వచ్చెను : అనునది ప్రశ్న. సత్యము అనుభవమును ఖండింపలేదు. కనుక ఈ నిత్యానుభవము. సత్యముల భేదమును చెప్పవలయును, నానాత్వానుభవము మాయ వలన కలుగుచున్నది. ఈ మాయకు అస్తిత్వము లేదు, జ్ఞానోదయమైనప్పుడు మాయ తొలగును. అప్పుడు బ్రహ్మానుభూతి కలుగును. ఈ జగత్తు కేవలము అంధకారములో త్రాటిని చూచి సర్పము అని భ్రమించుట వంటిది. ఈ భ్రమ అజ్ఞానము వల్ల కలుగును. ఈ అవిద్య అనాది. అనగా దీనికి ఆది లేదు. ఈ అజ్ఞానమే ద్వైతమునకు, అనేకత్వమునకు కారణము. ఆ సర్వాంతర్యామియగు బ్రహ్మమును జగత్తుగా భ్రమింపజేయుచున్నది. శరీరము ఇంద్రియములతో ఏకీభవించిన జీవుడు నేనే కర్తను, నేను భోక్తను అనుచు జన్మ – మృత్యు, సుఖ – దుఃఖముల ఒత్తిడిచే ఈ సంసారబంధనములో చిక్కుకొనెను. శ్రీ శంకరాచార్యులవారు మిథ్యయని చెప్పినప్పుడు ఈ జగత్తుకు వ్యావహారిక సత్తా ఉన్నప్పటికీ పారమార్థిక సత్తా (అస్తిత్వము) లేదు అనిరి. అది స్వప్నమును చూచుచున్నంత సేపు ఉన్నట్లు కనిపించినను, మెలకువ వచ్చిన తర్వాత అది కేవలము స్వప్నమనియు, దానికి అస్తిత్వము లేదనియు చెప్పుదుము. ఈ మాయ, అజ్ఞానము కూడా అటువంటిదే, సత్యమునకు అసత్యమునకు ఏ విధమైన సంబంధము లేదు. అహమనెడి జీవ చైతన్యమును దేహేంద్రియములను ఐక్య మొనర్చుటయే అధ్యాసయని చెప్పబడును.

7. జాగ్రదవస్థలో స్వప్నానుభూతిని చెప్పినట్లు స్వప్నములో జాగ్రదవస్థ యొక్క అనుభూతి ఏల చెప్పబడలేదు ?

జ॥ స్వప్నావస్థ మిథ్య, ఏ విధముగా మదాంధకారములో త్రాటియందు పామును చూచెదమో, ఏ విధముగా ముత్యపు చిప్పయందు ఆరోపింపబడిన వెండిని చూచెదమో, అట్లే జాగ్రదవస్థయందు స్వప్నమును చూచుచున్నాము, ఆరోపింపబడిన వెండితో ఆభరణములను చేయజాలము. ఆరోపింపబడిన పాము మనలను కరువదు. స్వప్నములో దొరికిన బంగారమునకు ఒక్క పైసా కూడా దొరకదు. జాగ్రదవస్థ వ్యావహారిక సత్యము. స్వప్నావస్థ ప్రాతిభాసికము. అనాది నుండి మన యొక్క సంస్కారములు వ్యవహారదశలో ప్రాతిభాసికముగా చూచుటకు అలవడినవి. కావున అసత్యమైన ప్రాతి భాసికమును వ్యవహారదశలోనికి తీసుకొనిరాజాలము, దానికి సత్తాయే లేదు స్వప్నము ప్రతీతి మాత్రము, అది వ్యావహారికముగు జాగ్రదవస్థను ప్రతిపాదింపజాలదు.

**8.** దేవుడున్నాడా ? ప్రపంచములోని సుఖ దుఃఖములకు అతడే బాధ్యుడా ?

జ॥ వాయువునకు రూపములేదు, కాని వాయువులేదని చెప్పజాలము, ఆకాశము యొక్క గుణము శబ్దము. అది వినిపించును, కాని కనిపించదు. కావున కానబడని ఆకాశము ఉన్నదని గ్రహింపవలయును. సూర్యుని తాపము, చంద్రుని వెన్నెల, నక్షత్రముల కాంతి, గ్రహముల సంచారము ఆ పరమేశ్వరుని శక్తి వల్లనే కలుగుచున్నవి. పంచభూతములగు ఆకాశము అగ్ని, వాయువు, నీరు, భూమి ఒకదానికొకటి శత్రువులవలె భిన్నములై యున్నవి, ఐనను ఆ పరమాత్ముని శక్తి వలనే ఈ భూతములు తమ తమ కార్యములను నెఱవేర్చుచున్నవి. క్షితి ఆంకురాదికం, సకర్తృకం కార్యత్వాత్ ఘటవత్.

కుండ చేయుటకు కుమ్మరి అవసరము. అట్లే ఈ విచిత్రమైన జగత్తు సృష్టికర్త వల్లనే ఉత్పన్నమైనది. ఇది తార్కిక సిద్ధాంతము. ఆస్తికతకు, ఆధ్యాత్మికతకు, ధార్మికతకు నిలయమైన ఈ భారతమాత ఉదరమునందు జన్మించిన మీకు దేవుడున్నాడా ? అని ప్రశ్నించుట సిగ్గుచేటు.

నాదత్తే కస్యచిత్పాపంనచైవ సుకృతం విభుః ఆ పరమాత్మ ఎవరి పాపమును గాని, పుణ్యముగాని గ్రహింపడనే అర్థము. మనము చేసిన కర్మలన్నియు మనకు జ్ఞాపకముండవు. కాని సూత్రాత్మ స్వరూపుడుగా మనయందే ఉండిచ మన కర్మలకు తగిన ఫలితములను ఆ పరమాత్మయే మన కొసంగును. భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా ! అని గీతోక్తి. యంత్రములను త్రిప్పినట్లు ఈ ప్రాణులను నా మాయా శక్తిచే త్రిప్పుచున్నాన ని దీని అర్థము. యథాకర్మ యథా శ్రుతమ్ ఎటువంటి కర్మ చేసినచో, అటువంటి ఫలము కలుగునని భావము.

**9.** ఆధ్యాత్మిక ఆదిభౌతిక, ఆధి దైవిక తాపములు అనగా నేమి ?

జ॥ ఆధ్మాత్మిక తాపములందు ఆత్మ, మనస్సు మఱియు శరీరము యొక్క అపూర్ణత, అధ్యాసలను తొలగించి ఆత్మ జ్ఞానము పొందుటవలననే ఆత్మతాపము తొలగును. మనస్సు ఏకాగ్రతను పొందకుండుట, స్తిమితము లేకుండుటయే మనస్తాపము. దీర్ఘకాలీన, నైరంతర్య (నిరంతరము) సాధన వలన ఈ తాపము తొలగును. శారీరకబాధ, శరీరతాపము, అనారోగ్యకాలము నందు స్వాధ్యాయమును, సాధనను చేయలేము. అందులకే అస్వస్థత కాలమునందు తపస్సు దృష్టితో రోగమును సహించవలయును, స్వధర్మాచరణే కష్టసహొనంతపః పై చెప్పబడిన 3 తాపములు శాంతి కొరకు శాంతి మంత్రములలోని మొదటి శాంతిని చెప్పుదుము. ప్రకృతి మఱియు దైవీశక్తుల ద్వారా దృశ్యాదృశ్య రూపమున కలుగు తాపములు ఆధిదైవిక తాపములన బడును. అతివృష్టి, అనావృష్టి, వరదలు, భూకంపములు మొదలగునవి ఆధిదైవిక తాపములు, వీటి శాంతికి శాంతి మంత్రములలోని రెండవ శాంతి చెప్పబడును. సామాజిక, సాంసారిక, పారివారిక తాపములు ఆధిభౌతిక తాపములనుబడును, యుద్ధములు, కలహములు, వీటి ఉపశమనార్థము మూడువ శాంతి చెప్పబడును ముఖ్యముగా సాధకులు కామ, క్రోధములను తగ్గించుకొనుటకై కనీసము దశశాంతి మంత్రములను నిత్యము పఠించుచుండవలయును.

**10.** స్వామీజీ ! తమరు జూలై **1994** శ్రీ శివానందవాణిలో అధ్యాసము లేక భ్రమ జ్ఞానము గూర్చి వివరించినారు. ఇప్పుడు అథాతో బ్రహ్మ జిజ్ఞాసా అను సూత్రమును గురించి వివరించగలరా ?

జ॥ అథ అనగా సాధన చతుష్టయ సంపన్నానంతరము ఆతః అనగా వేదవిహిత కర్మముల యొక్క ఫలము అనిత్యమగుట వలన, జ్ఞానము ద్వారానే మోక్షము కలుగునని తెలిసిన తరువా, బ్రహ్మణః జిజ్ఞాసా ఉపనిషద్ వాక్యముల ద్వారా బ్రహ్మ విచారము చేయవలెను. దీని భావమేమంటే ఇప్పుడు ఈ కారణము చేత బ్రహ్మమును గూర్చి విచారించడము జరుగుచున్నది. అనగా ఈ అథ అను పదము శ్రీ శంకర భగవత్పాదుల వారు ఇలా వివరించారు.

సాధన చతుష్టయ సంపత్తికలిగిన తరువాతనే బ్రహ్మ సూత్రములను అధ్యయనము చేయగలమనియు, కనుక అథ అనగా ఒక విషయము వివరించవలసియుంటుంది. బాదరాయణులవారు రచించిన బ్రహ్మ సూత్రముల యందు మొదటి జిజ్ఞాసాధికరణముతో ప్రారంభమవుతోంది. అందులో ఈ పైన చెప్పిన అథాతో బ్రహ్మ జిజ్ఞాసా అనేది ప్రథమ సూత్రము.

జిజ్ఞాసాధికరణమునందు ఈ ప్రథమ సూత్రము బ్రహ్మ జిజ్ఞాసను కొనసాగించు ముముక్షువునకు ఉండవలసిన యోగ్యతలను తెలియజేయుచున్నది. పూర్వపు ఆధ్యాత్మిక విద్యాభ్యాసమంతయు, గురుకుల వాసమునందే జరుగుచుండెడివి. అష్టవర్ష ప్రాయమున ఉపనయన సంస్కారము గావించబడి, ఆ తదుపరి వేదవాఙ్మయమును జీర్ణించు కొనవలెననిన మొదట వేదాంగములను అధ్యయనము చేయవలసియుండెడిది. శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందస్సు, జ్యోతిషమనెడి ఈ ఆరును వేదాంగములని పిలువబడెడివి. వేదాంగముల నభ్యసించిన పిదప వేదములలో గోచరించు విరుద్ధ భావములను గ్రహించుటకు పూర్వమీమాంస అధ్యయనము చేయబడుచుండెను. తదనంతరము పూర్వమీమాంస తెలియజేయు కర్మ కాండ ద్వారా యజ్ఞాది క్రతువులాచరించు విధానమును తెలసికొనును. కర్మ కాండను ఆచరించుట ద్వారా పొందు ఫలితము అనిత్య స్వర్గ ఫలమే గనుక దానిపై వైముఖ్యము చూపుచూ బ్రహ్మను తెలిసికొనుటకు జిజ్ఞాసువు ఉపక్రమించును.

భ్రాంతి వలన శబ్దాది విషయములు నిత్యములు, ఆనందకరములు, అని తోచుచున్నది. శ్రుతివాక్యముల ద్వారా పరబ్రహ్మమే నిత్యమనియు, ప్రపంచము అనిత్యమని, వివేకము కలిగిన తరువాత బ్రహ్మ విచారము చేయును. భగవద్గీతలో కృష్ణుడు అనిత్యము సుఖంలోకం ఇమంప్రాప్య భజ స్వమామ్ అనెను. సాధారణ వ్యక్తికి ఈ ప్రపంచము, శరీరము, శబ్దాది విషయములు నిత్యములుగా తోచును. కాని వివేకముతో చూచిన అనిత్యములని అర్థమగును, ఎట్లనగా ? మారుతీ కారును అందరు కారే అందురు. కాని వివేకముగల వ్యక్తి ఈ కారు గాజు, ప్లాస్టిక్, ఇనుము మొదలైన వస్తువుల కలయిక అని చెప్పును. అట్లే ఆధ్యాత్మిక మార్గమును ఉన్నతి చెందిన మనిషి ఈ ప్రపంచము మొదలైనవి అన్నియు పంచభూతముల కలయిక, చైతన్యమొక్కటే నిత్యమని గ్రహించగలడు కనుకనే అథ అను శబ్దమునకు నిత్యానిత్య వస్తు వివేకము,

ఇహాము ఫలభోగ విరాగము శమాది షట్ సంపత్తి, ముముక్షత్వము అను ఈ సాధన చతుష్టయానంతరమే అని అర్థము.

సాధన చతుష్టయము దృఢవైరాగ్యముచేతనే పరిపక్వమగును. కాని స్వర్గాది సుఖములు కోరుచు ఇంద్రియ సుఖములు అనుభవించువారికి ఇచ్ఛ నశించనందున వైరాగ్యము దృఢముకాదు, కర్మములు అనిత్యములనియు వాని వలన ప్రయోజనము లేదనియు ఎట్లయినను నిత్యఫలమునే సంపాదించవలయును అను నిశ్చయము స్థిరమైననే విషయవాసనలయందు ఇచ్ఛ తొలగును. కావున అత శబ్దమునకు అర్థము కర్మఫలములు అనిత్యములే అని నిశ్చయించిన తరువాత అని. లోక ప్రసిద్ధులైన మీరాబాయి, రామకృష్ణ పరమహంస మొదలైనవారి అలౌకికానందము ముందు సామాన్య ప్రజల లౌకికానందము తీసికట్టు. అందులకే భక్త ప్రహ్లాదుడు విష్ణుభక్తిలేని విబుధుండు విబుధుడే పాదయుగముతోడి పశువు గాక అనెను. ఈ మహాపురుషులను దృష్టిలో ఉంచుకొని కామ క్రోధాదులను విషయ సుఖముల ఇచ్ఛలను తొలగించుకొనెదరు గాక !

సామాన్యముగా అహం ప్రత్యయరూపమగు (తెలిసిన) అనుభవించుచున్న చైతన్యముచే పరబ్రహ్మరూపమున అపరోక్షముగా తెలుసుకొనుటకు వేదాంత వాక్యముల విచారమును చేయవలెను. కొందరు దేహమునే బ్రహ్మ మనియు (చార్వాకులు). క్షణిక విజ్ఞానము, శూన్యమే బ్రహ్మమనియు (బౌద్ధులు), దేహవ్యతిరిక్తమైన సంసారి, కర్త, భోక్త, బ్రహ్మయని (నైయాయకులు), జీవవ్యతిరేకమైన ఈశ్వరుడే సర్వజ్ఞుడు, సర్వశక్తి మంతుడు అని కొందరు (యోగులు). ఈ విధముగా అనేక మతభేదములు కలవు. కనుకనే మోక్షము నిచ్చు అవిరుద్ధతర్క సాధన భూతమైన వేదాంత వాక్యముల విచారము ఆరంభమగుచున్నది.

**11.** మనస్సుతోను పూర్వ స్మృతులతోను – ఈ శరీరములో ఉండి ఆత్మను దర్శించుట ఎట్లు ?

జ॥ పూర్వజన్మలలో చేసిన పుణ్యాపాపములు సంస్కారములు వలన ఈ జన్మము వచ్చినది. మనము సాధారణముగా జాగ్రదవస్థలో **1/8** ( ఎనిమిదవవంతు) మనస్సుతో అన్ని పనులు చేస్తూ ఉంటాము. మిగిలిన ఏడు భాగములను అజాగ్రత్త మనస్సందురు. దానిలో పూర్వ జన్మములోని సంస్కారములు అన్నియు ఉండును. తీవ్ర సాధన ద్వారా ఈ సంస్కారములను అన్నింటిని తొలగించుటనే మనశ్శుద్ధి అందురు. శుద్ధ మనస్సు నందు వివేక వైరాగ్యములు జనించి జ్ఞానోదయమునకు తోడ్పడును. అందులకే గీతలో కృష్ణభగవానుడు, ప్రజాహతి యదా కామాన్ సర్వాన్ పార్ధ మనోగతాన్, ఆత్మన్యే వాత్మనా తుష్టః స్థిత ప్రజ్ఞాస్తదోచ్యతే అనిరి. ఎప్పుడు మనస్సులోని కోరికలన్ని తొలగించి ఆత్మయందే తృప్తిని పొందునో అప్పుడే స్థితప్రజ్ఞుడగును. జీవించి ఉండగా ఆత్మానుభూతిని పొంది దేహముతో సంచరించు అవస్థను జీవన్ముక్తి అవస్థ అందురు.

**12.** జీవాత్మ మరొక జన్మనెట్లు పొందును ?

జ॥ ఛాందోగ్యోపనిషత్తు (5-10-5.6.7) పంచమాధ్యాయము, దశమఖండము 5, 6, 7 మంత్రముల ద్వార పునర్జన్మ గురించి తెలిసికొన వచ్చును.

కర్మక్షయమగు వరకు చంద్రలోకములో ఇంద్రియ భోగముల ననుభవించి, దిగువ తెలిపిన మార్గములో పునర్జన్మనెత్తెదరు. ఆకాశము, వాయువు, ధూమము, మేఘము, పిమ్మట వర్షము గుండా జీవులు పయనింతురు. (సూక్ష్మ శరీరము ఆయా భూతముల కంటుకొని యుండును. గోధుమలు మున్నగు వాటిని పిండి చేసినను, ఆ సూక్ష్మ శరీరము నష్టము కాదు) తరువాత జీవులు వడ్లు, గోధుమలు, ఓషధులు, వనస్పతులు మొదలగు వాటి యందు ఉద్భవించును ఆయా పదార్థరూపముల నుండి మరల జీవులు బయట పడుట చాలా కష్టము, మానవులు తిను ఆహారములో జీవులు పురుషుని శరీరమునందు ప్రవేశించి రేతస్సు ద్వారా స్త్రీ శరీరము నుండి అన్నగత ప్రాణులుగా జన్మింతురు.

**13.** బ్రహ్మసాయుజ్య మంటే ఏమిటి ? బ్రహ్మసాక్షాత్కారము ఎంత కాలానికి సాధ్యము ? గురువు అవశ్యకమా ?

జ॥ సయుగ్‌భావం సాయుజ్యం సయుగ్ భావమంటే సమాన దేహేంద్రియాభిమానము. ఇష్ట స్వరూపమువంటి స్వరూపమును పొంది, ఆ దేవతతోపాటు ఉండుట. ప్రాణమునే సామమని ఉపాసించుటవలన సాయుజ్యము కలుగును, మఱియు ఈగ, దోమ, ఏనుగు మొదలగు వాటన్నింటి యందు ఆ ప్రాణము సమముగా ఉన్నదని ఉపాసించుటవలన సాయుజ్య ప్రాప్తి కలగును. ఇది సగుణము. ఇక బ్రహ్మసాయుజ్యమనగా : నిర్గుణ నిరాకార బ్రహ్మముతో ఏకీభవించుట. నిష్కామ కర్మములన పాపము నశించును నిరంతరము దేవతా ఉపాసన వలన విక్షేపము (మనశ్చంచలత) నశించును. వేదాంత శ్రవణ, మనన, నిధిధ్యాసనములవలన ఆవరణము నశించును. అజ్ఞానావరణము బ్రహ్మము నుండి జీవుని వేరు చేయును. ఈ విధముగా నిష్కామ కర్మ, ఉపాసన, వేదాంత శ్రవణమువలన బ్రహ్మ సాయుజ్యము (మోక్షము) ను బడయుగలుగుదుము.

దైవాసాక్షాత్కారము కూరగాయల బేరము వంటిది కాదు ఒక రూపాయి ఇచ్చి, ఒక కిలో వంకాయలను ఇమ్మనుటకాదు. అది మనము చేయు సాధనల యొక్క తీవ్రత పై ఆధారపడియుండును. భగవద్గీతలో చెప్పబడినట్టి స్థిత ప్రజ్ఞ లక్షణములన్నియును మనలో ప్రవేశించినప్పుడు మనకు జ్ఞానము కలుగును లేనిచో సాధనను కొనసాగింపవలసియేయుండును.

అవతారమూర్తియైన శ్రీ రామచంద్రుడు విశ్వామిత్రుని నుండి ధనుర్విద్య నభ్యసించెను. వసిష్ఠుల వారి నుండి జ్ఞానోపదేశమును పొందెను ఇక మనలాంటి వారికి గురువులు అవసరమని వేరుగా చెప్పవలయునా ? మీరు ద్విజులైనచో గాయత్రీ మంత్రమును జపించుడు. స్వధర్వే నిధనం శ్రేయః స్వేస్వేకర్మణ్యాభిరతః సంసిద్దింలభతేనరః తమ తమ వర్ణాశ్రమ ధర్మములను ఆచరించుట వలన అంతఃకరణ శుద్ధిని పొంది, జ్ఞాన నిష్ఠకు యోగ్యత కలుగును. మీరు ద్విజేతరులైనచో వెంటనే గురువులను ఆశ్రయించుడు.

**14.** మనము చేసిన కర్మఫలములను మనము అనుభవించు చున్నాము. దీనిలో ఈశ్వర ప్రేరణ యొక్క ఆవశ్యకత ఉన్నదా ? లేదా ? ఉండిన ఎట్లు ?

జ॥ యథాకర్మ యథాశ్రతమ్ ఎట్టి కర్మను చేయుదుమో, అట్టి ఫలితమునే అనుభవింతుము. సుఖస్య దుఃఖస్య నకోఽసి దాతా। పరోదదా తీతి కుబుద్ధిరేషా సుఖము, దుఃఖము పరుల నుండి ప్రాప్తించదు. పరుల నుండి బయటి విషయములనుండి సుఖ – దుఃఖములు కలుగుచున్నవి అనునది అవివేకము లేక మూఢత్వము. కాని మనము చేసిన కర్మలు మనకు తెలియవు. అవి ఈశ్వరునికే తెలియును. మనము చేసిన కర్మానుసారముగ ఈశ్వరుడు ఫలములను ఒసంగును. మాండవ్యమునికి చౌరకర్మ ఆరోపింప బడి, శూలారోపణము విధింపబడెను. పెద్దకార్ఖానా (Factories) లలో కూలీ మనుష్యులు పని చేయుదురు. వారిపై నున్న యజమాని వారి పనిని బట్టి వారికి జీతము నిచ్చును. అట్లే ఈశ్వరుని కూడా ఈ యజమానితో పోల్చవచ్చును.

**15.** తురీయావస్థకు చేరుకోవాలంటే మనస్సును ఆలోచనారహితము చేయాలంటారు. మరి గాఢనిద్రలో మనస్సు పనిచేయదుగదా ! అయినా తురీయావస్థను పొందలేరు. ఎందువలన ?

జ॥ సుషుప్తి (గాఢనిద్రలో) స్థూల శరీరము సూక్ష్మ శరీరము మఱియు అజ్ఞాన రూప కారణ శరీరము జడవస్తువులాగ క్రియా రహితమై పడియుండును. అచ్చట ఆత్మ చైతన్యము ఉండుటవలననే మనము నిద్ర యందలి ఆనందమును అనుభవించుచున్నాము. ఆత్మసత్, చిత్ ఆనంద రూపము, సత్ అనగా అస్తిత్వము చిత్ అనగా జ్ఞానస్వరూపము. ఆనందము విదితమే, గాఢనిద్రలో దీపము పై నున్న చిమ్నివలె అజ్ఞానపు పొర ఉండుట వలన బ్రహ్మాత్మైక్యము కలుగుట లేదు. ఆ పొర తొలగుటనే తురియావస్థకు చేరుకోవటమంటారు.

**16.** పునర్జన్మ లేకుండా మార్గమేమైనా ఉన్నదా ?

జ॥ అందులకు మనము వివేకముతో వాసనా క్షయ స్వరూపము పొందవలె. కనుకనే గీతాచార్యులు అనిత్యమ సుఖం లోక మిమం ప్రాప్య భజ స్వమామ్ అని నుడివిరి. భజ స్వమామ్ అనగా ఆత్మతో అభిన్నమైన పరమాత్మను సేవించుట. నిరంతరము ఆత్మాను సంధాన మొనర్చుట. అహంకార మమకారములను వదిలి ఎండుటాకు గాలితాకిడికి కదులునట్లు ప్రారబ్ధము ననుభవించుచు నిరంతరము ఆత్మచింతన చేయవలయును. హిరణ్యాగర్భ బ్రహ్మ నుండి క్రిమి కీటకాదుల వరకు అంతయు అనిత్యమే. శరీరమునకు సంబంధించిన ధన, పుత్ర బంధు దారాదులెట్లు నిత్యులగుదురు. ఈ విధముగా నిరంతరము చింతించుటయే వివేకమనబడును. అట్టి వివేకము ద్వారా పునర్జన్మను నివారించుకొనవచ్చును.

**17.** స్వామీజీ ! ముక్తి ఎలా కలుగుతుంది ? అవి సర్వజీవరాసులకు లభ్యము కాగలదా ?

జ॥ వేదవిహిత ధర్మానుసారము మనుష్యజన్మ పుణ్యాపాపముల మిశ్రమము వలన కలుగును. అత్యంత పుణ్యమువలన స్వర్గ ప్రాప్తి మిక్కిలి పాపమువలన నరకప్రాప్తియు మరియు జడప్రాప్తియు కలుగును. గీతోక్తి ప్రకారము క్షీణే పుణ్యేమర్త్యలోకం విశన్తి పుణ్యము నశించుట వలన మరల మనుష్య జన్మము కలుగును.

హిరణ్యా గర్భ పర్యంతరము సంసార గతియే. అనగా సృష్టికి ఆధిపత్యము వహిస్తున్న బ్రహ్మ మొదలు కొని యీ సృష్టిలోని జీవరాసులన్నింటికి జననమరణములు తప్పవు. ముక్తి లేక మోక్షము కేవలము మనుష్య జన్మలోనే సాధన చేసి సాధించుట కవకాశముంది, అటు దేవతలకు గాని ఇటు ఇతర జీవరాసులకు గాని సాధన చేయు నవకాశములు లేవు. అందువలన మనుష్య జన్మలోనే సాధన చేసి ముక్తి పొందుట అత్యవసరము.

**18.** స్వామీజీ ! మహా వాక్యము లంటారు. వివేక మంటుంటారు. అవి ఏమిటి ?

జ॥ స్థూల, సూక్ష్మ కారణ శరీరములని ఇవి మూడు విధములు. స్థూల, శరీరము తలగడ యొక్క గలీబు వంటిది. ఇది మారుతూ వుంటుంది. దీనినే గీతాచార్యులు పాత వస్త్రముతో పోల్చినారు. సూక్ష్మ శరీరము **19** తత్త్వములతో గూడినది. ఇందు పంచజ్ఞానేంద్రియములు పంచప్రాణములు పంచ కర్మేంద్రియములును మరియు మనోబుద్ధి, చిత్త, అహంకారములు గలవు. ఇది అపంచీకృత పంచమహాభూతములతో నిర్మింపబడినది. కావున సూక్ష్మ శరీరము కంటికి కనబడదు. ఈ సూక్ష్మ శరీరమే కారణ శరీరము (అజ్ఞాన రూపము) తో పాటు స్వర్గ నరకములను పొందుచుండును. కాని ఆత్మ ఈ మూడు శరీరముల కన్న అతీతమైనది, ఆత్మ సర్వవ్యాపి, దీనిచే వేదములు బ్రహ్మము అని ఉద్ఘోషించెను ఆత్మ పరమాత్మ ఐక్యమును చెప్పెడు వాక్యములనే మహా వాక్యములందురు. ఆత్మ శరీరమున కతీతమైనది. అని తెలుసుకొనే జ్ఞానమునే వివేకమంటారు. ఇది మోక్ష సాధనకు మొదటి సోపానము.

**19.** జన్మాద్యస్యయతః అను బ్రహ్మ సూత్రములలోని రెండవ సూత్రమును వివరించగలరు ?

జ॥ అస్య = ఈ ప్రపంచము యొక్క

జన్మాది = జన్మస్థితి లయములు

యతః = దేని నుండి కలుగునో (అదియే పరబ్రహ్మము)

మొదటి సూత్రమునందు మోక్షమునకై పరబ్రహ్మము యొక్క విచారము చేయవలెనని చెప్పబడినది. ఆ బ్రహ్మము యొక్క లక్షణము ఏది ? అని ప్రశ్నించగా బ్రహ్మము యొక్క తటస్థ లక్షణమును చెప్పు ఈ సూత్రమును వేదవ్యాసులు రచించిరి.

భావ పదార్థములకు ఆరు వికారములని యాస్కులు చెప్పిరి. అవి 1) ఉన్నది, 2)పుట్టుచున్నది 3) వృద్ధి చెందుచున్నది 4) పరిణమించు చున్నది, 5) క్షీణించుచున్నది 6) నశించుచున్నది కుండకు మట్టి ఉపాదాన కారణము. కుమ్మరి నిమిత్త కారణము. బ్రహ్మము ఈ ప్రపంచమునకు ఉపాదాన కారణము (వేద శబ్దములకు ప్రమాణాంతరములతో పని లేదు. కనుకను వేదము బ్రహ్మ స్వరూపము. ఈ శబ్దమే జగదుత్పత్తికి నిమిత్త కారణము)

బ్రహ్మము ప్రపంచ ఉత్పత్తికి ఉపాదాన కారణమని నిరూపించుటకై ఉత్పత్తి స్థితి లయములకు కారణమని చెప్పబడినది. పై చెప్పబడిన ఆరు వికారములు స్థితియందే జేరును, అన్నిటిని చెప్పుట నిరర్థకము అని మూడింటిని మాత్రమే చెప్పితిని.

సత్త్వ రజస్తమోగుణముల సామ్యావస్థలోనున్న ప్రధానమును సాంఖ్యవాదులు జగత్కారణమందురు. ఈ ప్రధానమును, జీవుని, పరమాణువులను జగత్కారణములుగా నిరాకరించుటకు కారణము ప్రధానము, పరమాణువులు అచేతనములు, జీవుడు అల్పజ్ఞుడు కనుకనే పరబ్రహ్మము జగత్కారణము. ఆ పరబ్రాహ్మము జీవుల స్థితి, గతులను చక్కగా నిర్వహించుచున్నాడు, కనుకనే అతడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు. ఇది కుండ, దీనిని ఇట్లు చేయవలెను అని తెలిసిన కుమ్మరి కుండను చేయగలడు. అట్లే జీవుల దేశ, కాల, స్థితి భేదములను తెలిసిన వాడు కనుకనే ఆ పరబ్రహ్మము సర్వజ్ఞుడు.

ప్రథమ సూత్రమున వేదాంత వాక్యములను విచారించెదమని ప్రతిజ్ఞ చేసినారు. ఈ సూత్రములో సృష్ట్యాదులకు కారణము ఈశ్వరుడు అని చెప్పి అనుమానవాదులపక్షము అవలంబించి ప్రతిజ్ఞాభంగము చేసినారు అనిన అదిసరికాదు. ఎందువలననగా యతో వాచోనివర్తంతే అప్రాప్యమనసాసహా సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అను వేదాంత వాక్యముచే విమర్శింపబడినది. ఆ వాక్యముల అర్థమును విమర్శించుటకు యత్ కార్యం తత్ స కర్తృకం యథా ఘటః (పుట్టిన పదార్థములన్నింటికి కర్త ఒకడు ఉండి తీరవలెను, ఎట్లనగా కుండ) అనుమానము శ్రుతి అర్థమును దృఢముగా నిశ్చయించుటకు అంగీకారము మాత్రమే. విచారించినను, విచారించకున్నను సర్వకాలములయందు ఏక రూపములో నున్నది. ఈ వేదాంత శాస్త్రము. అది నిత్య సిద్ధము, స్వతస్సిద్ధము.

బ్రహ్మము ఇంద్రియములకు కానరాదా ? అనిన పరాంచి ఖాని అను శ్రుతి ద్వారా ఇంద్రియములు బాహ్య విషయములను చూడగలవు అంతరాత్మను చూడలేవు. అంతరాత్మ అనుభవగమ్య విషయము. పరబ్రహ్మ ఇంద్రియ గోచరుడైనచో స్వతః సిద్ధమనుటకు వీలులేదు. కనుక ఈ సూత్రము వేదాంత వాక్యములనే విశదీకరించుచున్నది.

**20.** శాస్త్రయోనిత్వాత్ అను సూత్రమును వివరించగలరు ?

జ॥ క్రిందటి సూత్రములో బ్రహ్మము ప్రపంచమునకు కారణ మనియు, అది సర్వజ్ఞమనియు నిర్ణయింపబడినది. బ్రహ్మము మాత్రమే సర్వజ్ఞమనుటకు ఆధారము లేదు. అది ప్రపంచమునకు సృష్టికర్తయగుటకు వీలులేదు. అను సందేహమును నివారించుటకై ఈ సూత్రము చెప్పబడినది.

వేదములు నిత్యములు, కావున వేదములకు కర్తలేడు. ఆ బ్రాహ్మము వేదములకు కర్తకాకుండునేని, ప్రపంచమునకు కూడా కారణము కాజాలడు. కనుక బ్రహ్మము ఎట్లు నిర్వచింపబడును ? అను సందేహమును నివారించుటకు కూడా సూత్రము చెప్పబడినది.

నాలుగు వేదములు, వాటి అర్థమును ప్రకటించినట్టి ఇతిహాస, పురాణ, శిక్షా, వ్యాకరణాది విద్యలు, ఉపనిషత్తులు అనునవన్నియును సర్వజ్ఞుడగు ఆ పరమాత్ముని నిశ్వాసములే. నిట్టూర్పు విడిచినంత సులభముగా బ్రహ్మము వేదములను స్మరించును. ఈ వాక్యములను సూత్రకారుడు వివరించును.

సూత్రార్థము : శాస్త్రస్యయోనిః శాస్త్రయోనిః అనగా : శాస్త్రమును నిర్మించువాడు.

అస్యమహాతో భూతస్య అని శ్రుతులు వేదమును బ్రహ్మమే కల్పించెను. సర్వశాస్త్రములకు వేదమే ఆధారము. అట్టి వేదములను కల్పించినవాడు అల్పజ్ఞుడు బ్రహ్మవిదుషీమణులు, అవధూతమానినులు కాని సంన్యాసినులు కారు.

**23.** వేదాంతపరంగా హృదయము, మనస్సునకు స్థానమేది ? మనస్సునకు శరీరమునకు సంబంధమున్నదా ? మనిషికి బాహ్యమున గూడా మనస్సు ఉన్నదా ?

జ॥ హృదయము కేవలము మాంస పిండము. అది ఎడమ ఊపిరితిత్తిలో నున్నదని అందరికీ తెలిసినదే. బుద్ధి, చిత్త అహంకారములతో కూడిన మనస్సు రెండు ఊపిరితిత్తుల మధ్య భాగములో ఉన్నది. సర్వవ్యాప్తి అయిన ఆత్మ ఈ అంతఃకరణములలో ప్రతి బింబించుచున్నది. దానినే జీవాత్మ అందుము. అంగుష్ఠమాత్రః పురుషః అన్తరాత్మా అని శ్రుతి. దధ్యజ్ ఆథర్వణ ఋషి తన తలనటికి, గుఱ్ఱము తల అతకగా దానితో అశ్వినీకుమారులకు వేదాంతము ఉపదేశించెను. అందువల్లనే మనస్సు యొక్క స్థానము హృదయదేశమేనని స్పష్టమగుచున్నది.

శరీరములో మనస్సే ప్రధానము. కాని అది జడ వస్తువు. పూర్వ సంస్కారముల వలన మనోగతి విధులు సూత్రాత్మ నిర్ణయించును. ఆత్మచింతనవల్ల శరీరము ఉల్లాసముగను తేలికగను ఉండును. అపరిశుద్ధమనస్సు వల్ల, దుష్టచింతనవల్ల, చెడు కార్యములు చేయుటవల్ల జీవితమే దుర్భరముగా తోచును. ఇదియే మనస్సునకు శరీరమునకు గల సంబంధము.

ఆత్మ సర్వవ్యాపి, శరీరము లోపలను, బయటను ఆత్మ ఉన్నది అంతఃకరణ వృత్తి విషయాకారముగా మారును. దానిలో ఆత్మ చైతన్యము ప్రతి ఫలించును. ప్రతిబింబించిన వృత్తితో తాదాత్మ్యమును పొంది మనము అజ్ఞుల మనబడుచున్నాము. అంతఃకరణ వృత్తి విషయాకారమగును అనుటకు ఉదాహరణ చెఱువులోని నీరు కాలువద్వారా ప్రవహించి పొలము యొక్క భూమి ఆకారమును పొందును. అదే విధముగా లోపలనున్న చైతన్యము కంటి ద్వారా బయటకు వచ్చి విషయావిచ్ఛిన్న చైతన్యముతో ఏకీభవించును కాని విషయావిచ్ఛిన్న చైతన్యములో వస్తువును ఆరోపించి మనము చూచుచున్నాము. వృత్తి లోపలనే ఉన్నది. కాని లోపలనున్న మనస్సు విషయాకారమును పొందుచున్నది. ఈ సంస్కారముల వల్లనే మనము స్వప్నములను లోపలే చూచుచున్నాము. కనుక మనిషికి బాహ్యమున మనస్సులేదు.

**24.** జీవాత్మ పరమాత్మలకు గల భేదమేమి ?

జ॥ పరమార్థ సృష్టిలో జీవాత్మ పరమాత్మలకు భేదములేదు, దీనినే మహావాక్యములు చాటుచున్నవి. అవి అహంబ్రహ్మాస్మి ప్రజ్ఞానం బ్రహ్మ అయామాత్మాబ్రహ్మ తత్త్వమసి అది ఎట్లనిన కుండయందలి ఆకాశము, మఠమునందలి ఆకాశము. మహాకాశము ఒకటే అయినట్లు అజ్ఞానమువల్ల త్రాడు నందు పామును చూచురీతిగా అధిష్ఠాన ఆత్మ యందు భేదములను ఆరోపించి చూచుచున్నాము. విచారించి చూచిన మన శరీరముతో పాటు అన్ని వస్తువులు అనిత్యములే. కేవలము ఆత్మే నిత్య వస్తువు. అదే సాక్షిగా ఉండి

గాఢనిద్రావస్థలో ఆనందమును ఇచ్చుచున్నది. సుఖమహం అస్వాప్సం నకించిత్ అవే దిషం అంటాము. నేను సుఖ పూర్వకముగా నిద్రించితిని, నాకు ఏమీ తెలియలేదు అని దీనినే శ్రుతిలో అహర హర్ బ్రహ్మగమయతి సుషుప్తిలో జీవిని ప్రతిదినము బ్రహ్మముతో ఐక్యముగావించుచున్నది. ఇది ఎట్లనిన త్రాటితో కట్టి నీళ్ళతో నింపిన కుండను చెఱువులో ముంచినట్లు, కుండ, త్రాడువున్నంత వరకు నీళ్ళు ఒకటి కావు, కుండ ఈ శరీరము, త్రాడు కామ, క్రోధ, రాగద్వేషాదులకు ప్రతీకము. మన కోరికలచే, అహంకార మమకారముల వల్లను తాడు ద్వారా బయటకు లాగబడుకుండరీతిగా ఆ బ్రహ్మానంద సాగరమునుండి లాగబడి వ్యవహారిక దశలో వేరగుచున్నాము. ఏ విధమైన కోరికలు లేకుండా ప్రజహాతి యదాకామాన్ సర్వాన్ పార్ధ మనోగతాన్, ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థిత ప్రజ్ఞస్తదోచ్యతే అను రీతిగా ఉండుటయే జీవసమైక్యము.

**25.** వేదము అనగా నేమి ? వేదాన్ని త్రయి అని ఎందుకంటారు ?

జు॥ వేదము అనగా పవిత్రజ్ఞానము. ఇది హిందువుల ధర్మశాస్త్రము. (Scriptures of the Hindus)

**(బృ. ఉ. 2, 4.10)** అస్యమహతో భూతస్యనిఃశ్వసితమే తథ్ ఋగ్వేద వేదము నిత్యము పరమాత్మ యొక్క శ్వాసరూపము. ఈ ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము మరియు అథర్వణ వేదము, నిత్యుడు సర్వజ్ఞుడైన పరమాత్మ నుండి వెలువడినవి. వేదములు అ పౌరుషేయములు ( ఏ పురుషుని చేత ఉచ్చరించబడలేదు) అపౌరుషేయత్వమనగా సజాతీయ ఉచ్చారణ అపేక్ష లేకుండా ఉచ్చరింపబడినవి. పూర్వసర్గములో (సృష్టి) సిద్ధమైన వేదములను పరమేశ్వరుడు యథాతథముగా రచించెను. ఆ మంత్రములు ధ్యానస్థులు, బ్రహ్మజ్ఞానులు అయిన ఋషులు హృదయములో ప్రకటమయ్యెను, కనుకనే ఋషయోమంత్రద్రష్టారః అనిరి. మంత్రములను ఋషుల హృదయములో అనుభవపూర్వకముగా చూసిరి. కాని ఆ ఋషులు ఆ వేదమంత్రముల స్రష్టలు, కర్తలు కారు.

ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, ఈ మూడింటిని కలిపి వేదత్రయి అందురు, అథర్వణ వేదము వేదములలో తరువాత చేర్చబడినది. క్లిష్టమైన బ్రహ్మజ్ఞానమును బోధించు వేదములలో మనలాంటి అజ్ఞానులకు, అథమ శ్రేణి సాధకులకు ఆత్మజ్ఞానము తేలికగా అర్థమగుటకు అక్కడక్కడ కథల రూపములో చెప్పబడినది. ఉత్తమ సాధకులకు గురుముఖము ద్వారా మహావాక్య శ్రవణమే చాలును.

## 4. కర్మ సంబంధమైన ప్రశ్నలు – జవాబులు

**1.** మృతాశౌచము ఏ సంబంధమైనది ? ఎందుకు పాటించవలెను ? దీని వలన ఎవరికి మేలు ?

జ॥ ప్రమితౌ పితరౌయస్య దేహస్తస్య అశుచిర్ భవేత్ ।

న దైవం నాపివా పిత్ర్యం యావత్ పూర్ణోనవత్సరః ॥

ఎవని తల్లిదండ్రులు మరణించిరో వాని దేహము అశుద్ధి పొందుచున్నది. అందువలన ఒక సంవత్సరము దేవకర్మలు చేయగూడదు. తీర్థ యాత్రలు, వ్రతములు, ఉపవాసమ్ము ఏడాది పాటు చేయరు బుద్ధిమంతులు – శౌచము బ్రతికివున్నవారి శరీర సంబంధమైనది. పోయినవారు సంవత్సరము తరువాత ప్రేత శరీరము వదలి భోగశరీరము (పితృకమును) పొందెదరు. శాస్త్ర విధానము కనుక పాటించవలెను. పోయినవారి సద్గతికి మొదటి పది దినములు దేవాలయ దర్శనము, మూర్తిపూజ, నివేదన, హారతి వర్జితము, తరువాత సంధ్యోపాసన, పూజ, పంచ మహాయజ్ఞములను ఆచరించవచ్చును. కాని ఏడాది పాటు తీర్థయాత్ర వివాహాదులు చేయగూడదు. మొదటి పది రోజులు గూడ జపము (మానసికముగా) పారాయణము చేయవచ్చును. జాత శౌచము కేవలము పదిరోజులు. అందు సంధ్యా, దేవతార్చనము మొదలైనవి వర్జితము. కాని మానస మంత్రజపము చేయవచ్చును. (For Further Details Refer Dharma Sindhu) మిగతా వివరములకు ధర్మసింధులో (లేక నిర్ణయ సింధులో ) గాని చూడవచ్చును.

**2.** శ్రాద్ధ కర్మలు చేయుటవలన పితరులు పాపవిముక్తులు అగుదురా ? గ్రహముల ఫలములు సత్యములా ?

జ॥ శ్రాద్ధకర్మలచే పితరులకు అన్న పానములచే తృప్తి కలుగును కాని పాపవిముక్తులు అవరు. క్షీణే పుణ్యేమర్త్య లోకంవిశంతి వారు చేసిన పాపపుణ్యములు వారికే. ఋతే జ్ఞానాన్నముక్తిః జ్ఞానము కలుగకుండా పాపము నుండి ముక్తి కలుగదు. గ్రహముల ఫలములు సత్యములే.

**3.** ఈ జన్మయందు చేయు క్రియలను ఫలితములు మరొక జన్మలో లభించునా ?

జ॥ జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణమ్ జ్ఞానమనగా ఆత్మ పరమాత్మ ఐక్యానుభూతి, అది సంచితకర్మలను, ఆగామి (రాబోవు) కర్మలను నశింపజేయును. నిష్కామబుద్ధితో కర్మలను చేసినచో (ఫలములను ఆశింపకున్నచో) అది అంతఃకరణ శుద్ధికి తోడ్పడును. శుద్ధమైన అంతఃకరణము నందు వివేక వైరాగ్యములు ఉత్పన్నమగును. సాధారణ జనులు తాము చేయు కర్మలయొక్క ఫలితములను ముందు జన్మలలో పొందుదురు. వారు చేసిన మంచి కర్మల ఫలితముగా స్వర్గమును పొంది మరల మనుష్య జన్మను పొందుదురు. చెడ్డ కర్మలను చేసినచో నరకము ననుభవించి సూకర, కుక్కుర, క్రిమి కీటకాదుల జన్మనెత్తెదరు. పాపముగాని,పుణ్యముగాని అత్యంత ఉత్కటమైన కర్మ **3** సంవత్సరములలో, **3** మాసములలో, లేక **3** దినములలోనే ఫలీభూత మగును.

**4.** ఒకే యజ్ఞోపవీతము నందు బ్రహ్మచారికి మూడు పోగులు (వరుసలు) ఏలయుండును ?

జ॥ బ్రహ్మచర్యేణ ఋషిభ్యో, యజ్ఞేనదేవేభ్యః, ప్రజయా పితృభ్యః, వటువు బ్రహ్మచర్య పూర్వకముగా వేదాధ్యయనము చేయుట వలన ఋషి ఋణము తొలగును. అందుకు రెండవవరుస, పుత్ర సంతానోత్పత్తి ద్వారా పితృ ఋణము తొలగును. అందుకు మూడవ వరుస. యజ్ఞోపవీతము యొక్క 3 వరుసలు ఋషి, దేవ , పితృ ఋణములను సూచించును, వివాహమైన తర్వాత 6 వరుసలుండును. తనవి 3, పత్నివి 3 చేరి ఆరు పోగులుండును.

5. అగ్ని హోత్రమును ఏల చేయుదురు ? మూర్తి పూజ వేద విరుద్ధమా ? పూజలో శంఖము నెందుకు ఉపయోగింతురు?

జ॥ వేదముల యొక్క మొదటి మూడు పాదములలో బ్రాహ్మణ, క్షత్రియ వర్ణముల ననుసరించి కర్మకాండము వివరింపబడినది. బ్రహ్మచర్య, గృహస్థ, వాన ప్రస్థ, సన్న్యాస ఆశ్రమముల ననుసరించి కర్మలు విధింపబడినవి. మన ఇంద్రియములకు (జ్ఞానేంద్రియములు + కర్మేంద్రియములు + మనస్సు) అధిష్ఠాన దేవతలు కలరు. వారు యజ్ఞ యాగాది కర్మల చేతనే తృప్తినొందుదురు. యజ్ఞ యాగాదులకు మూలము అగ్నిహోత్రము. దధ్నా ఇంద్రియ కామో జుహుయాత్ ఇంద్రియ సౌష్ఠవము నాశించిన వారు పెరుగుతో హోమము చేయవలయునని శ్రుతి నుడువుచున్నది. మీరు ఒక ఎండు మిరపకాయ తినినచో మీ నోరు మండును. ఆ ఎండు మిరపకాయను అగ్నిలో వేసినచో చుట్టు ప్రక్కనున్న అందరి ముక్కులు మండును. అదే విధముగా అగ్నిలో వేసినట్టి కొంచెము హవిష్ పదార్థమైనను ఎక్కువ ఫలము నిచ్చును.

మూర్తి పూజ వేద సమ్మతమే. కనుకనే పూజ సలుపువారు శుచిగా శుభ్రముగా నుండవలయును, మైల, అశుచి, స్త్రీల నెలసరి దినములలో పూజలు సలుపరాదు. పూజా సమయములో పంచ మహాభూతములలోని జలాంశముగా పరమేశ్వరుని భావించుటకై శంఖమును ఉపయోగింతురు. శంఖము నుండి ప్రణవధ్వని వచ్చును. అది పరమాత్మునికి ప్రతీకము. శంఖ ధ్వని మంగళకరము. కావున అది భూత – ప్రేత పిశాచాదులను పారద్రోలుటకు శక్తివంతమై యున్నది.

6. మాంసము తింటే తప్పా ?

జ॥ ఆధ్యాత్మిక సాధనలో అభివృద్ధిని కోరునట్టి సాధారణ సాధకులకు మాంసభక్షణము చేయుట మంచిది కాదు. పూర్వమీమాంస శాస్త్రములో తత్రచ అన్యత్రచ ప్రాప్తేపరి సంఖ్యా ఇతిగీయతే అని చెప్పబడినది ప్రస్తుత ప్రసంగములోను, ఇతర స్థలములోను ప్రాప్తించిన దానిని పరిసంఖ్యా అందురు. దీనికి ఉదాహరణ పంచపంచనఖాభక్ష్యాః అని మాంసము తినువారికి ఆ అలవాటును తప్పించుటకై చెప్పబడినది. మాంసము తినువారికి నీవు తినవద్దు అనిన మానరు. కనుక ఐదు గోళ్ళు గల ఐదు జంతువులను మాత్రమే తినుటకు వేదము అంగీకరించినది, అలవాటు కలవారు ఈ జంతువులను వెదకి వెదకి తీసుకొనివచ్చి వండి తినెదరు. కాని వీటిని వెదకుటలో గల పరిశ్రమకు ఓర్చుకొనలేక చివరికి ఆ అలవాటును వదలి వేయుదురు.

ఒక శిష్యుడు మాంసమును తినుచుండెను. గురువుగారికి ఆ మాటను ఎవరో ఒకరు చెప్పిరి. అప్పుడు గురువుగారు శిష్యునికి నీవు మాంసమును తినవచ్చును, కాని చెవుల పొడుగు ఎక్కువగల మేక మాంసమునే తినుము అనిరి. శిష్యుడు సంతోషించెను. కాని కొద్ది రోజులలోనే అతడు మాంసము తినుటను విడిచి పెట్టెను. ఏలననగా చెవులు పొడుగు ఎక్కువగల మేకలు అతి కష్టముగా లభించును, మాహింస్యాత్ సర్వభూతాని ప్రాణులను హింసింపరాదు. బంగాళదుంప, వడ్లు మొదలగువాటిని నాటినచో మొలక వచ్చును. అందులోను ప్రాణము కలదు. అది హింసకాదా ? అనినచో ప్రాణ పోషణకై అత్యావశ్యకములుగా భగవంతుడే వాటిని సృష్టించెను. కనుక శాకాహారములను తినుటలో తప్పులేదు. అదియున్నూకాక ఉదరము లోని సగము భాగమునే నింపుటకు శాస్త్రము చెప్పుచున్నది. మనుష్యులకు పులి, సింహము, కుక్క మొదలగు జంతువులవలె కోరలు (కోరదంతములు) లేవు. కాబట్టి, దేవుని సృష్టి ననుసరించి చూచినను మానవుడు మాంసభక్షణకు అర్హుడు కాడు. మాంసభక్షణము రాజసిక గుణమును పెంచును. (శుద్ధ సత్త్వము జ్ఞానమునకు సోపానము) క్షత్రియులు, రాజ్య సంరక్షకులగు సైనికులు మాంసమును తినుటలో తప్పులేదు, శత్రువులను పరాజయ మొనర్చుటకు రాజసిక గుణము అత్యావశ్యకము.

7. పునర్జన్మ అనేది వుందంటారా ?

జ॥ జాగ్రదవస్థయందు అహం సుఖం అస్వాప్సమ్ న కించిత్ అవేదిషమ్ ఇచ్చట సుఖముగా నిద్రించితిని ఏమియు తెలియలేదు అని అర్థము, ఏమియు తెలియలేదు అనునది అజ్ఞాన అనుభవము. సుఖముగా నిద్రించితిని అనునది చైతన్యము యొక్క అనుభవము, ఇదియే ఆత్మయని గ్రహించవలెను. నిర్మించిన కుండయందు ఆకాశము ఉన్నట్లు శరీరము జన్మించిన దాని యొక్క అంతఃకరణములో సర్వవ్యాపియగు ఆత్మ ప్రతిబింబించును. ఆత్మయందు శరీరము నారోపించినప్పుడు సర్వవ్యవహారములు కలుగును, నిరవయవమై వ్యాప్తమైయున్న ఆకాశమునందు నీలిరంగు కడాయి ఆకారము ఆరోపింపబడునట్లు, నిత్య నిరవయవ అసంగ ఆత్మయందు, శరీరమును ఆరోపించుటయే అజ్ఞానము. నిద్రలో ఆనందమగ్నమైన జీవి ఇచ్చవలన మరల సంసారమునందు ప్రవర్తించును. నీటిలో మునిగిన కుండ త్రాటిచే బయటకు వచ్చునట్లు. జీవి ఇచ్ఛయను త్రాటిచే లాగబడి మరల మరల జన్మించును. అదియే పునర్జన్మ.

# ఆధ్యాత్మిక ప్రశ్నోత్తరి

శ్రీ మేధానందపురి జీ

## 5. సాధనపరమైన ప్రశ్నలు – జవాబులు

**1.** మానవుడు కామ, క్రోధముల నుండి ముక్తి నొందుటకు పాటించవలసిన నియమము లేవి ?

జ॥ విషయ వస్తువులను గురించి చింతనను వదలవలయును. దీని వలన సంగము. కామము కలుగును, ఆ వస్తువును గ్రహించుటలో బాధ కలిగించినవారిపై కోపము వచ్చును. కనుక విషయ చింతనను ఎంత తగ్గించుకొనిన అంత మంచిది. ఇచ్ఛను నాలుగు భాగములుగా విభజింప వచ్చును. అవియే వాసన, స్పృహ (ఆవశ్యకత), కామన, తృష్ణ – వాసన రూపమునందున్నవి మనకు తెలియవు. కావున ఆవశ్యకతలను తగ్గించు కొనుట మంచిది. లేనిచో అవి తృష్ణారూపమును దాల్చి మనిషిని పిచ్చి వానిగా చేయును.

రజోగుణమునుండి కామ, క్రోధ లోభములును కలుగును. కనుక సాత్త్వికాహారమును గ్రహించుచు. శుద్ధచింతనము పెంచినయెడల ఈ దోషములు దూరమగును. నిరంతర పరమాత్మ చింతనయే శుద్ధ చింతన. భగవంతునియందు మనస్సు ఎంత లీనమగునో , అంత సంసారదోషముల నుండి మనము దూరమగుదుము.

దుఃఖ దోషాను దర్శనమ్ జన్మమునందు, మృత్యువునందు వృద్ధాప్యమునందు, రోగమునందు దుఃఖములను, దోషములను చూడవలయును ఇవన్నియు శరీరసంబంధమైనవి. కనుకనే అనిత్యము సుఖం లోకమిమం ప్రాప్య భజస్వమామ్ అని శ్రీ కృష్ణ పరమాత్మ పలికెను. లోకమనగా చరాచర జగత్తు, సామాన్యముగా జనులు దోషవస్తువులను గ్రహింపరు కదా ! ఈ విధమైన వివేకము శరీర ధ్యానము తగ్గించి కామ – క్రోధ – లోభములు తగ్గుటకు సహకరించును.

మహాత్ముల సాంగత్యము చేసి, ఇతరుల సుఖ దుఃఖములను తనవిగా భావించి సేవ చేయుటవలన మనలోని దోషములు దూరమగును.

పాము ఇంటిలోనికి వచ్చినచో దానంతటదే ఇల్లు వదలిపోవును. అనగా పాము ఇల్లు కాదు. ఇల్లు పాముది కాదు. అట్లే ఈ కామ క్రోధాదులు శరీరానికి సంబంధించినవి కావు. శరీరము కామ క్రోధాదులకు సంబంధించినదికాదు. అనగా వానిననుసరించి మనము ప్రవృత్తులము కారాదు.

కామ క్రోధాదులు వచ్చినవని తెలియగానే చన్నీళ్ళతో స్నానము చేసి, మంత్రజపమును చేయుచుండినచో అవి పలాయనము చిత్తగించును.

**2.** గురూపదేశమంటే ఏమిటి ?

జ॥ అజ్ఞానమును తొలగించి ఆత్మజ్ఞానమునకు సహకరించు బోధ గురూపదేశము. పూర్వములో గురుశుశ్రూష చేయచూ వారి ద్వారా ఉపదేశము పొంది. జ్ఞానమును పొందెడివారు. ఈ కాలంలో ఆ రీతిగా

ఉపదేశము అసంభవము. ఈ కాలము వారికి శరీర ధ్యాసము ఎక్కువ. కనుకనే సామాన్యముగా గురువులు సాకార సగుణ బ్రహ్మనామమును మంత్ర రూపముగా ఉపదేశించుచున్నారు. దీర్ఘకాల నిరంతర మంత్ర జపముచే మనఃశుద్ధి వివేక వైరాగ్యములు జ్ఞానము క్రమముగా కలుగుచున్నవి. కనుక సంక్షేపముగా ఈ మంత్ర దీక్షనే గురూపదేశమంటున్నారు.

**3.** ఉపాసన ఎన్ని విధములు ? వాటిని వివరించగలరు?

జ॥ **1)** కర్మాంగ ఉపాసన : ఛాందోగ్యోపనిషత్తులోని ఉద్గీథోపాసన కర్మాంగోపాసన యనబడును. ఇది కర్మ సమృద్ధికి తోడ్పడును.

**2)** అభ్యుదయ ఫలక ఉపాసన, లేక సంపత్ ఉపాసన, లేక ప్రత్యేక ఉపాసన. ఉదాహరణ: మధువిద్య, ప్రాణోపాసన, సూర్యోపాసన మొదలగునవి. ఇవి ఐశ్వర్యమును, సాలోక్య – సామీప్య ముక్తులను ఇచ్చును.

**3)** కైవల్యసన్ని కృష్ణోపాసన లేక ఆహంగ్రహోపాసన. ఇదియే అంతరికోపాసన యని చెప్పబడును ఉదాహరణ : ప్రణవజపము. మహా వాక్య చింతన. ప్రత్యేక ఉపాసనలలో పంచాగ్ని విద్య గృహస్థులకు చెప్పబడినది. దాని ద్వారా వారు బ్రహ్మలోకమును పొందుదురు. ఇది క్రమముక్తి యనబడును.

ఈ కాలములో జరుగుచున్న మూర్తి పూజలు (శివ పరివారము సూర్య పరివారము మున్నగునవి). పంచాయతన పూజలు తాంత్రికములు, అవైదికములు, అనగా :– వేదములలో వీటిని గూర్చి చెప్పబడలేదు.

**4.** సామాన్య మానవుడు మోక్షము నొందుటకై ఏమేమి ఏ విధముగా అనుష్ఠింపవలయును ? నేను ఇక్కడ ఏమి చేయవలయును ?

జ॥ గీతలో చెప్పబడిన **26** గుణములను అనుష్ఠించినచో చాల మంచిది – (**16** వ అధ్యాయములో **1** నుండి **4** వ శ్లోకము వరకు)

సత్యపరిపాలన, భగవచ్చింతనవలన మోక్షము కలుగును. ఆ భగవంతుడు సచ్చిదానంత స్వరూపుడని చెప్పబడును. సత్ అనగా త్రికాలా బాధ్యము. కనుక మనసా, వాచా కర్మణా సత్య పరిపాలన చేయుటచే ఆ సత్య వస్తువే పొందబడును. ఏకాగ్రతకై చింతన అవసరము. మొదట అది సాకార సగుణముగానున్నను దదామి బుద్ధి యోగంతం యేస మాముప యాంతితే అన్నట్లు ఆ పరమాత్మయే మనకు అద్వైత సాధనకు దోహదకారియగు బుద్ధి నొసంగును. కర్మఫలత్యాగము అవసరము. నేను కర్త ననెడి అభిమానమే మహాపాపము. కర్తృత్వాభిమానమును త్యజించుటయే మహాపుణ్యము, సత్యము, భగవచ్చింతన, కర్మఫలత్యాగము సేవ, దానములను అభ్యసించుటయే మన అనుష్ఠానమై యుండవలయును.

**5.** యద్దృశ్యంతన్నశ్యం అన్నప్పుడు నశించునట్టి పదార్థముల నుండి చెడ్డ ఆలోచనలు ఎందుకు కలుగును ? మమైవాంశోజీవలోకే అనగా మనము ఆ పరమాత్మ స్వరూపులమే కదా ! మరి సాధన ఎందులకు ?

జ॥ మనము చూచుచున్న ప్రతి వస్తువునకు ఒక ఆధారము అధిష్ఠానము కలదు. అదే చైతన్యము, అదే ఆత్మ, అదే పరమాత్మయని చెప్పబడును. గాఢ నిద్రలో ఆ చైతన్యమే సుఖమును అనుభవించుచున్నది, సుషుప్తిలో ఇంద్రియములు, మనస్సు బుద్ధిపనిచేయుట లేదు. కాని సుఖము యొక్క అనుభవము కలుగుచున్నది. అది చైతన్యము వల్లనే జరుగుచున్నది. ఆ అధిష్ఠానముచే ఎల్లప్పుడు చూచుచుందుమేని, దానితో మనము ఏకీభవించి, మంచి చెడ్డలకు అతీతులమగుదుము. మనము మనోవాక్కాయ కర్మలతో తాదాత్మ్యమును పొందుటచే మంచి, చెడుగుల తారతమ్యములను అనుభవించుచున్నాము. ఈ శరీర తదాత్మ్యతయే అధ్యాస యనబడును. అతస్మిన్ తద్బుద్ధి యే అధ్యాస (Superior Position) తొలగినచో జ్ఞానము కలుగును. నేను, నాది (అహం మమ) అనునదే అజ్ఞానము, అధ్యాసమనుబడును. దీనిని తొలగించుటకే సాధన చేయవలసి యుండును. ఈ స్థూల, సూక్ష్మ కారణ శరీరములకు అతీతమైయున్న చైతన్యమే ఆ పరమాత్మ స్వరూపము (మమైవాంశో) కావున శరీరమునకు అతీతులమై, ఆత్మనిష్ఠులమైయున్న సమయమునందు ప్రయత్నము, సాధన నిరర్థకములే యగును.

**6.** నీవు ఎంత ప్రయత్నము చేసినను పనికానేరదు. ఎంత వద్దనుకున్నను, అయ్యేపని కాకమానదు. అని భగవాన్ రమణ మహర్షులు అనిరి. ఇక పురుష ప్రయత్నమునకు అర్థమేమి ? సాధకునికి నిరాశ కలుగదా ?

జ॥ సమష్టి సూక్ష్మ శరీరాభిమానియగు సర్వవ్యాపకుడు ప్రతి ప్రాణి శరీరములోను ఉండి, వారి వారి కర్మల ననుసరించి ఫలముల నొసంగును. మనవాళ్ళు పెట్టిపుట్టరా ! అంటారు. అంటే మనము క్రితం జన్మలో ఎవరికి ఏమి ఇచ్చితిమో, అదే మనము తిరిగి మనకు తిరిగి లభించును, మనము ఇది వరలో చేయక ఇప్పుడు దాని ఫలమును ఆశించినచో అది మనకు లభింపదు. దీనినే రమణ మహర్షులు కాని పని కానేకాదు అనిరి. మానవుడు పూర్వ జన్మలో చేసియుండినచో దాని ఫలమును ఆశింపకున్నను అదితప్పక లభించును. దానినే రమణ మహర్షులు అయ్యేపని కాక మానదు అనిరి పూర్వజన్మలో దానము చేయనివారికి ఈ జన్మలో ఎంత ప్రయత్నించినను డబ్బు ఎద్దడి ఉండియే తీరును. ఎవరు దానములు చేసిరో వారికి వద్దంటే డబ్బు దొరుకును. దీనినే పెద్దలు ప్రారబ్ధమందురు.

మనిషికి మాత్రమే వివేకము కలదు. మిగిలిన ప్రాణులకు లేదు. వివేకమును ఉపయోగించి, మంచి కార్యములను చేయవలయును, నిరాశ చెందరాదు. ప్రయత్నములేనిచో శాస్త్రోపదేశములు వ్యర్థములగును కదా ! విషము కలిపిన భోజనము ప్రాప్తించినచో, తెలిసియుండిన ఏ మనిషి దానిని తిని మరణించడు. అట్లే విషయవాసనలు, భోగపదార్థములు విషయుక్తమైన వని తెలిసియుండియు వాటిని తగ్గించుకొనుటకు ప్రయత్నము చేయనివాడు మూర్ఖుడు ! ముక్తి మిచ్ఛసి చేత్తాత ! విషయాన్ విషవత్త్యజ నాయనా ! పరమానంద సుఖము కావలయునన్నచో విషయ భోగములను విషతుల్యముగా భావించి త్యజించుము, అనిత్యమ సుఖం లోకమిమం ప్రాప్య భజస్వమామ్ అనిత్యము, సుఖహీనమై ఈ లోకమును పొంది నన్ను

ఆత్మ స్వరూపముగా భావించి భజింపుము. శ్రేయాంసి బహు విఘ్నాని మంచి కార్యములకు విఘ్నబాహుళ్యములు ఉండును. ఐనను ప్రయత్నము వీడరాదు.

సాధనలు చేయువారికి దైవబలము అనుకూలించును. మనస్ఫూర్తిగా దేవుని నమ్మి సాధన చేయు భక్తునకు ప్రారబ్ధవశముచే గొడ్డలివ్రేటు కుంగవలసిన స్థానములో ముల్లు గ్రుచ్చుకొని, లేక చిన్న దెబ్బమాత్రము తగిలి ఆ ప్రారబ్ధము నశించును.

7. మనస్సు దుష్ట (చెడ్డ) చింతనలను ఎందుకు చేయును ? ఎల్లప్పుడు మంచి ఆలోచనలే ఎందుకు రావు ?

జ॥ పురాణములు వర్ణించినట్లు ప్రతి మానవునికి అనేకములైన పూర్వజన్మ వాసనలు కలవు. ఇవన్నియును అజాగ్రత (Sub-Conscious mind)`1 మనస్సునందున్నవి. ఎన్ని వాసనలు కలవు ? ఎటువంటి వాసనలు కలవు ? అను విషయము సాధారణ జీవులకు తెలియవు. కాని సర్వాంతర్యామియు, మనఃసాక్షియునగు ఆ పరమాత్మునికి అన్నియు తెలియును. నిష్కామ కర్మయోగాము నొనర్చి. అంతఃకరణమును శుద్ధమొనర్చుకొని, సాధనలు చేసి జ్ఞానము పొందినవారు మనోగతిని ఎఱుగుదురు. కాని సాధారణజీవి సాధనలు చేయుచున్నను పరాకాష్ఠను పొందజాలడు. కనుక మనోగతిని తెలిసికొనజాలకుండును. మనోబుద్ధి చిత్తాహంకరాములను అంతఃకరణమని అందురు. ఇది జడము ఇందు చైతన్యము ప్రతిబింబించినప్పుడది శరీరోపాధి చేష్టలకు లోనగును, మనస్సు స్వతంత్రముకాదు. దీని వెనుక పరమాత్మశక్తి ఉండి దీనిని ప్రేరేపించుచున్నది. సాధకుని మనస్సు తమ స్వాధీనములో ఉండదు. ఇది పరమాత్మ ప్రేరకము. పూర్వజన్మ వాసనల నిమిత్తమై దీనికి ఉనికి యున్నది. మనస్సు దుష్ట ఆలోచనలను చేయుటలో అస్వాతంత్ర్యము కనుకనే దుర్యోధనుడు ఈ విధముగా నుడివెను. జానామి ధర్మం న చ మే ప్రవృత్తిః, జానామ్య ధర్మం న చమే నివృత్తిః అనగా నాకు ధర్మమేదియో తెలియును. కాని దానిని ఆచరించుటకు నా మనస్సు పోవుటలేదు. నాకు అధర్మమేమిటో తెలియును, కాని దాని నుండి నివృత్తుడను కాజాలకున్నాను.

8. విషయవిరక్తి కలుగనంతవరకు ఎంత ధ్యానించినను, ప్రార్థించినను బ్రహ్మైత్మైక్య (బ్రహ్మ + ఆత్మ + ఐక్య) జ్ఞానము కలుగదు. కనుక సాధకు డేమి చేయవలయును ?

జ॥ పుత్ర, విత్త, లోకైషణల త్యాగమే వైరాగ్యము, ఇది ఒక శస్త్రము వంటిది. మరల మరల వివేక శమదమాదుల నభ్యసించుటవలన ఈ శస్త్రము నిశితమగును. అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణచ గృహ్యతే అని శ్రీ గీతాచార్యులు నుడివిరి. అభ్యాసము తీవ్రమైన కొలది వైరాగ్యము హెచ్చును. పూర్ణ వైరాగ్యము కలుగునంతవరకు అభ్యాసము చేయవలసినదే. పూర్ణవైరాగ్యము కలిగిన వారికి విషయ వాసనలే ఉండవు. మరొక మాట, ఎవరికి శుద్ధ సత్త్వగుణము లభించునో, వారు కేవలము ఈశ్వరుని గురించియే చింతించెదరు.

ఆహార శుద్ధౌ సత్త్వశుద్ధిః సత్త్వ శుద్ధౌ ధ్రువాస్మృతిః
స్మృతిలంబే సర్వ గ్రంథీనాం వి ప్రమోక్షః ॥ (ఛా. 7.26.2)

భోగ్య విషయములను జ్ఞానేంద్రియముల ద్వారా (ఆహ్రియతే ఇతి ఆహారః) గ్రహించుటయే ఆహారము. కావున మనము గ్రహించు విషయములన్నియును ఆధ్యాత్మికముగ ఉన్నతికి తోడ్పడునవిగనే ఉండవలెను. ఆహారము శుద్ధమైయున్నచో ఎడతెరిపిలేని స్మరణశక్తి (అవిచ్ఛిన్నస్మృతి) కలుగును. దీని వలన అవిద్య ద్వారా కల్పింపబడిన అనర్ధరూపములైన రాగ ద్వేషములనెడి హృదయ పాశములు (గ్రంథులు) నశించును. ఈ విధముగా సత్త్వశుద్ధి కలిగినవానికి లౌకిక విషయములు రుచింపవు. కామనా శూన్యుడై కర్మల నాచరించినను శుద్ధ సత్యము లభించును.

కామనా శూన్యమునకు అర్ధము సంపూర్ణ నిరహంకారత. దీనికి ఉదాహరణము ఒక సాధకుడు అనేక విధములైన పరోపకారములగు కార్యముల చేసి, దేహము చాలించి, ఊర్ధ్వలోకములకు పోయెను. అచ్చట ఈశ్వరునిచే ప్రశ్నింపబడగా నేను ఇంత వరకు అనేకములైన పాఠశాలలు, సత్రములు, చికిత్సాలయములను నిర్మించితి ననెను. భూలోకములో నీవు ఏమి చేసితివి ? అనుదానికి ఉత్తరమిది, అప్పుడు ఈశ్వరుడు నీకుమోక్షము లేదు. మరల భూలోకమునకు పోయి, కార్యరతుడవై యుండు మనెను. ఈ సామాన్య జీవుడు జగత్తునకు ఏమి ఉపకారము చేయగలడు? కారణ జన్ములు, నిత్యముక్తులు మాత్రమే పరోపకారము చేయుటకు సమర్థులు సామాన్యులు సంపూర్ణముగా అహంకారమును వీడి నిమిత్తమాత్రం భవసవ్యసాచిన్ అను గీతోక్తికి లోబడి కర్మలను ఆచరింపవలెను.

వైరాగ్యము, శుద్ధ సత్త్వము నిరహంకారము కలిగినచో బ్రహ్మాత్మైక్య జ్ఞానము త్వరగా లభించును. ఈ గుణములు లేవని, విషయవాసనలు తగ్గలేదని సాధన చేయకుండుట సరికాదు. ఎట్లనగా కెరటములు తగ్గినచో, సముద్రస్నానము కాదు. అలలను ఎదుర్కొని స్నానము చేయునట్లు వాసనలతో పోరాడుచు, సాధన చేయవలయును. సాధనను మెల్లమెల్లగాను, అధికము చేయవలయును. తూర్పునకు పోవువానికి పడమర దూరముగునట్లు సాధన చేయువారికి విషయ వాసనలు తగ్గును. కావుననే గీతలో ఉద్ధరే దాత్మ నాత్మానమ్ అని చెప్పబడినది.

**9.** ప్రకృతింయాంతి భూతాని నిగ్రహః కింకరిష్యతి అని గీతాచార్యులు నుడివిరి. ప్రకృతి ననుసరించి జీవించువానికి సాధన ఎట్లు ఉపయోగపడును ?

జ॥ ఇచ్చట ప్రకృతి యను శబ్దమునకు పూర్వజన్మల నుండి వచ్చు వాసనలు అని అర్థము, జ్ఞానియైనను తన ప్రకృతికి లోబడియే ప్రవర్తించును, జ్ఞాని కూడా తన కిష్టమైన ఆహారమునే భుజించును. తన కిష్టమైన వారి తోనే సాంగత్యము చేయును. ఇట్టి పరిస్థితులలో సాధకులు, మానవులు, అజ్ఞానులు తమ తమ వాసనలచే ప్రేరితులై కర్మలను ఆచరించుచుందురు. అనుటలో ఆశ్చర్యములేదు. భజన, పూజ,ధ్యానము, సేవ వీటన్నింటిని తమ తమ ప్రకృతి ననుసరించియే చేయుదురు. కనుక మోక్షేచ్ఛ కలవారు ప్రకృతికిలోనై కర్మలను ఆచరించినచో రాగ ద్వేషములకు లోనై వాడు బంధనములో పడు అవకాశము కలదు, రాగ ద్వేషములతో

కూడిన పైనను కర్మలను ఈశ్వరార్పణ బుద్ధితో చేసినచో, ఆ ఫలితములచే బంధింపబడక అతడు మోక్షమును పొందును. ఈశ్వరార్పణ బుద్ధితో చేయు సాధనయే సాధన, మిగిలినదంతయు వ్యర్థమే.

ఒక భక్తుడు ఈశ్వరార్పణ బుద్ధితో కర్మల నాచరించెదనని సంకల్పించెను. అట్లే చేయుచుండెను కూడా. ఒక రోజు వాహనారూఢుడై చాలకునకు మార్గదర్శనము చేయుచు వచ్చెను ( ఈ త్రోవలో నడుపుము, ఆ త్రోవ మంచిది కాదు అనుచు) కొంచెము దూరము పోయిన తర్వాత వాహనము తలక్రిందులై భక్తునికి గాయములు తగిలెను. అప్పుడు భక్తునికి గాయములు తగులుటకు కారణము తన అహంకారమేననియు, ఈశ్వరుని త్రోవలో తన అహము అడ్డువచ్చినందులకు తగిన ఫలము లభించెననియును తలంచెను, ఈశ్వరునికై కర్మలను ఆచరించువాడు నిషిద్ధములగు పాప కర్మలను ఆచరింపజాలడు.

**10.** కర్మోపాసన అనగా నేమి ? కర్మోపాసనకు జ్ఞానమునకు ఏమైనా సంబంధమున్నదా ?

జ॥ వేద విహితమైన కర్మలను కేవలం కర్మలందురు. ఆ కర్మలనే నికృష్టములో సూర్యదేవుని దేవతల యొక్క తేనెగా పోల్చినారు. వస్వాది దేవతలకు ఆనందము కల్గించు కారణముచే తేనెలాంటి తేనె అను (దేవమధు) దృష్టి ద్వారా ఉపాసింపవలయును). దీని వలన ఐశ్వర్యాదులు లభించును. అనగా కేవల కర్మల కంటే ఉపాసన సహితకర్మలకు ఫలము ఎక్కువ. సకామ కర్మముల ద్వారా స్వర్గలోకాది ప్రాప్తి కలుగును. క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి సకామ కర్మముల ఫలము నశించును. ఈ కర్మలనే నిష్కామ భావముతో ఆచరించినచో చిత్తశుద్ధి ద్వారా క్రమముక్తి కలుగును. కర్మోపాసన ఫలము బ్రహ్మప్రాప్తి వరకు (అనగా సృష్టికర్త బ్రహ్మ అగును). కాని జ్ఞానము ద్వారా జీవన్ముక్తి లభించును. కనుక జ్ఞానమే ముక్తి హేతువు. నిష్కామ వైరాగ్యములు ఉత్పన్నమై శ్రవణ, మనన, నిధిధ్యాసములు చేసి జీవించియుండగనే ముక్తి అర్హతను పొందును, పై విధముగా క్రమముక్తి యందు, కర్మోపాసనలకు జ్ఞానమునకు సంబంధము కలదు.

**11.** మోక్షము జ్ఞానమార్గము వల్లనా ? భక్తి మార్గము వల్లనా ? త్వరగా దీనివలన లభిస్తుంది ?

జ॥ ఋతే జ్ఞానాన్నముక్తి జ్ఞానము లేక ముక్తి కలుగదు, దదామి బుద్ధి యోగంతంయేన మాముపయాన్తితే ఈ వాక్యములో కృష్ణ పరమాత్మ భక్తి యోగము ద్వారా నన్ను పొందిన వారికి జ్ఞానయోగ సాధనములను సమకూర్చెదను అని ఉద్ఘోషించెను.

శ్రీరామకృష్ణ పరమహంస చాలాకాలము కాళీమాతను సేవించి ఆమె దర్శనమును పొందిరి. తరువాత అఖాడాకు అధ్యక్షులైన తోతాపురిగారు వారిని వెదకుచు హరిద్వారము నుండి దక్షిణేశ్వరము చేరిరి, పరమహంస వారికి సమాధిని గురించి చెప్పి సమాది నిష్ఠులు కమ్మనిరి. వారి ఏకాగ్రమునకు భ్రూమధ్య ప్రదేశములో ఒక గాజుముక్కను కూడా గ్రుచ్చిరి. పరమహంసవారు నిర్వికల్ప సమాధినిష్ఠను ఆరంభించగా, కాళీమాత విగ్రహము ఆయన మనస్సులో మెదిలెడిది. జ్ఞానమనెడి ఖడ్గముచే ఆ రూపమును ఖండించిన తరువాతనే మూడు దినములవరకు సమాధి నిష్ఠులు కాగలిగిరి. మరి యొక మాట త్రాడు యందలి పాము భ్రమ, త్రాడు జ్ఞానముచే భ్రమ నశించును. జ్ఞానోత్పత్తి అనంతరము ఏ విధమైన కర్మ చేయవలసిన

అవసరము లేదు. అట్లే అనాది కాలమునుండి వచ్చుచున్న అజ్ఞానము. దాని కార్యము అధ్యాసము జ్ఞానముచే నశించి, జీవ బ్రహ్మైక్యమును పొందింపజేయును, చిత్తైకాగ్రమునకు అధర్మాది పాపములను నశింపచేయుటకు సాకార, సగుణోపాసన అవసరమైనను ఆ భక్తి ద్వైతమునందే అంతమగుచున్నది. కాని శ్రుతిలో ద్వితీయాద్వైభయం భవతి అని ద్వైతము నిందింపబడెను. అభయము అద్వైతజ్ఞానము ద్వారానే లభించును. దానికి జ్ఞానమొక్కటే మార్గము అనగా జ్ఞానమార్గము వల్లనే ముక్తి లభించును. వైరాగ్యము, శమదమాది షట్ సంపత్తి కలవారు శ్రవణ మనన నిధిధ్యాసన రూపమైన జ్ఞానమార్గమునకు అధికారులు. ఈ గుణములు లేనివారు సన్న్యసించిన యెడల మొదట ఈ గుణములను అభివృద్ధి చేసికొనవలయును. ఆ తరువాతనే జ్ఞానావరోధములు తొలగును.

**12.** ప్రేమభావం పెరిగి ద్వేషభావం పోయేదెప్పుడు ?

జ॥ ప్రతీమనిషి తనయొక్క సంస్కారములకు వశీభూతుడై యుండును. దీనినే గీతాచార్యులు ప్రకృతింయాంతి భూతాని అనిరి. కాని వివేకశీలురు, బుద్ధిమంతులు సంస్కారములకు స్థానమైన మనస్సు జడమనియు తాను చైతన్యస్వరూపుడనియు మననము చేయుచు ద్వేషాది దోషములను తొలగించుకొందురు. సాధారణ జనులు గీతలో చెప్పబడిన దైవీ సంపదను పెంచుకొనినచో చాలును. వాటిలో ముఖ్యముగా దానము, నిస్స్వార్థత, సరళత, అహింస, త్యాగము, క్రోధరాహిత్యము, దయ, క్షమ (ఒకరాయి వానజల్లును సహించినట్లు సాధువులు పెద్దవారి మాటలను, చేతలను సహింతురు) మొదలైన గుణములు ప్రధానమైనవి. ఈ గుణములను అనుసరించుట కష్టమైనచో నిరంతర ఇష్టదేవతా స్మరణమువలన అన్ని దోషములు నెమ్మదిగా తొలగి, సద్గుణములు పెంపొందును.

ఎవరి పుణ్యాపాపములనువారు అనుభవించుచున్నను సామాన్యజనులు దోషబుద్ధి యందు, దోషారోపణయందు రుచి మరగినారు దోషములను ఎక్కువగా చూచుటవలన అదే ద్వేషముగా మారును. సృష్టి స్థితి లయ కారకుడు వారి వారి సంస్కారముల అనుసారముగా ఫలితములనిచ్చుచున్నాడు. ఆ పరమాత్ముని త్రోవలో అడ్డువచ్చుటకు దోషమును చూచుటకు మనకు అధికారమేమున్నది ?

ఒక కుష్ఠురోగి చాల బాధపడుచు ఒక మహాత్ముని శరణుజొచ్చెను. వారి ఆదేశము ప్రకారముగా ఆ రోగి ఊరి వెలుపల పాకలో తన కూతురుతో ఉంటూ జపధ్యానములయందు నిమగ్నుడయ్యెను. కూతురు కేవలము తండ్రికి సేవ చేయుచుండెను. కాని ఊరిలో వారందరు అసలే కుష్ఠురోగి దీనితోపాటు కూతురుతో సంబంధమును పెట్టుకొనినాడు అని చెప్పుకొనుచుండెడివారు. ఆరు నెలలలో ఈ దోషారోపణమువల్ల ఆ కుష్ఠిరోగి పాపము నశించి, ఊరిలో వారందరిపై వ్యాపించెను. అతని రోగము పూర్తిగా నశించెను. కనుకనే మన మెల్లప్పుడు దోషబుద్ధిని వదలి, అందరిలో సద్గుణములను చూచుచున్నచో ద్వేషబుద్ధి నశించును.

# 6. యోగ సంబంధమైన ప్రశ్నలు – జవాబులు

**1.** ప్రాణాయామము ఎట్లు చేయాలి ? ఏకాగ్రత ఎట్లు వస్తుంది ? జ్ఞానసముపార్జన మెట్లు ?

జ॥ ప్రాణాయామము అష్టాంగములలో ఒకటి, దీనిని సరిగ్గా అభ్యసించినట్లయితే ఏకాగ్రత కలుగుతుంది. కాని సరియైన గురువుల దరిజేరియే ఈ ప్రాణాయామమును నేర్చుకొనవలయును. లేనిచో విపరీత ఫలితములు కలుగును. ప్రాణాయామము చేయుచున్న ఒక వ్యక్తిని నేను చూచితిని. అతడు ఒక్క నిముషము కూడా సరిగ్గా కూర్చుండుట లేదు. ఎల్లప్పుడు కాళ్ళను చేతులను కదిలిస్తూనే ఉంటాడు. మనస్సు ఏకాగ్రమైనచో ఇటువంటి బాహ్య చేష్టలుండవు. కనుక సరియైన గురువులనుండియే ప్రాణాయామమును నేర్చుకొనవలయును.

సర్వకాల సర్వావస్థలయందు అనగా : నిరంతరము భగవన్నామమును స్మరించుటవలన, చిరకాల చింతనాభ్యాసము వలన ఏకాగ్రత కలుగును అభ్యాసేతున కౌంతేయ! వైరాగ్యేణచ గృహ్యాతే అన్నట్లు అంతరిక వైరాగ్యము, మమతారాహిత్యము అత్యవసరము.

తక్కువ చదివి, ఎక్కువ అభ్యాసము చేయుటవలన మంచి కలుగును మీరు జ్ఞాన సముపార్జన అనగా : పుస్తకజ్ఞానమును గురించి అడిగితిరి. సా విద్యా యావిముక్తయే ఏది ముక్తి నిచ్చునో అదియే విద్య (అనగా జ్ఞానము) ముక్తికి తోడ్పడు జ్ఞానము నుపదేశించి పుస్తకములను చదువుటలో దోషము లేదు.

**2.** స్వరజ్ఞానము ఆధ్యాత్మిక ఉన్నతికి దోహదకారియా ? ఆరోగ్యము చక్కదిద్దునా ?

జ॥ స్వర తత్త్వంతథాయుద్ధం దేవివశ్యంస్త్రియాస్తదా ! గర్భాదానంచ రోగశ్చ కళార్ధేనైవ ముచ్యతే

స్వర జ్ఞానము తెలిసినచో యుద్ధవిజయము. స్త్రీ వశీకరణము, గర్భాదానము, రోగములు నివారింపబడుట అర్థఘుడియలోనే పొందగలరు. అనగా అర్ధ నిమిషములోనే జయము కలుగును. ఇది స్వర జ్ఞానము యొక్క సర్వోత్కృష్టమైన ఫలము. ఋతే జ్ఞానాన్నముక్తిః బ్రహ్మాత్మైక్య జ్ఞానము లేనిదే ముక్తి లేదు. కావున స్వరజ్ఞానముచే లోక ప్రసిద్ధి కలుగును. కాని ముక్తి కలుగదు.

**3.** అస్పర్శయోగ మనగా నేమి ? దానిని అనుష్ఠించుటకు మార్గములేవి ?

జ॥ సూక్ష్మ భూతములు సమిష్టి సత్త్వాంశములచే మనోబుద్ధి చిత్తాహంకారములు నిర్మింపబడినవి. ఇవియున్నియును జడ పదార్థములు. ఆత్మ చైతన్యము వీటియందు ప్రతిబింబించుటచే ఇవి చేతనములవలె కానబడును. మోక్షము బడసిన జీవునికి ఘటాకాశము మహాకాశములో లీనమైన రీతిగా చైతన్యము ఒకటే యగును. తస్య ప్రాణాః ఇహైవ ప్రలీయంతే తస్య = జ్ఞానియొక్క, ప్రాణాః = ఇంద్రియములు, ఇహైవ = ఇచ్చటనే (వాటి వాటి కారములలో), ప్రలీయంతే = లీనమగుచున్నవి, సూక్ష్మ భూతములు సూక్ష్మ భూతములలోను, స్థూల భూతములు పంచమహా భూతములలోను లీనమగును. ఆ యాత్మను ఏ భూతము గాని, ఏ అజ్ఞానము గాని స్పర్శింపదు. ఇదియే అస్పర్శయోగము అని చెప్పబడును. మనస్సు తన

కారణమునందు లీనమగుట, ఆత్మను స్పర్శింపకుండుటయే అస్పర్శము. నిష్కామకర్మ, వేదాంత శ్రవణము, మననము నిధిధ్యాసనలు, (జపాత్ సిద్ధిః యజ్ఞానాం జ యజ్ఞోఽస్మి) జపము మొదలగునవి ఈ అస్పర్శ యోగం సిద్ధించుటకు మార్గములు, పై మార్గములను అవలంబించు వారికి సత్య వాక్యపరిపాలనము, ఇంద్రియ నిగ్రహము, బ్రహ్మచర్యము, దానము మొదలగు గుణములు ఉండి తీరవలయును.